ఖుర్ఆన్ దేవుని గ్రంథమేనా?

డా.జాకీర్ నాయక్

ఖుర్ఆన్ దేవుని గ్రంథమేనా?

మూలం
డా.జాకీర్ నాయక్

అనువాదం
SK. జానీమియా B.Sc, B.Ed.

ముందుమాట

ఇస్లామీయ ప్రపంచంలో డా.జాకీర్ నాయక్ గారు ఎవరో తెలియని వారు ఎవరూ ఉండరు. ఆయన గత కొన్ని సంవత్సరాల క్రితం బొంబాయి లోని IRF కేంద్రంలో Is the Quran God’s word? అనే అంశంతో ఆంగ్లంలో ఒక ప్రసంగం చేసి ఉన్నారు. ఆ ప్రసంగ తెలుగు అనువాదమే ఈ పుస్తకం. ఈ పుస్తకం చదవడం ద్వారా పాఠకులు తమ సందేహాలు దూరం చేసుకోగలరు అని ఆశిస్తున్నాను..........(అను)

అనంత కరుణామయుడు అపార కృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో ప్రారంభిస్తున్నాను.

టైటిల్: ఖుర్ఆన్ దేవుని గ్రంథమేనా?

డాక్టర్ జాకీర్ నాయక్ గారి Is the Quran God's word? అనే ఆంగ్ల పుస్తక అనువాదం. వారు ఈ ప్రసంగంను బాంబే లో చేసి ఉన్నారు.

డాక్టర్ జాకీర్ నాయక్ గారు తన ప్రసంగంను ఈ విధంగా ప్రారంభించారు. అఊజు బిల్లాహి మినష్షైతానిర్రజీమ్ బిస్మిల్లా హిర్రహ్మా నిర్రహీం. గౌరవనీయులైన ముఖ్య అతిధి శ్రీ రఫీఖ్ దాదా గారు మరియు ఇతర ప్రముఖులందరినీ నేను ఇస్లామీయ పద్ధతిలో అభివాదం చేయుచూ ఈ కార్యక్రమానికి స్వాగతం పలుకుతున్నాను. అస్సలాము అలైకుమ్ వ రహమతుల్లాహి వ బరకాతుహ్.. అనగా మహోన్నతుడైన అల్లాహ్ యొక్క శాంతి, శుభం, కరుణ మీ అందరిపై కురియుగాక.. ఈ శుభోదయం యొక్క ప్రసంగ విషయం 'ఖురాన్ దైవ గ్రంథమేనా'?

ఇస్లాం స్థాపన గురించి అపోహలు

ఇస్లాం మతమును మహాప్రవక్త ముహమ్మద్ గారు స్థాపించారని చాలామంది పొరబడుతున్నారు. నిజానికి, మానవుడు భూమిపై కాలుమోపిన నాటినుండి ఇస్లాం ఉంది. మహోన్నతుడైన దేవుడు ఈ భూలోకానికి చాలా మంది ప్రవక్తలను మరియు గ్రంథాలను పంపించి ఉన్నాడు. పరిశుద్ధుడైన అల్లాహ్ చే పంపబడిన గత ప్రవక్తలందరూ వారి కాలాలలో ఒక ప్రత్యేక జాతి కొరకు

పంపబడినారు మరియు ఆ ప్రవక్తల సందేశం ఒక ప్రత్యేక కాలానికి పరిమితమైనది. ఆ కారణంగానే వారిచే ప్రదర్శించబడిన మహిమలు ఉదాహరణకు సముద్రమును రెండుగా చీల్చడం, మరణించినవారిని బ్రతికించగలగడంలాంటివి కేవలం ఆనాటి ప్రజలను మాత్రమే సంతృప్తి పరచగలిగినాయి, కానీ నేటి ప్రజలచే వాటిని పరీక్షించి, నిర్ధారించుకోవడం వీలుకాదు.

సర్వ మానవాళికి మహోపకారిగా మహాప్రవక్త ముహమ్మద్ పంపబడినారు.

కరుణామయుడైన దైవం, సర్వ మానవాళి కొరకు చిట్టచివరి ప్రవక్తగా మహాప్రవక్త ముహమ్మద్(స) ను పంపాడు మరియు వారి సందేశం ప్రళయం వరకు పుట్టే సర్వ మానవాళి కొరకు ఉద్ధేశించబడినది. దివ్యఖుర్ఆన్ లో 21 వ అధ్యాయమైన "అంబియా"లో ఇలా తెలియజేయబడింది.

"ఓ ప్రవక్తా! మేము నిన్ను ప్రపంచ మానవులకు కారుణ్యం గా పంపాము."

(21:107).

మహాప్రవక్త ముహమ్మద్(స) గారు చిట్ట చివరి దైవ ప్రవక్త మరియు వారి సందేశం ప్రళయం వరకు రాబోవు ప్రజలను ఉద్ధేశించబడింది. కావున వారికి దైవం చే ఇవ్వబడిన మహిమలు అన్ని కాలాల ప్రజలచే అన్ని సమయాలలో పరీక్షించి, నిర్ధారణ చేయదగినవి కావలెను. హదీసులలో తెలియజేసినట్లు మహాప్రవక్త ముహమ్మద్(స) గారు సందర్భానుసారం చాలా

మహిమలు ప్రదర్శించినప్పటికీ,వారు ఎన్నడూ వాటికి ప్రాముఖ్యత ఇవ్వలేదు. కానీ ముస్లింలు అందరూ ఆ అన్ని మహిమలనూ విశ్వసిస్తారు.

చిట్టచివరి గొప్ప మహిమ దివ్యఖుర్ఆన్

మహాప్రవక్త ముహమ్మద్(స) గారికి అల్లాహ్ చే ఇవ్వబడిన అద్భుతమైన చిట్టచివరి మహిమ "దివ్యఖుర్ఆన్". ఇది అన్ని కాలాలకు సంబంధించిన మహిమ. ఇది 1400 సంవత్సరాల క్రితం ఒక గొప్ప మహిమగా తనకు తాను నిరూపించుకుంది. ఈ దివ్యఖుర్ఆన్ ను ఇప్పుడు మరియు ఎప్పుడైనా సరే తిరిగి నిర్ధారించుకోవచ్చు. ఒక్క మాటలో చెప్పాలంటే, ఈ ఖురాన్ మహిమలకే గొప్ప మహిమ. ఈ అంతిమ దైవ గ్రంథం గురించి ముస్లింలు మరియు ముస్లిమేతర సోదరుల మధ్య ఏకాభిప్రాయం ఉన్న విషయం కేవలం ఒక్కటే, అదేమనగా,ఈ దివ్యఖుర్ఆన్ మొదటిసారిగా పఠించబడింది ముహమ్మద్(స) గారిచే. ఆయన అరేబియాలోని మక్కా నగరంలో ఆరవ శతాబ్దంలో జన్మించాడు. అయితే ఈ దివ్యఖుర్ఆన్ గూర్చి ప్రాథమికంగా మూడు రకాలైన అభిప్రాయాలు ఉండగలవు. మొదటిది ఏమనగా ఈ దివ్యఖుర్ఆన్ ను మహాప్రవక్త ముహమ్మద్(స) గారు చేతన లేక అచేతన అవస్థలో రచించారు. రెండవది ఈ దివ్యఖుర్ఆన్ ను మహాప్రవక్త ముహమ్మద్(స) గారు ఇతర మానవుల నుండి లేక ఇతర మత గ్రంధాల నుండి గ్రహించారు. మరియు మూడవది ఏమనగా ఇది దైవం అవతరింపజేసిన గ్రంథం. దీని రచయిత మానవమాత్రుడు కాడు.

ఈ రోజు మనం ఈ మూడు ప్రాధమిక అభిప్రాయాలను పరీక్షిద్ధాం. మొదటిదేమనగా దివ్యఖుర్ఆన్ ను మహాప్రవక్త ముహమ్మద్(స) గారు స్వతహాగా చేతన లేక అచేతనావస్థలో రచించారు అని. ఇది చాలా అసాధారణం మరియు అరుదు, అదేమనగా ఒక గొప్ప పనిని తాను చేయలేదంటున్న వ్యక్తిని, ఆ పని అతనే చేశాడని ఆరోపణ చేసి, నిజం చేసే ప్రయత్నం చేయుట. అది సాహిత్యపరంగానైనా, వైజ్ఞానిక పరంగానైనా లేక మరే విధంగానైనా సరే. కానీ దివ్యఖుర్ఆన్ రచయిత మహాప్రవక్త ముహమ్మద్(స) గారే అని, ఈ విమర్శకులు చేస్తున్న ఆరోపణ కూడా కచ్చితంగా అలాంటిదే.

దివ్యఖుర్ఆన్, అల్లాహ్ తరపునుండి అవతరించిన గ్రంథం అని మహాప్రవక్త ముహమ్మద్(స) సదా చెబుతుండేవారు.

దివ్యఖుర్ఆన్ ను తానే స్వయంగా రచించానని మహా ప్రవక్త మహమ్మద్(స) గారు ఏనాడూ చెప్పలేదు. వాస్తవానికి, ఆయన ఎల్లప్పుడూ, దివ్యఖుర్ఆన్, అల్లాహ్ తరపునుండి అవతరించిన గ్రంథం అని చెబుతూ ఉండేవారు. దీనికి విరుద్ధంగా ఆలోచించడం తర్కం అనిపించుకోదు మరియు దానర్ధం ఆయన అబద్ధం చెబుతున్నారు అని వస్తుంది. దైవం క్షమించు గాక.... చరిత్ర ద్వారా మనకు తెలిసేదేమిటంటే, ఆయన గారు 40 సంవత్సరాల వయసు వరకు అంటే ప్రవక్తగా నియమించబడే వరకు ఏనాడూ, ఎటువంటి అసత్యం పలకలేదని తెలుస్తుంది.

మరియు ఆనాటి ప్రజలందరూ ఆయనను నిజాయితీ పరునిగా, నీతిమంతునిగా, సత్యవంతుని గా కొనియాడేవారు. కేవలం ఆయనను అభిమానించే వారే కాదు, ఆయన విరోధులు సయితం

ఆయనను సాదిఖ్ అంటే సత్యసంధుడు అనీ, అమీన్ అంటే నమ్మకస్తుడు అని పిలిచేవారు అనడంలో ఎటువంటి సందేహం లేదు. ఆయన ప్రవక్తనని ప్రకటించుకున్న తర్వాత, దైవం క్షమించు గాక, ఆయనను అసత్యవాది అని చెప్పే వారు సయితం తమ వస్తువులను, ధనమును ఆయన వద్ద భద్రపరుచుకునేవారు. మరి అలాంటప్పుడు ఒక నిజాయితీపరుడు, తాను దైవ ప్రవక్త అని మరియు దివ్యఖుర్ఆన్ దైవ గ్రంథం అని అబద్ధం ఎందుకు చెబుతాడు.

ఇస్లాం విమర్శకులు చేసే ఆరోపణలను మనం ఇప్పుడు పరిశీలిద్దాం. కొందరేమంటారంటే, ప్రాపంచిక లాభాల కోసం, వస్తు సామాగ్రి కోసం, మహాప్రవక్త ముహమ్మద్(స) గారు దివ్యఖుర్ఆన్ ను స్వయంగా కల్పించి తాను దైవ ప్రవక్త గా చెప్పుకుంటున్నారు. ధనం కోసం, సంపద కోసం తమను తాము ప్రవక్తగా, మునులుగా,బోధకులుగా చెప్పుకునే ప్రజలు చాలామంది ఉన్నారని నేను కూడా ఒప్పుకుంటాను. ఇలాంటి వారు ఈ ప్రపంచంలో చాలామంది ఉన్నారు. ముఖ్యంగా మన భారతదేశంలో.

ప్రవక్త పదవి పొందిన తరువాత మహా ప్రవక్త ముహమ్మద్(స) గారు ఇంతకుముందు స్థితి కంటే కూడా ఆర్థికంగా బలహీనపడ్డారు. వారు 25 సంవత్సరాల వయసులో ‘ఖదీజా’ అనే ధనిక వ్యాపారస్తురాలిని వివాహమాడారు. ఆయన ప్రవక్తగా ఎంపిక అయిన తరువాతి జీవితంను, ప్రవక్తగా నియమించబడడానికి ముందు 15 సంవత్సరాల జీవితంతో పోలిస్తే అది అంతగా ఆశించదగినదిగా లేదు. రియాజుస్సాలిహీన్ అనే హదీసు

గ్రంథంలో 492 హదీసు ప్రకారం మన ప్రియ ప్రవక్త(స) గారి సతీమణి హజ్రత్ ఆయేషా గారి కథనం:

ప్రవక్త గారి ఇంట్లో వంట సరుకులు లేని కారణంగా రెండు, మూడు నెలల వరకు పొయ్యి ముట్టించబడని దినాలు చాలా గడిచేవి. ఆ కుటుంబీకులు కేవలం నీరు త్రాగి మరియు ఖర్జూర పండ్లు తిని, ఒక్కొక్కసారి మదీనా ప్రజలు ఇచ్చే మేక పాలు త్రాగి జీవితం గడిపేవారు. ఇది కేవలం ఒక తాత్కాలిక పరిస్థితి కాదు, ప్రవక్త గారి జీవిత విధానమే ఇది. అదే హదీసు గ్రంథములోని 465, 466 హదీసుల ప్రకారం హజ్రత్ బిలాల్ (రజి) ఇలా అన్నారు: మహా ప్రవక్త(స) గారికి ఏవైనా బహుమానాలు, ఆహార సరుకులు లభిస్తే వెంటనే వారు వాటిని నిరుపేదలకు మరియు అవసరార్థులకు ఇచ్చేవారు. ఏనాడూ వాటిని తన కోసం ఉంచేవారు కాదు. మరి అలాంటప్పుడు ప్రాపంచిక లాభాల కోసం మహా ప్రవక్త (స) గారు అబద్ధమాడుతున్నారని, అల్లాహ్ క్షమించు గాక... మీరెలా సందేహిస్తున్నారు? మీ ఈ సందేహాన్ని తిరస్కరించే వాక్యం ఒకటి దివ్యఖుర్ఆన్ లో ఇలా ఉంది.

"షరీయత్ గ్రంథాన్ని స్వహస్తాలతో రచించి, తద్వారా తుచ్ఛ ప్రయోజనం పొందే నిమిత్తం ఇది అల్లాహ్ తరపు నుండి వచ్చింది అని ప్రజలకు చెప్పే వారికి వినాశనం తప్పదు. వారి ఈ స్వహస్త లిఖిత రచన కూడా వారి వినాశనానికి దారితీస్తుంది. వారి సంపాదన కూడా వారి సర్వనాశనానికి కారణభూతమవుతుంది.

(దివ్య ఖుర్ఆన్ - 2 :79)

ఈ వాక్యంలో స్వహస్తాలతో గ్రంథం రచించి ఇది దేవుని తరపునుండి వచ్చింది అని ప్రజలకు చెప్పే వారిని గూర్చి లేదా దేవుని వాక్యాలలో మార్పు చేసే వారిని గూర్చి చెప్పబడింది.

ఒకవేళ ఖుర్ఆన్ ను మహా ప్రవక్త ముహమ్మద్ (స) గారు స్వయంగా రచించి దానిని అల్లాహ్ కు ఆపాదించి ఉన్నట్లయితే, ఈ విషయం ఆయన జీవితంలో ఏదో ఒక సందర్భంలో బయట పడేది, అప్పుడు తానే ఒక గొప్ప వంచకుడుగా పిలువబడేవాడు మరియు తన గ్రంథంలో తనను తాను శపించుకుంటూ ఉండేవాడు. ఇంకా మరి కొందరు ఏమంటారంటే మహాప్రవక్త ముహమ్మద్ (స) గారు అధికారం, హోదా, కీర్తి మరియు నాయకత్వం పొందడానికి తానే స్వయంగా గ్రంథం రచించి అల్లాహ్ కు ఆపాదిస్తున్నారు అని. అయితే అధికారం, కీర్తి, హోదా మరియు నాయకత్వంలను ఆశించే వ్యక్తి లక్షణాలు ఎలా ఉంటాయి? ఒక్కసారి ఆలోచించండి. అలాంటి వ్యక్తి ఖరీదైన దుస్తులు ధరిస్తాడు.మంచి ఆహారం తింటాడు.గొప్ప గొప్ప భవనాలు, రాజ గృహాలలో నివసిస్తాడు. మరియు అతనికి రక్షక భటులు ఉంటారు. ఇలా ఎన్నో సౌకర్యాలు ఉంటాయి. మహాప్రవక్త ముహమ్మద్(స) గారి జీవితం నిరాడంబరతకు అద్భుతమైన నమూనా. మన ప్రియ ప్రవక్త ముహమ్మద్(స) గారు స్వయంగా మేక పాలు పిండే వారు. తన దుస్తులు తానే కుట్టుకునే వారు. తన చెప్పులను తానే బాగు చేసుకునే వారు. మరియు స్వయంగా ఇంటి పనులు చాలా సార్లు చేసేవారు. ఆయన వినయం, విధేయతలకు గొప్ప నమూనా. ఆయన నేలపై కూర్చునేవారు. ఆయన ఎటువంటి రక్షకభటులు లేకుండానే బజారులో సరుకులు కొనుటకు వెళ్లేవారు. ఎవరైనా బీదలు ఆయనను విందుకు ఆహ్వానిస్తే,

ఆయనకు ఏది వడ్డించబడినా ఆయన వారితో కలిసి సంతోషంగా భుజించేవారు. ఇంకా దివ్యఖుర్ఆన్ ఇలా అంటుంది.

"ఈ మనిషి ప్రతి ఒక్కరూ చెప్పే మాటలు వింటాడు."

(దివ్య ఖురాన్- 9: 61)

ఒకానొక సమయంలో అరబ్ బహుదైవారాధకులు నియమించిన ఉత్బా అనే రాయబారి మహాప్రవక్త ముహమ్మద్(స) గారి వద్దకు వచ్చి ఇలా అన్నాడు "ఒకవేళ నీవు, ప్రవక్త అని చెప్పుకోవటం మానివేసి నట్లయితే, మేము అరేబియాలోని సంపదనంతా నీ హస్తగతం చేసి, నిన్ను నాయకునిగా ఎన్నుకొని, అరేబియాకు చక్రవర్తిని చేస్తాం. అయితే నీవు చేయవలసింది ఏమనగా దేవుడు ఒక్కడే అనే సందేశం ప్రచారం చేయడం మాని వేయాలి". దానికి ప్రవక్త గారు అప్పుడే అవతరించిన సూరహ్ హామీమ్ అస్-సజ్దా ను వినిపించడం ద్వారా ఉత్బా యొక్క ప్రతిపాదనను తిరస్కరించారు. ఇలా చాలా సార్లు చేయడం జరిగింది. ఒకసారి ఆ బహుదైవారాధకులే ప్రవక్త గారి పినతండ్రి అబూ తాలిబ్ గారి వద్దకు ఒక ప్రతిపాదన తెచ్చారు. అదేమనగా "ఒకవేళ ప్రవక్త గారు తన సందేశ ప్రచారం మానివేసినట్లయితే, తనను అంటే ప్రవక్త గారిని అరేబియా మొత్తంలో ధనవంతుడిగా చేస్తామని చెప్పారు." దానికి ప్రవక్త(స) గారు ఇలా జవాబిచ్చారు....ఓ నా బాబాయీ! ఒకవేళ వారు నా కుడిచేతిలో సూర్యుడిని, ఎడమచేతిలో చంద్రుడిని పెట్టినా, ఎప్పటికీ నేను జీవించి ఉన్నంతకాలం ఈ సందేశంను ప్రచారం చేస్తూనే ఉంటాను. తాను ఆలోచించిన విధంగానే విజయం లభిస్తున్నప్పుడు ఒక వ్యక్తి కష్టాలు, త్యాగాల తో కూడిన జీవితం ఎందుకు కొనసాగిస్తాడు?

మరియు విజయం లభించిన ప్రతి సారీ ఆయన ఇలా అనేవారు "అల్లాహ్ సహాయం వలననే ఈ పని సాధ్యమైనది, ఇందులో నా గొప్పతనం ఏమీ లేదు".

మరికొందరు పాశ్చాత్యులు ఒక కొత్త సిద్ధాంతంతో ముందుకు వచ్చారు. అదేమనగా దైవం క్షమించుగాక, మహా ప్రవక్త ముహమ్మద్(స) గారు 'మైథోమానియా' అనే ఒక మానసిక వ్యాధితో బాధ పడుతున్నారు అని. ఈ వ్యాధికి లోనైన వ్యక్తి ఒక అబద్ధం చెప్పి ఆ అసత్యమునే, సత్యంగా నమ్ముతూ ఉంటాడు. కావున వారేమంటారంటే, దైవం క్షమించుగాక, మన ప్రవక్త ముహమ్మద్(స) గారు అసత్యం పలికి, దానినే సత్యంగా విశ్వసిస్తూ ఉండేవారు. సైకాలజిస్ట్ లు ఈ రకమైన వ్యాధికి లోనైన వారికి చికిత్స చేయుటకు, ఆ సైక్రియాటిస్ట్ వారిని సత్యమైన ప్రశ్నలు అడుగుతాడు. ఎందుకంటే ఈ వ్యాధిగ్రస్తులు సత్యంను ఎదుర్కోలేరు. ఉదాహరణకు తనకు తాను ఇంగ్లాండ్ రాజు గా భావిస్తున్న ఒక వ్యక్తిని సైక్రియాటిస్ట్ పిచ్చివాడని, వెర్రివాడని అతనితో చెప్పడు. అతనితో ఇలా అంటాడు 'సరే నిజంగా నీవు రాజువే అయితే, నీ రాణి ఏది?' దానికి జవాబుగా అతను ఇలా అంటాడు. ఆమె నా అత్తగారింటికి వెళ్ళింది. మరి నీ మంత్రి గారు ఎక్కడ? జవాబుగా ఆ వ్యక్తి ఇలా అంటాడు 'అతను చనిపోయాడు'. మరి నీ రక్షకభటులుఏరి? ఇలా అతనిని సత్య ప్రశ్నలు అడిగినప్పుడు, చివరికి అతను ఇలా అంటాడు నేను ఇంగ్లాండ్ రాజు కాదనుకుంటా. ఖుర్ఆన్ అచ్చంగా ఇదే చేసింది.

ఖుర్ఆన్, ప్రజలను సత్య ప్రశ్నలను అడిగి చర్చించింది.

నిజానికి ప్రవక్త ముహమ్మద్(స) గారు Mythomaniac కాదు. ఈ ప్రజలే mythomaniac. ఎందుకనగా వారు ఏమంటారంటే మహాప్రవక్త ముహమ్మద్(స) గారు అబద్ధమాడారు మరియు ప్రజలు దానిలో విశ్వాసం ఉంచుతున్నారు. ఇలాంటి ప్రజలను ఖుర్ఆన్ సత్య ప్రశ్నలతో చర్చకు ఆహ్వానించింది. ఒకవేళ మీకు సందేహం ఉంటే లేక ఖుర్ఆన్ అబద్ధముగా కల్పించబడినది అని మీరు భావిస్తే ఆ పని మీరూ చేయండి. ఖుర్ఆన్ అల్లాహ్ గ్రంథం కాదని మీరు భావిస్తే మరి ఎక్కడిది? ఇలా అనేక ప్రశ్నలను సంధించింది. దైవం తలిస్తే ఈ ప్రసంగంలో అలాంటి ప్రశ్నలను చూడవచ్చు. మరి కొందరు ఒక కొత్త సిద్ధాంతంతో ముందుకు వచ్చారు. అదేమనగా 'మత వంచన' సిద్ధాంతం లేక 'అచేతనావస్థ' సిద్ధాంతం. దైవం క్షమించు గాక, వీరి ప్రకారం మహాప్రవక్త ముహమ్మద్(స) గారు అచేతనావస్థకు లోనై తనకు తెలియకుండానే ఖుర్ఆన్ వెలువరిస్తున్నారు అని, మరి కొందరు ఆయనను పిచ్చివాడు అన్నారు, దైవం క్షమించు గాక. వారి ఈ ఆరోపణను మనం విశ్లేషించి పరిశీలిద్దాం. ఈ ఆరోపణ చేస్తున్నవారు ఒక విషయాన్ని గుర్తించడంలో విఫలమయ్యారు అదేమనగా ఖుర్ఆన్ పూర్తిగా ఒకేసారి ఒకే సమయంలో అవతరించలేదు. అది 23 సంవత్సరాల దీర్ఘకాలంలో సందర్భానుసారం విడి విడి భాగాలుగా అవతరించింది. వారు అంటున్నట్లుగానే ఒకవేళ ఖుర్ఆన్ ఒక అచేతనావస్థకు గురైన మది నుండి లేదా వెర్రివాడి మది నుండి వెలువడినట్లయితే ఈ ఖుర్ఆన్ అంత స్థిరంగా, పొందికగా, అనుగుణ్యంగా, అవిరుద్ధంగా ఉండేది కాదు. మరియు ప్రతిదీ తన అచేతనావస్థ మది నుండి వస్తున్నప్పుడు, ఒక వ్యక్తి తాను ప్రవక్తనన్న అపోహలో 23 సంవత్సరాల కాలం పాటు ఉండలేడు.

వారి ఈ ఆరోపణను అసత్యమని నిరూపించే సత్య వాక్యాలు చాలా దివ్యఖుర్ఆన్ లో ఉన్నాయి. ఉదాహరణకు, ప్రవక్త(స) గారి కాలంలో ఏ ఒక్కరికీ తెలియని చారిత్రక సంఘటనలను ఖుర్ఆన్ ప్రస్తావించింది. అలాగే చాలా భవిష్య విషయాలు తెలియజేయబడినాయి. కొంతకాలం తరువాత అవి నిజంగా జరిగినవి. మరియు ఆనాడు తెలియని చాలా విజ్ఞాన శాస్త్ర సత్యాలు ఎన్నో ఖుర్ఆన్ లో ఉన్నాయి. అవి ఈనాడు ధృవపరచబడినాయి. ఒక అచేతనావస్థకు గురయిన మది నుండి లేక పిచ్చి వాని మది నుండి ఇలాంటి శాస్త్రపరమైన విషయాలు వెలువడడం అనేది అసాధ్యం. ఇదే విషయాన్ని ఖుర్ఆన్ ఇలా తెలియజేస్తుంది. **"తమ మిత్రుని పై ఉన్మాద ప్రభావం ఏదీ పడలేదు అనే విషయం గురించి వారు ఎప్పుడూ ఆలోచించలేదా? అతను హెచ్చరిక చేసేవాడు మాత్రమే."(అల్ ఆరాఫ్ 7: 184).** పై విషయాన్ని ఖుర్ఆన్ లోమరొక చోట ఇలా తెలుపబడింది "**నీ ప్రభువు దయవల్ల నీవు పిచ్చివాడు కావు" (అల్ ఖలం 68: 2).** మరొక చోట **"మీ సహచరుడు పిచ్చి వాడు కాదు" (అత్ తక్వీర్ 81: 22).** పై చర్చ ద్వారా తెలిసిందేఏమనగా వారి ఆరోపణ అసత్యమైనది.

ఇక రెండవ ప్రాథమిక అభిప్రాయం ఏమనగా మహాప్రవక్త ముహమ్మద్(స) గారు ఈ ఖుర్ఆన్ ను ఇతర మత గ్రంథాల నుండి చూచి వ్రాసారు అని, లేక ఇతర మానవ వనరుల నుండి పొందారు అని. వారి ఈ సిద్ధాంతంను అసత్యం అని నిరూపించుటకు ఒక చారిత్రక సత్యం చాలు. అదేమనగా మన ప్రియ ప్రవక్త ముహమ్మద్(స) గారు నిరక్షరాస్యులు.ఈ విషయం ఆనాటి మక్కా

బహుదైవారాధకులకు బాగా తెలుసు. ఈ విషయాన్నే ఖుర్ఆన్ ఇలా స్పష్ట పరిచింది **ప్రవక్తా! నీవు ఇంతకు పూర్వం ఏ గ్రంథాన్ని చదివే వాడవు కావు. నీ చేతితో వ్రాసేవాడవూ కావు. ఒకవేళ అలా జరిగి ఉంటే,అసత్యవాదులు అనుమానానికి లోనే ఉండేవారు. (అల్ అన్కబూత్ 29: 48).**

ప్రజలు, ఖుర్ఆన్ మూలం గురించి అనుమానానికి లోనవుతారు అన్న విషయం అల్లాహ్ కు తెలుసు. అందుకే ఆయన తన చిట్ట చివరి సందేశహరునిగా చదవడం, రాయడం రాని నిరక్షరాస్యుడైన ముహమ్మద్(స)ను ఎన్నుకున్నాడు. ఒకవేళ ప్రవక్త గారు అక్షరాసి అయినట్లయితే, ఈ అసత్యవాదులకు, వదరుబోతులకు, మనుష్యద్వేషులకు మరియు విమర్శకులకు, మహా ప్రవక్త ముహమ్మద్(స) గారు ఖుర్ఆన్ ను ఏదో ఒక చోట నుండి చూసి వ్రాసి దానికి కొత్త రూపం ఇచ్చారు అని చెప్పే అవకాశం లభించేది. అల్లా క్షమించు గాక. వారి ఈ ఆరోపణ కూడా తిరస్కరించబడింది. **భూమ్యాకాశాల ప్రభువు అవతరింపజేసినది ఖుర్ఆన్** ఉపన్యాసం కు ప్రారంభంలో సోదరుడు అష్రఫ్ ముహమ్మద్ ఖుర్ఆన్లోని 32 వ అధ్యాయం 'అస్ సజ్దాహ్'లోని 1 నుండి 3 వాక్యాలు పఠించాడు.దాని అనువాదం "**అలీఫ్ లామ్ మీమ్. నిస్సందేహంగా ఈ గ్రంథం సకలలోకాల ప్రభువు తరఫునుండి అవతరించింది. దీనిని స్వయంగా ఈ వ్యక్తియే కల్పించాడని వారు అంటున్నారా? కాదు, ఇది నీ ప్రభువు తరఫునుండి వచ్చిన సత్యం. నీకు పూర్వం హెచ్చరించేవారెవరూ రాని జాతికి నీవు హెచ్చరిక**

చేసేందుకు, బహుశా వారు మార్గదర్శకత్వం పొందుతారేమో అని".

మానవ రచనలైన కథల పుస్తకాల పద్ధతులను పోలిన ఇతర మత గ్రంథాల లాంటిది కాదు ఈ గ్రంథం. సాధారణంగా కథల పుస్తకాలు ఎలా మొదలవుతాయి? అనగనగా ఒక రోజు....., ఒక నక్క మరియు ద్రాక్ష, తోడేలు మరియు గొర్రె పిల్ల ఇలా మొదలవుతాయి. ఇదేవిధంగా ఇతర గ్రంథాలు చదివినట్లయితే, వాటిలో కూడా 'మొదట దేవుడున్నాడు, ఆయన భూమ్యాకాశాలను సృష్టించాడు. మొదట్లో వాక్యము ఉండేది.' అని ఉంది. మానవ రచనా పద్ధతి ని పోలిన ఇతర మత గ్రంధాల వలె, ఖుర్ఆన్ ప్రారంభంలో అలాంటి మానవ రచనా పద్ధతులేమీ లేవు. ఇతర గ్రంథాలు ఒక ప్రత్యేక వ్యక్తి గూర్చి, అతని కుటుంబం గురించి మరియు అతని సంతానం గూర్చి ఒక క్రమంలో అధ్యాయం 1, అధ్యాయం 2, అలా శ్రేణిలో ప్రస్తావిస్తాయి. ఖుర్ఆన్ కూడా ప్రజల గూర్చి, వారి కుటుంబం, వారి సంతానం గూర్చి చర్చిస్తుంది. కానీ మానవుల చే రచించబడిన కథల పుస్తకాల పద్ధతులను పోలిన క్రమంలో మాత్రం కాదు.

ప్రజలు ఖుర్ఆన్ ను మానవ రచిత గ్రంధంగా నిరూపించలేక, దానిని మోసం అంటున్నారు.

ఖుర్ఆన్ తనదైన ఒక ఏకైక శైలిని కలిగి ఉంది. అది ఒక ఏకైక ప్రత్యేక గ్రంథం. ఈ ప్రజలు ఖుర్ఆన్ ను మానవ రచిత గ్రంథం అని నిరూపించలేక చివరగా దానిని 'వంచన' అని

అంటున్నారు. వారు అలా అని దానిని విశ్వసించటానికి వారి వద్ద కనీసం ఒక్క ఆధారం గాని లేక కారణం గాని లేదు. మరియు వారు ఖుర్ఆన్ లో వంచన పరమైన ఒక్క వాక్యం కూడా చూపించలేకపోయారు. అలా అని వారు తమను తాము మూర్ఖులుగా చేసుకొని దానికే అంటుకొని ఉంటున్నారు. ఉదాహరణకు, ఒకవేళ నేను ఒక ప్రత్యేక వ్యక్తిని ఎటువంటి కారణం లేకుండానే నా శత్రువుగా భావిస్తే, ఆ వ్యక్తి నాకు ఎదురు పడిన క్షణంలో నా అపోహ కారణంగా నేను అతనితో శత్రువులా ప్రవర్తిస్తాను. ప్రతిచర్యగా అతను కూడా నాతో నా శత్రువులా ప్రవర్తిస్తాడు. అప్పుడు నేను నా మొదటి అభిప్రాయం సరి అయినదిగా సంతృప్తి చెందుతాను. ఒకవేళ నేను తప్పుడు భావన ఏర్పరుచుకోనట్లయితే, ఆ వ్యక్తి కూడా నాతో నా శత్రువులా ప్రవర్తించి ఉండేవాడు కాదు. కావున ప్రజలు ఎటువంటి ఆధారం లేకుండానే కొన్ని విషయాలను నమ్మి, తమను తాము మూర్ఖులుగా మార్చుకొని, దానికే అంటిపెట్టుకొని ఉంటున్నారు.

ఖుర్ఆన్, చర్చను మరియు తార్కిక ఆలోచన ను ప్రోత్సహిస్తుంది

ఖుర్ఆన్ అవతరణ, తర్కానికి సమాంతరంగా ఉంటుంది. కొందరేమంటారంటే, పవిత్ర గ్రంథాలు తార్కిక ఆలోచనకు అనుమతించవు. ఒకవేళ అవి తార్కిక ఆలోచనకు, చర్చకు అనుమతించకపోతే వాటిలో మనం ఏవి సత్యమైనవో, ఏవి అసత్యమైనవో ఎలా తెలుసుకోగలం? యదార్థమేమిటంటే, ఖుర్ఆన్ హేతుబద్ధ ఆలోచనను మరియు చర్చను కూడా

ప్రోత్సహిస్తుంది. చాలామంది ముస్లింలు ఏమంటారంటే నీవు మతపరమైన చర్చ, డైలాగులను చేయవద్దు. అటువంటి వారు చాలా పొరబడుతున్నారు. ఎందుకనగా ఖుర్ఆన్ ఇలా అంటోంది... **ప్రవక్తా! నీ ప్రభువు మార్గం వైపునకు ఆహ్వానించు, వివేకంతో చక్కని హితబోధతో. ప్రజలతో ఉత్తమోత్తమైన రీతిలో వాదించు. (అన్ నహ్ల్ 16:125).** దివ్య ఖుర్ఆన్ లో అరబీ పదాలైన "ఖాలూ అంటే వారు అంటారు", "ఖుల్ అంటే వారితో అనండి" అనే పదాలు ఒక్కొక్కటి 332 సార్లు ప్రస్తావించబడినాయి. దీనిద్వారా తెలిసేదేమిటంటే దివ్యఖుర్ఆన్ చర్చను ప్రోత్సహిస్తుంది.

విజ్ఞాన శాస్త్రంలో ఒక సిద్ధాంతం కలదు. దాని పేరు "ప్రత్యామ్నాయం వ్యవస్థితం". దివ్య ఖుర్ఆన్ ఏమంటుందంటే ఈ గ్రంథం ఖుర్ఆన్ సర్వోత్తముడు అయిన దేవుని తరపునుండి అవతరించింది. అలా కానిచో, మరి ఏమిటది? మీరు మరొక ప్రత్యామ్నాయం ఇవ్వండి. అది ఎవరి తరపు నుండి వచ్చిందో మీరు చెప్పండి. కొందరు ఏమంటారంటే, ప్రవక్త ముహమ్మద్(స) గారు రచించారని. వారి ఈ ఆరోపణ అసత్యమని నిరూపించబడింది. దైవం క్షమించు గాక, ప్రాపంచిక లాభాల కోసం ఆయన అబద్ధం ఆడుతున్నారని మరికొందరు అంటారు. వారి ఆరోపణ కూడా అసత్యమని నిరూపించబడింది. ఇంకా వారు ఏ ఏ ఆరోపణలు చేస్తారో వాటన్నింటినీ ముందుంచి పరిశీలించండి. అవన్నీ అసత్యాలే. ఖుర్ఆన్ ఏమంటుందంటే, ఈ గ్రంథం అల్లా తరపు నుండి. ఇది సర్వశక్తిమంతుడైన దేవుని తరపు నుండి అవతరించింది. అలా కానిచో మరి ఎవరి తరపు నుండి?

దివ్యఖుర్ఆన్ లోని 45 వ అధ్యాయమైన 'అల్ జాసియహ్'లో1 మరియు 2 వాక్యాలలో ఇలా ఉంది.

హా. మీమ్. ఈ గ్రంథం శక్తిమంతుడూ, వివేకవంతుడు అయిన అల్లాహ్ తరఫునుండి అవతరించింది. ఇదే విషయాన్ని ఖురాన్ చాలా చోట్ల తెలియజేసింది. వివరాలకు క్రింది అధ్యాయాలలోని ఆయతులను చూడవచ్చు.6 :19,92; 12: 1-2; 20:113; 27:6; 32:1-3; 36:1-3; 39:1; 45:45; 55:1-2; 56:77,80; 76:23.

ఖుర్ఆన్ లో అనేక చోట్ల ఇలా ఉంది "ఈ గ్రంథం సర్వశక్తిమంతుడైన దేవుని తరపునుండి అవతరించింది. అలా కానిచో మరి ఏమిటది?" శాస్త్ర సాంకేతిక సమాజం వద్ద ఒక ప్రత్యేక పద్ధతి ఉంది. వారేమంటారంటే, ఎవరైనా ఒక కొత్త సిద్ధాంతంను కనుగొంటే, దానిని పరిశీలించడానికి మావద్ధ సమయం లేదు. దానికి కారణం, వారేమంటారంటే, ఒకవేళ నీవు ఒక కొత్త సిద్ధాంతంను కనుగొంటే, దానిని అసత్యమని నిరూపించుటకు నీవు ఒక మార్గం లేక పరీక్ష పొందనంతవరకు, దానిని మా వద్దకు తీసుకురా మాకు. మాకు నీతో వృధా చేసేంత సమయం లేదు. దీనినే "అసత్య నిరూపణా పరీక్ష" అంటారు. ఈ కారణంగానే ఈ శతాబ్ది ప్రారంభంలో ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ విశ్వం పనిచేసే తీరుపై ఒక సిద్ధాంతమును ప్రతిపాదిస్తూ, తన సిద్ధాంతం తప్పు అని భావిస్తే దానిని అసత్యమని నిరూపించుటకు 3 అసత్య నిరూపణా పరీక్షలు ఇచ్చాడు.శాస్త్రవేత్తలు దానిని ఆరు సంవత్సరాలపాటు పరీక్షించి ఐన్‌స్టీన్ సిద్ధాంతం సరి అయినది అని ఒప్పుకున్నారు. దానర్ధం ఆయన గొప్ప వ్యక్తి అని కాదు. దానర్ధం ఆయన సిద్ధాంతంను వినవచ్చు.

ఇలాంటి అసత్య నిరూపణా పరీక్షలు ఖుర్ఆన్ లోచాలా ఉన్నాయి. భవిష్యత్తులో మీరు ఎవరితోనైనా మత విషయాలపై చర్చిస్తున్నప్పుడు, మీరు అతనితో "మీ మతం ను నిరూపించే మార్గమేదైనా ఉందా" అని అడగవచ్చు. నన్ను నమ్మండి, నా అనుభవంలో ఏనాడూ "తన మతంను అసత్యం అని నిరూపించుటకు మార్గం కల వ్యక్తిని" నేను చూడలేదు. ఖుర్ఆన్ లోఅసత్య నిరూపణా పరీక్షలు చాలా ఉన్నాయి. వాటిలో కొన్ని గత కాలానికి చెందినవి, మరికొన్ని అన్ని కాలాలకు వర్తించేవి. ఉదాహరణకు, మహాప్రవక్త ముహమ్మద్(స) గారికి అబూ లహబ్ అనే ఒక బాబాయి ఉండేవాడు. అతడు ప్రవక్త(స) గారికి తీవ్ర వ్యతిరేకి. ప్రవక్త(స) గారు ఒక కొత్త వ్యక్తితో మాట్లాడిన ప్రతిసారీ, అతడు ప్రవక్త గారిని వెంబడిస్తూ ఉండి, ప్రవక్త గారు వెళ్ళిన తరువాత, అతడు ఆ కొత్త వ్యక్తిని కలిసి ప్రవక్త గారు ఏమి చెప్పారు? ఇది పగలు, ఇది రాత్రి, ఇది తెలుపు, ఇది నలుపు అని అనేనా? అని చెప్పేవాడు. అతడు పూర్తిగా ప్రవక్త గారు బోధించిన దానికి వ్యతిరేకంగా మాట్లాడేవాడు. దివ్యఖుర్ఆన్ లో ఒక పూర్తి అధ్యాయం(111వ) అబూ లహబ్ గురించి అవతరించింది. దాని ప్రకారం అబూ లహబ్ మరియు అతని భార్య నరకంలో పడి నశిస్తారు. ఈ అధ్యాయం పరోక్షంగా చెప్పేదేమిటంటే వీరిద్దరూ తుది శ్వాశ వరకూ ఇస్లాం స్వీకరించరు. వారు ఎప్పటికీ ముస్లింలుగా మారరు. ఈ అధ్యాయము అబూ లహబ్ మరణానికి 10 సంవత్సరాల ముందు అవతరించింది.

ఆ దీర్ఘ కాలంలో, ఇస్లాంకు బద్ధ విరోధులు మరియు అబూ లహబ్ స్నేహితులలో చాలామంది ఇస్లాం స్వీకరించారు,

కానీ అతను మాత్రం స్వీకరించలేదు. అతడు ఎల్లప్పుడూ ప్రవక్త గారికి వ్యతిరేకంగా అబద్ధమాడుతున్న కారణంగా దివ్య ఖుర్ఆన్ ను అసత్యం అని నిరూపించుటకు అతను కేవలం నోటితో “నేను ముస్లిమునయ్యాను” అని చెప్పి ఉండాల్సింది. అతను ముస్లింలాగా ప్రవర్తించాల్సిన అవసరం లేదు, కేవలం నోటితో నేను ముస్లిం అయ్యాను అని అంటే చాలు అప్పుడు ఖుర్ఆన్ అసత్యం అని నిరూపించబడి ఉండేది. ఇది అతనికి చాలా తేలికైన పని. అతడు ఇదివరకే అబద్ధమాడి ఉన్నందున, మరొక అదనపు అబద్ధం చెప్పాల్సి వచ్చేది. ప్రవక్త(స) అతనితో ఇలా చెబుతూ ఉండేవారు “నీవు నన్ను నీ శత్రువు గా భావిస్తున్నావుగా, సరే అయితే ఇలా వచ్చి నేను ముస్లిం అయ్యాను అని అను, అప్పుడు నేను అసత్యవాదిగా నిరూపించబడతాను”. అతనికి ఇది చాలా సులభం కానీ అతడు చెప్పలేదు. దీని ద్వారా తెలిసేది ఏమిటంటే ఏ వ్యక్తీ తన గ్రంథంలో ఇలాంటి ప్రకటన చేయలేడు. కావున ఈ గ్రంథం, దైవ గ్రంథమే కావాలి.

ఇలాంటిదే మరొక ఉదాహరణ బఖర అధ్యాయంలోబకర అధ్యాయంలో 94,95 వాక్యాలలో ఇలా చెప్పబడింది. **“వారిని ఇలా అడుగు: ఒకవేళ అల్లాహ్ వద్ద, పరలోక నివాసం మానవులందరికీ కాక కేవలం మీకు మాత్రమే ప్రత్యేకించబడితే, మీరు మీ ఈ అభిప్రాయంలో సత్యవంతులే అయితే మీరు మరణాన్ని తప్పక కోరాలి. వారు ఎప్పటికీ మరణాన్ని కోరరు అనే విషయాన్నినమ్ము. ఎందుకంటే, వారి స్వహస్తాలతో సంపాదించి అక్కడకు పంపిన దాని కారణంగా.”**

యూదులు, అల్లాహ్ యొక్క పరలోక నివాసం అంటే స్వర్గం కేవలం యూదుల కొరకే, మరెవ్వరికోసమూ కాదు అని అన్నప్పుడు యూదులు మరియు ముస్లింల మధ్య జరిగిన ముఖాముఖి సంభాషణా సందర్భంలో ఈ వాక్యాలు అవతరించాయి. ఈ వాక్యాల ద్వారా తెలిసేది ఏమిటంటే, ఒకవేళ స్వర్గం కేవలం యూదుల కొరకే అయితే, వారు మరణాన్ని స్వాగతించాలి, దాన్ని కోరుకోవాలి. ఆ సమయంలో ఎవరైనా ఒక యూద వ్యక్తి ముందుకు వచ్చి "నేను మరణాన్ని కోరుకుంటున్నాను" అని చెప్పి ఉంటే సరిపోయేది. అతను నిజంగా చనిపోవలసిన అవసరం లేదు, దానికై ప్రయత్నం కూడా చేయాల్సిన పనిలేదు. కేవలం మరణాన్ని కోరుకుని, నోటితో ప్రకటిస్తే సరిపోయేది. అప్పుడు ఖుర్ఆన్ అసత్యంగా నిరూపించబడి ఉండేది. ఈ పని వారికి చాలా సులభం. కానీ ఏ యూద వ్యక్తీ అలా కోరుకోలేదు. ఇది గతానికి సంబంధించిన ఒక అసత్య నిరూపణా పరీక్ష.

మీరు నాతో ఇలా అనవచ్చు ఈ పరీక్షలన్నీ గత కాలానికి సంబంధించినవి కదా! ఈ రోజు మేము ఖుర్ఆన్ అసత్యమని ఎలా నిరూపించగలం? ఒకవేళ మీరు దానిని అసత్యమని నిరూపించదలిస్తే, ఖుర్ఆన్ లో అన్ని కాలాలకు అంటే ఆనాటికి, ఈనాటికీ ఏనాటికీ వర్తించే పరీక్షలు కలవు అని తెలుసుకోండి. చాలామంది ఖుర్ఆన్ ను అసత్యమని అంటుంటారు. అటువంటి వారితో ఖుర్ఆన్ ఇలా అంటుంది.

"ఇలా అను! ఒకవేళ మానవులూ,జిన్నాతులూ అందరూ కలిసిఈ ఖుర్ఆన్ వంటి దానిని దేనినైనా తీసుకువచ్చే

ప్రయత్నం చేసినప్పటికీ తీసుకురాలేరు, వారందరూ ఒకరికొకరు సహాయం చేసుకున్నప్పటికీ". (బనీ ఇస్రాయీల్ 17:88) అలాంటి వారికి ఇది ఒక ఛాలెంజ్. ఖుర్ఆన్ ను భూమండలంపై అరబీలో ఒక మంచి సాహిత్యంగా ముస్లింలు మరియు ముస్లిమేతర సోదరులు ఒప్పుకున్నారు. ఖుర్ఆన్ లోని అరబీ భాష చాలా స్పష్టమైన, అర్థవంతమైన, మేధోపరమైన, సంక్షిప్తమైన మరియు అద్భుతమైన భాష. ఇది ఏ ఒక్కరినీ సత్యమార్గం నుండి తప్పించదు. ఈ గ్రంథం పద్య కావ్యం వలె ఉన్నప్పటికీ, ఇది ఇతర పద్య, గద్య శాస్త్రాల వలె గాక, సాహిత్య రంగంలో ఉన్నత శ్రేణికి చెందినది. ఖుర్ఆన్ గ్రంథంలోని ఒకే వాక్యము ఒక సామాన్య వ్యక్తిని మరియు మేధావిని ప్రభావితం చేయగలదు. ఇదొక అద్భుతమైన గ్రంథం. అదే ఛాలెంజ్ (పరీక్ష), అధ్యాయము నెంబర్ 52 లో 34వ వాక్యంలో కూడా తెలియజేయబడింది. ఆ తర్వాత మహోన్నతుడైన దైవం, ప్రజల కొరకు ఆ పరీక్షను కొంత సులభతరం చేశాడు. ఖుర్ఆన్ ఇలా అంటుంది.

"ప్రవక్తయే స్వయంగా ఈ గ్రంథాన్ని కల్పించాడని వారంటున్నారా? ఇలా అను: 'సరే విషయం గనక ఇదే అయితే ఇటువంటి కల్పించబడిన 10 సూరాలను మీరు రచించి తీసుకురండి. అల్లాహ్ ను తప్ప, ఎవరినైనా సరే సహాయం కొరకు పిలవ గలిగితే పిలుచుకోండి. మీరే గనక సత్యవంతులే అయితే'". (సూరే హూద్ 11:13).

అల్లాహ్ ఈ పరీక్షను వారి కొరకు ఇంకా సులభం చేశాడు. ఆయన ఇలా అంటున్నాడు... **"ప్రవక్తయే దీనిని స్వయంగా**

రచించాడని ఈ ప్రజలు అంటున్నారా ఏమిటి? ఇలా అను: ‘మీరు గనక మీ ఆరోపణలో సత్యవంతులే అయితే ఇటువంటి సూరా ఒక దానిని రచించి తీసుకురండి. ఒక్క అల్లాహ్ ను వదిలి ఎవరెవరిని పిలవ గలరో సహాయం కొరకు పిలవండి”. (సూరహ్ యూనుస్ 10:38).

అల్లాహ్ ఈ పరీక్షను ఇంకా సులభతరం చేశాడు. దివ్యఖుర్ఆన్ లో అత్యంత సులభమైన అసత్య నిరూపణా పరీక్ష ఇది. ఆయన ఇలా అంటున్నాడు.

“మేము మాదాసునిపై అవతరింపజేసిన గ్రంథం గురించి, అది మా గ్రంథం అవునో కాదో అని మీకు సందేహం ఉన్నట్లయితే దాని వంటి ఒక సూరాలో కొంత భాగమైనా రచించి తీసుకు రండి. మీ సహచరులందరినీ పిలుచుకోండి. మీరు సత్యవంతులే అయితే ఈ పని చేసి చూపించండి. కానీ మీరు అలా చేయకపోతే, నిశ్చయంగా ఎన్నటికీ చెయ్యలేరు. భయపడండి, మానవులు, రాళ్లు ఇంధనం కాగల అగ్నికి. అది సత్య తిరస్కారుల కొరకు తయారు చెయ్యబడింది”. (అల్ బఖర 2:23-24).

ఖుర్ఆన్, మొదటగా దానిలాంటి ఒక పూర్తి గ్రంథం రచించమని చాలెంజ్ చేసింది. ఆ తర్వాత దానిని కొద్దిగా సులభతరం చేస్తూ ఖుర్ఆన్ లాంటి 10 సూరాలను రచించమని లేదా కనీసం ఒక్క సూరానైనా రచించమని చెప్పింది. ఈ ఛాలెంజ్ను ఇంకా చాలా సులభం చేస్తూ ‘సూరాలోని కొంత భాగమైనా’ రచించమని చెప్పింది. ఇక్కడ ఖుర్ఆన్ “మిమ్ మిస్ లిహీ” అంటోంది దాని అర్థం కొంత భాగమైనా సరే. ఈ ప్రయత్నంలో ముస్లిమేతర అరబ్బులు చాలా ఘోరంగా

విఫలమయ్యారు. ఖుర్ఆన్ అవతరణా కాలంలో అరబీ భాష ఉన్నత శిఖరాల పై ఉంది. చాలా మంది అరబ్ విగ్రహారాధకులు ప్రయత్నించి ఘోరంగా విఫలమయ్యారు. వారి రచనలలో కొన్ని నేటికి కూడా చారిత్రక గ్రంథాలలో సురక్షితంగా ఉన్నాయి. అవి స్వయంగా వారికి కూడా నవ్వును కలిగిస్తున్నాయి. ఈ చాలెంజ్ 14 వందల సంవత్సరాల పూర్వం నాటిదై నప్పటికీ, ఈనాటి వారికి కూడా వర్తిస్తుంది.

ప్రస్తుతం ప్రపంచంలో 14 మిలియన్ల కంటే ఎక్కువ క్రైస్తవ అరబ్బులు కలరు. వారి మాతృభాష అరబీ. ఈ చాలెంజ్ వారికి కూడా ఉద్దేశించబడింది. ఒకవేళ వారు ఖుర్ఆన్ ను అసత్యం అని నిరూపించదలిస్తే, వారు చేయాల్సిందేమనగా ఖుర్ఆన్ లోని ఒక సూరాలాంటి దానిలో కొంత భాగమైనా రచించి తీసుకురావాలి. ఖుర్ఆన్ లోని కొన్ని అధ్యాయాలను పరిశీలించినట్లయితే వాటిలో చాలా తక్కువ పదాలు మాత్రమే ఉన్నాయి. కానీ అలాంటి వాటిని ఇంతవరకూ ఏ ఒక్కరూ రచించ లేకపోయారు. ఇన్షాఅల్లాహ్ భవిష్యత్తులో కూడా ఎవరూ రచించలేరు.

నాతో మీరు అనవచ్చు మా యొక్క మాతృభాష అరబీ కాదు. కావున ఈ ఛాలెంజ్ను మేము ఎలా స్వీకరించగలం? ప్రతి ఒక్కరికీ నేను విన్నవించుకొనునది ఏమనగా, ఖుర్ఆన్ లోఅరబ్బేతరుల కొరకు కూడా ఒక పరీక్ష కలదు. అరబీ తెలియని ప్రజలు ఒకవేళ ఖుర్ఆన్ ను అసత్యము అని నిరూపించదలిస్తే వారు తమ శాయశక్తులా కృషి చేయవచ్చు. నేను నా ఉపన్యాసంను

దివ్యఖుర్ఆన్ లోని నాలుగవ అధ్యాయం సూరహ్ నిసా లోని 82వ వాక్యం పఠిస్తూ ప్రారంభించాను. ఆ వాక్యం లో ఇలా ఉంది.

"ఈ ప్రజలు ఖుర్ఆన్ ను గురించి ఆలోచన చెయ్యరా? ఇది అల్లాహ్ తరపు నుండి కాక వేరొకరి తరపు నుండి వచ్చి ఉన్నట్లయితే ఇందులో ఎన్నో పరస్పర విరుద్ధాలైన విషయాలు ఉండేవి". (దివ్య ఖుర్ఆన్ 4:82)

ఖుర్ఆన్ చెప్పేదేమిటంటే, ఒకవేళ నీవు ఖుర్ఆన్ ను అసత్యం అని నిరూపించదలిస్తే, ఇందులో ఒక్క విరుద్ధ విషయాన్ని గానీ, ఒక్క దోషమును గాని చూపించు. ఇది మీకు చాలా సులభం.

వందలాది మంది ఖుర్ఆన్ లో తప్పులు, విరుద్ధ విషయాలు చూపించారన్న విషయం నాకూ తెలుసు. కానీ, నన్ను నమ్మండి, అవన్నీ ప్రజలను మోసగించుటకు నూటికి నూరుశాతం సందర్భానికి విరుద్ధంగా సేకరించబడినవి లేక అసత్య ప్రకటనలు మరియు తప్పుగా అనువాదం చేయబడినవి. కావున ఇంతవరకు ఏ ఒక్కరూ ఖుర్ఆన్ లో ఒక్క విరుద్ధతను గాని లేక పొరపాటునుగానీ కనుగొనలేకపోయారు.

ఖుర్ఆన్ లో ఒక దోషం కనుగొని దానిని ఏ ఒక్కరూ నిరూపించలేరు

ఒక ధార్మిక వేత్తకు ఇస్లామీయ జ్ఞానంలో మంచి పట్టు ఉంటే, విజ్ఞాన శాస్త్ర జ్ఞానంలో పట్టు ఉండకపోవచ్చు.మరికొందరికి రెండింటిలోనూ మంచి పట్టు ఉంటుంది. ఇప్పుడు మీరు ఖుర్ఆన్ లోని సైంటిఫిక్ తప్పును తీసుకొని కేవలం ఇస్లామీయ జ్ఞానం లో పట్టున్న మౌలానా దగ్గరికి

వెళితే, ఒకవేళ అతను సందేహ నివృత్తి చేయలేకపోతే, దానర్థం ఖుర్ఆన్ దైవ గ్రంథం కాదని కాదు. ఎందుకనగా ఖుర్ఆన్ ఇలా అంటోంది.

"మీకు తెలియకపోతే, జ్ఞానం కల వారిని అడగండి". (అల్ ఫుర్ కాన్ 25:59).

సైన్సు గూర్చి తెలియజేసే ఖుర్ఆన్ ఆ యతులను గూర్చి తెలుసుకోవాలంటే, ఒక సైంటిస్టును అడగండి, అతను సందేహ నివృత్తి చేయగలడు. అదేవిధంగా శ్రోతలలో ఎవరైనా ఖుర్ఆన్ యొక్క అరబీ గ్రామర్లో తప్పు కనుగొంటే అతను గ్రామర్లో నైపుణ్యం గల వ్యక్తిని అడగాలి. నేను ఎక్స్పర్ట్ ను కాదు కేవలం నేనొక విద్యార్థిని. అల్హందులిల్లాహ్, నేను సందేహ నివృత్తి చేయగలను. ఒకవేళ నేను సందేహ నివృత్తి చేయలేకపోతే దానర్థం ఖుర్ఆన్ లో దోషం ఉంది అని కాదు.ఎక్స్పర్ట్స్ ఆ సందేహం నివృత్తి చేయగలరు. ఇంతవరకు ఏ ఒక్కరూ ఖుర్ఆన్ లో ఎటువంటి దోషమూ కనుగొనలేకపోయారు,ఇన్షా అల్లాహ్ భవిష్యత్తులో కూడా ఎవరూ కనుగొనలేరు.

ఈ విధంగా తార్కికంగా విశ్లేషించిన తర్వాత దేవున్ని విశ్వసించే ఏ మానవుడు కూడా ఖుర్ఆన్ దైవ గ్రంథం కాదు అని చెప్పలేడు. దేవుడిని విశ్వసించని వారు ఇది ఒక ప్రత్యేకమైన విలక్షణమైన గ్రంథం అంటారు. కానీ దేవుడిని విశ్వసించే ముస్లిమేతరులు ఈ వివరణలు విన్న తర్వాత ఖుర్ఆన్ దైవ గ్రంథం అని ఒప్పుకుంటారు.

ఇక మిగిలినది మూడవ ప్రాథమిక భావన అదేమనగా ఈ గ్రంథం దైవం అవతరింపజేసినది. ఇది

సర్వశక్తిమంతుడైన అల్లాహ్ అవతరింపజేసినది. ఇక దేవుడు లేడు అని చెప్పే నాస్తికుల విషయానికి వస్తే, మొదటగా నేను వారిని అభినందించాలి అనుకుంటున్నాను. నా యొక్క ప్రత్యేక అభినందనలు వారికి తెలియజేస్తున్నాను. ఎందుకనగా! వారు తమ బుద్ధిని ఉపయోగిస్తున్నారు. వారు తమ తార్కిక ఆలోచనాశక్తిని ఉపయోగిస్తున్నారు. ప్రపంచంలో చాలా మంది ప్రజలు దేవుడిని గుడ్డిగావిశ్వసిస్తున్నారు.ఒకతను క్రైస్తవుడు ఎందుకనగా అతని తండ్రి క్రైస్తవుడు కాబట్టి, ఒకతను హిందువు ఎందుకనగా అతని తండ్రి హిందువు కాబట్టి, అలాగే ఒకతను ముస్లిం ఎందుకనగా అతని తండ్రి ముస్లిం కాబట్టి. వారు గుడ్డిగా విశ్వసిస్తున్నారు.

నాస్తికులు కనీసం 'లా ఇలాహ' అంటే 'దేవుడు లేడు' అని ఒప్పుకున్నారు

ఈ నాస్తికులు మత సంబంధమైన కుటుంబములో జన్మించినప్పటికీ, తమ చుట్టూ ఉన్న ప్రజలు మానవ లక్షణాలు గల వాటిని దేవుళ్ళుగా ఆరాధించడం చూసి, అవి దేవుళ్లు ఎలా అయ్యాయి అని వీరు ఆలోచిస్తున్నారు. అందుకే వారు తమను తాము ఇలా ప్రశ్నించుకుంటున్నారు 'ఇలాంటి దైవాలను మనమెలా విశ్వసించగలం'. కావున వారు 'దేవుడు లేడు' అని అంటున్నారు. మరియు అటువంటి దైవ భావనను తిరస్కరిస్తున్నారు. జాకీర్, నీవు నాస్తికులను అభినందిస్తావెందుకు అని కొందరు ముస్లింలు నన్ను అడుగుతారు. నేను నాస్తికులను అభినందిస్తాను ఎందుకనగా వారు ఇస్లాం యొక్కకలిమాలోని మొదటి భాగం'లా ఇలాహ' –'దేవుడు ఎవరూ లేడు'ను

అంగీకరించారు. ఇక మిగిలిన భాగం 'ఇల్లాల్లాహ్' అనగా 'ఒక్క అల్లాహ్' తప్ప అనే భాగాన్ని ఇన్షా అల్లాహ్ అది మనం ఒప్పించగలము. వారు షహాదత్ (సాక్ష్యం) యొక్క మొదటి భాగం "లా ఇలాహ" 'దేవుడు ఎవరూ లేడు'ను ఒప్పుకున్నారు. మరియు మానవ లక్షణాలు గల దేవుళ్లను విశ్వసించరు. కావున వారికి నిజమైన మరియు ఏకైక దేవుడైన అల్లాహ్ ను గూర్చి తెలియజేయాల్సిన బాధ్యత మనపై ఉంది.

'నేను దేవుడిని విశ్వసించను' అని నాస్తికుడు నాతో అన్నప్పుడు నేను అతడిని ఒక ప్రశ్న అడుగుతాను- 'దేవునికి నిర్వచనం ఏమిటి'? మీ అభిప్రాయంలో దేవుడు అంటే ఏమిటి? ఎందుకో తెలుసా? ఒకవేళ నేను ఇది పెన్ను అని అంటే, ఇది పెన్ను కాదు అని మీరు అనడానికి, మీకు పెన్ను యొక్క అర్థం తెలిసి ఉండాలి. మీకు పెన్ను యొక్క నిర్వచనం తెలిసి ఉండడం తప్పనిసరి. ఇదేవిధంగా నాస్తికుడు దేవుడు లేడు అంటున్నాడంటే, అతనికి దేవుడంటే అర్థం ఏమిటో తెలిసి ఉండటం తప్పనిసరి. ఆ నాస్తికుడు ఇలా అంటాడు "నా పరిసరాలలో ఉన్న ప్రజలు ఆరాధించే దేవుళ్ళు, వారే స్వయంగా సృష్టించుకున్నవి మరియు అవి మానవ లక్షణాలను కలిగి ఉన్నాయి. కావున నేను అలాంటి దేవుళ్లను విశ్వసించను, ఎందుకనగా ఆ ప్రజలు తప్పుడు దైవ భావనను కలిగి ఉన్నారు". నీవు ఒక తప్పుడు దైవ భావన తిరస్కరించిన విధంగానే, ఒక ముస్లింగా నేను కూడా అలాంటి తప్పుడు దైవ భావనను తిరస్కరిస్తున్నాను అదే "లా ఇలాహ." ఎప్పుడైతే నేను అతని అభిప్రాయంతో ఏకీభవించానో, అతనికి నిజ దైవ భావన గురించి తెలియజేయడం కూడా నా బాధ్యత.

తప్పుడు దైవ భావనను సరి చేయడం మన బాధ్యత, విధి.

చాలామంది ముస్లిమేతరులు, ఇస్లాంను ఒక క్రూరమైన మతంగా, దయలేని మతంగా, తీవ్రవాదంతో సంబంధమున్న మతంగా, స్త్రీల హక్కులు హరించివేసే మతంగా మరియు విజ్ఞాన శాస్త్ర విరుద్ధమైన మతంగా భావించి, దానిని తిరస్కరిస్తున్నారు. నేను అతనితో ఇలా చెప్తాను "నేను కూడా అటువంటి దయ లేని మతంను,స్త్రీల హక్కులను హరించివేసే మతంను మరియు అశాస్త్రీయమైన మతంను తిరస్కరిస్తాను." అదే సమయాన అతనికి ఇస్లాం పట్ల ఉన్న అపోహలను దూరం చేస్తాను. ఇస్లాం సౌమ్యమైనదని, తీవ్రవాదంతో దానికి ఎటువంటి సంబంధం లేదని, స్త్రీలకు సమాన హక్కులు కల్పిస్తుందని మరియు శాస్త్రీయమైనదని నేను అతనికి తెలియజేస్తాను. అప్పుడు అతను దైవం తలిస్తే తలిస్తే ఇస్లాం స్వీకరిస్తాడు. అదేవిధంగా తప్పుడు దైవ భావనను సరి చేయడం కూడా నా బాధ్యత.

అల్లాహ్ కు నేను ఇవ్వగల అత్యుత్తమమైన నిర్వచనం దివ్యఖుర్ఆన్ లోని 112 వ అధ్యాయం. అందులో ఇలా ఉంది "**ఇలా చెప్పెయ్యి, ఆయన అల్లాహ్, అద్వితీయుడు. అల్లాహ్ నిరపేక్షాపరుడు, ఎవరి ఆధారమూ, ఎవరి అక్కరా లేనివాడు; అందరూ ఆయనపై ఆధారపడేవారే. ఆయనకు సంతానం ఎవరూ లేరు. ఆయన కూడా ఎవరి సంతానమూ కాదు. ఆయనకు సరి సమానులు ఎవరూ లేరు.**

(అల్ ఇఖ్లాస్ 112 : 1-4)". దీనిద్వారా తెలిసేదేమిటంటే, అల్లాహ్ సంపూర్ణమైన వాడు, శాశ్వతమైనవాడు. ఆయనకు ఆది లేదు అంతం లేదు. ఆయనే ఇతరులకు సహాయం చేసేవాడు. కానీ ఆయనకు ఏ సహాయమూ అవసరం లేదు. ఆయనకు తల్లిదండ్రులు లేరు. ఆయనకు సంతానమూ లేదు మరియు ప్రసాధించబడిన సంతానమూ లేదు. ఆయనతో పోల్చదగినదేదీ ఈ ప్రపంచంలో లేదు. ఒకవేళ నీవు అల్లాహ్ ను ఎవరితోనైనా లేక దేనితోనైనా పోల్చగలిగితే ఆయన అల్లాహ్ కాదు. ఎవరినైతే నీవు లేక వీరు దేవుడుగా భావిస్తున్నారో, వారు దివ్యఖుర్ఆన్ యొక్క ఈ నాలుగు వాక్యాల నిర్వచనంలో సరిపోయినచో, అతనిని దేవుడిగా అంగీకరించడంలో ముస్లింలకు ఎటువంటి అభ్యంతరమూ లేదు.

రజనీష్, దేవుడు అయినట్లయితే, అతను తనకు గల ఉబ్బసరోగం, అతిమూత్ర వ్యాధులను నయం చేసుకొని ఉండాల్సింది.

కొందరు, భగవాన్ రజనీష్ ఓషోను దేవుడు అంటారు. అతనిని మనం పరీక్షిద్దాం. మొదటి ప్రామాణికం "చెప్పండి, ఆయన అల్లాహ్, అద్వితీయుడు" కానీ మన దేశంలో రజనీష్ లాగా అనేకమందిని చూడవచ్చు.అయిననూ రజనీష్ యొక్క అనుచరుడు ఇలా అంటాడు "కాదు కాదు, రజనీష్ ఏకైక మరియు విలక్షణమైనవాడు." సరే, అతనికి ఒక అవకాశం ఇస్తూ, మొదటి పరీక్షను అంగీకరించండి. ఇక రెండవ పరీక్ష "అల్లాహ్ నిరపేక్షాపరుడు, ఎవరి ఆధారమూ,ఎవరి అక్కరా లేనివాడు. అందరూ ఆయనపై ఆధారపడేవారే". రజనీష్ కు ఉబ్బసరోగం మరియు అతిమూత్ర వ్యాధులు కలవు అని మనకందరికీ తెలుసు.

అతను తన సొంత రోగాలను బాగు చేసుకోలేక పోయాడు.అతను మన రోగాలను ఎలా నయం చేయగలడు?

రజనీష్, దేవుడు అయినట్లయితే అతనిని చెరసాలలో బంధించి, అతనికి విషమిచ్చి ఉండేవారు కాదు.

రజనీష్ అమెరికా వెళ్ళినప్పుడు, అమెరికన్ ప్రభుత్వం అతనిని చెరసాలలో బంధించింది. ఒక్కసారి ఊహించండి, దేవుడు చెరసాలలో బంధించబడ్డాడు. అతను తనను తాను వినిపించుకోలేడు, మరి మనం కష్టాలలో ఉన్నప్పుడు మనలను ఎలా వినిపించగలడు? అతనికి నెమ్మది నెమ్మదిగా విషం ఇచ్చారని ప్రకటించాడు. ఊహించండి, దేవునికి విషమివ్వగలమా? గ్రీకు ఆర్క్బిషప్ ఇలా అన్నాడు "ఒకవేళ మీరు రజనీష్ ను దేశం నుంచి బహిష్కరించనట్లయితే, మేము ఇతని మందిరాలను, శిష్యులను ధ్వంసం చేస్తాము". ఫలితంగా గ్రీకు ప్రభుత్వం అతనిని బహిష్కరించింది.ఇతను నిరపేక్షాపరుడు, మరియు ఎవరి అవసరము లేని వాడు కాగలడా?

ఇక మూడవ పరీక్ష "ఆయనకు సంతానం ఎవరూ లేరు, ఆయన కూడా ఎవరి సంతానము కాదు". అతనికి(రజనీష్)కు ఎంత మంది సంతానం ఉన్నారో నాకయితే తెలియదు కానీ, అతనికి ఒక తల్లి, ఒక తండ్రి ఉన్నారని మాత్రం తెలుసు. అతను 11th డిసెంబర్, 1931వ సంవత్సరంలో జబల్పూర్ లో జన్మించాడు మరియు 19th జనవరి 1990 లో చనిపోయాడు. కానీ పూణే లో ఉన్న అతని సమాధి దగ్గరకు వెళ్ళి

చూస్తే అక్కడ ఇలా రాసి ఉంది 'భగవాన్ రజనీష్-ఏనాడూ జన్మించలేదు, ఏనాడూ మరణించ లేదు. కానీ ఈ భూమండలాన్ని 11th డిసెంబర్ 1931 నుండి 18th జనవరి 1990 వరకు సందర్శించాడు'. కానీ అతనికి ప్రపంచంలోని 21 దేశాలలో ప్రవేశించటానికి అనుమతి నిరాకరించడం జరిగింది అన్న విషయం వారు తెలియజేయలేదు. అతనికి వీజా ఇవ్వబడలేదు. 21 దేశాలలో ప్రవేశించడానికి ప్రయత్నించాడు కాని ప్రవేశించలేక పోయాడు. ఊహించండి, దేవుడు ప్రపంచ సందర్శనకు వచ్చాడు, కానీ 21 దేశాలను సందర్శించలేక పోయాడు. ఇటువంటి దేవుడినేనా వీరు విశ్వసించేది?

దేవుడు పోలిక లేని వాడు

ఇక చివరి పరీక్ష "ఆయనకు సరి సమానులు ఎవరూ లేరు". ఆయనతో పోల్చదగినది ఏదీ లేదు. ఒకవేళ ఆయన ఆకారమును ఊహించగలిగితే, ఆయన దేవుడే కాదు. రజనీష్ కు పొడవాటి జుట్టు, తెల్లటి పొడవైన గడ్డం ఉందని మరియు ఒక పొడుగాటి కోటు ధరిస్తాడని మనకందరికీ తెలుసు. సర్వశక్తిమంతుడైన దేవుడు ఆర్నాల్డ్ స్క్వార్జ్ నెగర్ కంటే వెయ్యి రెట్లు బలవంతుడు అని ఒకవేళ మీరు అంటే, మీకు ఆర్నాల్డ్ స్క్వార్జ్ నెగర్ తెలుసా? అతనికి ప్రపంచంలో అత్యంత బలవంతుడుగా కిరీటం లభించింది. దేవుడు, ఆర్నాల్డ్ స్క్వార్జ్ నెగర్ కు లేదా ధారాసింగ్ కు లేదా కింగ్ కాంగ్ కు వెయ్యి రెట్లు బలవంతుడు అని పోల్చగలిగితే అతడు దేవుడే కాదు. ఒకవేళ మీరు దేవుడిని ఎవరితోనైనా వెయ్యి లేక మిలియన్ లేక 10 మిలియన్ రెట్లు

ఉండేటట్లుగా పోల్చగలిగితే అతడు దేవుడే కాదు. ఈ ప్రపంచంలో ఆయనకు సమానులు ఎవరూ లేరు.

ప్రజలు ఏయే దేవుళ్లను ఆరాధిస్తున్నారో వారందరినీ, ఖుర్ఆన్ యొక్క ఈ నాలుగు వాక్యాల పరీక్షకు అనువర్తింప చేయాల్సిన బాధ్యతను వివేకవంతులు మరియు మేధావులైన శ్రోతలకి విడచి పెడుతున్నాను. మీరు ఆరాధిస్తున్న దేవుడు ఒకవేళ ఈ నాలుగు వాక్యాల పరీక్షలలో సఫలీకృతుడు అయితే అతనిని అల్లాహ్ గా స్వీకరించడంలో ముస్లింలకు ఎటువంటి అభ్యంతరమూ లేదు. అలా కానిచో, ఇక మీరే నిర్ణయించుకోండి. ఇలా ఆధారాలతో వివరించిన తర్వాత కొంతమంది నాస్తికులు దేవుడున్నాడని విశ్వసిస్తారు. కానీ చాలా మంది నాస్తికులు అంగీకరించరు. వారేమంటారంటే "మేము కేవలం ఇలాంటి నిర్వచనాలను విశ్వసించము. మేము ప్రామాణికమైన సైన్సును నమ్ముతాము". నేను కూడా అంగీకరిస్తాను ఇది శాస్త్ర సాంకేతిక యుగమని. కావున మనకున్న విజ్ఞాన శాస్త్ర జ్ఞానమును ఖుర్ఆన్ కు అనువర్తింపజేద్దాము. నాస్తికులు ఏమంటారంటే "ఇది విజ్ఞాన శాస్త్ర, సాంకేతిక రంగాల ప్రపంచం, కావున మేము అటువంటి దేవుళ్లను నమ్మము, దేవుని అస్తిత్వమును విజ్ఞాన శాస్త్ర పరంగా నిరూపిస్తే, అప్పుడు మేము విశ్వసిస్తాము".

సైన్స్లో నమ్మకముంచి, దేవుడిని విశ్వసించని నాస్తికులను, విద్యావంతులను మొదటగా నేను ఒక ప్రశ్న అడగాలనుకుంటున్నాను, అదేమనగా "ఒక కొత్త వస్తువు యొక్క పని చేయు విధానం (మెకానిజం) గూర్చి చెప్పగల మొదటి

వ్యక్తి ఎవరో తెలుపగలరా"? అని. ఆ వస్తువు ఇంతవరకూ కనుగొనబడనిది, అది ఒక కొత్త పరికరం మరియు దాని గూర్చి ప్రపంచంలో ఇంతవరకు ఏ మానవుడూ వినలేదు, చూడలేదు. అటువంటి పరికరమునే ఇప్పుడు ఈ నాస్తికులు మరియు విద్యావంతుల ముందుకు తీసుకురాబడింది. వారిని ఈ వస్తువు గురించే అడిగాను. నేను ఈ ప్రశ్నను వందలాది మంది నాస్తికులను అడిగాను. కొంత సేపు ఆలోచించిన తరువాత వారు జవాబుగా ఇలా అంటారు "ఆ వస్తువును సృష్టించినవాడు క్రియేటర్" లేక కొందరు ఏమంటారంటే దానిని కనుగొన్నవాడు ఇన్వెంటర్. మరికొందరు దానిని తయారు చేసిన వాడు అని, మరికొందరు దాని నిర్మాత అని అంటారు. నన్ను నమ్మండి, వారేమి పేర్లతో చెప్పినప్పటికీ దాదాపు అంతా ఒక్కటే. వారెటువంటి జవాబు ఇచ్చినా కూడా నేను దానిని గుర్తుంచుకుంటాను.

ఆ కొత్త వస్తువు గూర్చి చెప్పగల రెండవ వ్యక్తి – ఎవరికైతే సృష్టికర్త వివరించాడో అతను లేక ఆ వస్తువు పై పరిశోధన చేసిన వాడు కాగలడు, కానీ మొదటి వ్యక్తి మాత్రం ఆ వస్తువు సృష్టికర్త లేక కనుగొన్నవాడు లేక తయారు చేసిన వాడు లేక నిర్మాతనే అవుతాడు. ఇప్పుడు నేను సైన్సును విశ్వసించే నాస్తికుడుని "ఈ విశ్వం ఎలా ఉనికిలోకి వచ్చింది" అని అడుగుతాను. అతడు ఇలా జవాబిస్తాడు "ప్రారంభంలో ఈ విశ్వం అంతా ద్రవ రూపంలోని ఒక పెద్ద ముద్దగా ఉండేది, తర్వాత ఒక పెద్ద శబ్దంతో ఆ ముద్ద విచ్ఛిన్నమయ్యి ఈ గెలాక్సీలు ఏర్పడినాయి. అలాగే నక్షత్రాలు, గ్రహాలు కూడా ఏర్పడ్డాయి" అని. దీనినే బిగ్ బ్యాంగ్ సిద్ధాంతం అంటారు.

నేను అతనిని ఇలా అడుగుతాను "ఎక్కడ నుంచి సంపాదించావు ఈ అందమైన కథలు అని". దానికి అతను అందమైన కథలు కావు,ఇవి స్థాపించబడిన సత్యాలు. వీటికి సంబంధించిన ఆధారాలు కూడా ఉన్నాయంటాడు. నేను అతనితో "ఎక్కడ నేర్చుకున్నావు ఈ అందమైన కథలు" అని అడిగితే, జవాబుగా అతను ఇవి శాస్త్రీయ సత్యాలు. వీటిని సైన్స్ నిన్ననే కనుగొన్నది. సైన్స్ భాషలో నిన్న అంటే 50 లేక 100 సంవత్సరాల పూర్వం అని అంటాడు.

దివ్య ఖుర్ఆన్, బిగ్ బ్యాంగ్ ను గూర్చి 1400 సంవత్సరాల క్రితమే తెలియజేసింది.

బిగ్ బ్యాంగ్ సిద్ధాంతంను కనుగొన్నందుకు ఇద్దరు శాస్త్రవేత్తలకు 1973లో నోబెల్ బహుమతి లభించింది. నీవు దీనిని సత్యం అంటున్నావు కావున నేను దీనిని అంగీకరిస్తాను, కానీ నేటికి 1400 సంవత్సరాల క్రితమే దివ్యఖుర్ఆన్ లో ఈ సత్యం తెలియజేయబడుట గూర్చి నీ అభిప్రాయం ఏమిటి?ఖుర్ఆన్ ఇలా తెలియజేస్తుంది

"తిరస్కరించిన వారు ఈ విషయాలను గురించి ఆలోచించరా? ఆకాశాలూ, భూమీ పరస్పరం కలసి ఉండేవనీ, తర్వాత మేము వాటిని వేరు చేశాము." (అల్ అంబియా21:30)

1400 సంవత్సరాల క్రితం అవతరించిన దివ్య ఖుర్ఆన్ నేటికి ఒక్క అక్షరం కూడా మార్పు చెందకుండా సురక్షితంగా ఉందని

తెలియజేయుటకు ఎన్నో చారిత్రిక ఆధారాలు ఉన్నాయి. ఖుర్ఆన్ లో బిగ్ బ్యాంగ్ గూర్చి ఎలా తెలియజేయబడింది. దాని గూర్చి చాలా తేలికగా తెలియపరచింది. నీ ప్రకారం సైన్సు ఈ సత్యమును 50 లేక 100 సంవత్సరాల క్రితం కనుగొనింది. కానీ 1400 సంవత్సరాల క్రితమే దీనిని ఖుర్ఆన్ లో ఎవరు తెలియజేశారు? జవాబుగా నాస్తికుడు "ఎవరో ఒకరు ఊహించి ఉండవచ్చు" అని అంటాడు. నేను అతనితో చాలెంజ్ చేయను, నేను సంభాషణను, చర్చను ముందుకు కొనసాగిస్తాను.

మనం నివసిస్తున్న ఈ భూమి ఏ ఆకారంలో ఉంది? అతను జవాబుగా "పూర్వం ప్రజలు భూమి సమతలంగా ఉందని భావించి, సుదూర ప్రయాణం చేస్తే కిందపడతామేమోనని భయపడేవారు. కానీ ఇప్పుడు మన వద్ద, భూమి సమతలంగా లేదని, అది గోళాకారంగా ఉందని తెలియజేయుటకు కావలసినన్ని శాస్త్రీయ ఆధారాలు కలవు" అని అంటాడు. నీవు ఎప్పుడు నేర్చుకున్నావు? నిన్న అంటే సైన్స్ భాషలో 100 లేక 200 సంవత్సరాల పూర్వం. ఒకవేళ అతనికి మంచిగా జనరల్ నాలెడ్జ్ ఉంటే, భూమి గోళాకారంగా ఉంది అని మొట్ట మొదటగా సర్ ఫ్రాన్సిస్ డ్రేక్ గారు 1597లోనిరూపించాడు అని చెప్పగలడు. నేను అతనితో ఖుర్ఆన్ యొక్క ఈ క్రింది వాక్యాలను విశ్లేషించమని అంటాను.

"అల్లాహ్ రాత్రిని పగలులోకి, పగలును రాత్రిలోకి చొప్పించటాన్ని నీవు చూడటం లేదా? (లుఖ్మాన్ 31:29).

ఇక్కడ చొప్పించుట అంటే నెమ్మదిగా మరియు క్రమక్రమంగా మార్చుట. రాత్రి నెమ్మదిగా మరియు క్రమక్రమంగా పగలుగా మారుతుంది మరియు పగలు నెమ్మదిగా, క్రమక్రమంగా రాత్రి గా

మారుతుంది.ఈ దృగ్విషయం భూమి గోళాకారంగా ఉన్నప్పుడు మాత్రమే సాధ్యం, కానీ భూమి సమతలంగా ఉన్నప్పుడు కాదు. ఇదే విషయము మరొక చోట ఇలా తెలియజేయబడింది.

“ఆయనే పగటిని రేయితోనూ, రేయిని పగటితోనూ చుట్టి వేస్తాడు”.(అజ్ జుమర్ 39:5).

ఇక్కడ అరబీలో “తక్వీర్” అనే పదం వాడబడింది. దానర్థం తలకు తలపాగా చుట్టినట్లు చుట్టుట. ఈ విధంగా పగటిని రాత్రితో చుట్టుట మరియు రాత్రిని పగటితో చుట్టుట అనేది భూమి గోళాకారంగా ఉన్నప్పుడు మాత్రమే సాధ్యం, సమతలంగా ఉన్నప్పుడు సాధ్యం కాదు. ఈ విషయాన్ని 1400 సంవత్సరాల క్రితం ఖుర్ఆన్ లో ఎవరు తెలియజేశారో చెప్పగలరా? దానికి అతను “గుడ్డిగా ఊహించి ఉండవచ్చు” అని అంటాడు. నేను అతనితో ఛాలెంజ్ చేయక చర్చను ముందుకు కొనసాగిస్తా.

దివ్య ఖుర్ఆన్, చంద్రుని కాంతి పరావర్తన కాంతి అని స్పష్టపరుస్తుంది.

మనకు చంద్రుని కాంతి ఎక్కడి నుంచి లభిస్తుంది? దానికతను ఇలా అంటాడు “పూర్వం చంద్రుడు స్వయంగా కాంతిని వెలువరిస్తాడు అని భావించేవారు, కానీ సైన్స్ పరంగా అభివృద్ధి చెందిన తర్వాత చంద్రుడు స్వయంగా కాంతిని వెలువరించడు అని, అది కేవలం తనపై పడిన సూర్య కాంతిని పరావర్తనం చెందిస్తుందని తెలిసింది” అని అంటాడు. నేను అతనితో క్రింది ఖుర్ఆన్ యొక్క వాక్యాన్ని పరిశీలించమని చెబుతాను.

“ఆకాశంలో బురుజులను నిర్మించినవాడూ, అందులో ఒక దీపాన్నీ, ఒక మెరిసే చంద్రున్నీ వెలిగించిన వాడు ఎంతో శుభప్రదుడు”. (అల్ ఫుర్ఖాన్-25:61).

ఇక్కడ అరబీలో చంద్రుని కోసం“ఖమర్” మరియు కాంతి కోసం “మునీర్” (పతన కాంతి), లేక నూర్ (పరావర్తన కాంతి) అనే పదాలు ఉపయోగించబడినాయి. చంద్రుని కాంతి పరావర్తన కాంతి అని ఖుర్ఆన్ తెలియజేస్తుంది. సైన్సు ఈ విషయాన్ని ఈ మధ్యనే కనుగొన్నది. మరి అలాంటప్పుడు ఈ విషయం 1400 సంవత్సరాల క్రితం ఖుర్ఆన్ లో ఎవరు తెలియజేశారు? ఆ నాస్తికుడు వెంటనే జవాబు ఇవ్వడు. కొంతసేపు ఆలోచించి “మీ అదృష్టం బాగుండి, మీ ఊహ నిజమైనది” అంటాడు. చర్చను కొనసాగించుట కొరకు నేను అతనితో వాదించను. అతను దీనిని ఊహ అన్నప్పటికీ, నేను అతనితో వాదించను. చర్చ కొనసాగిస్తాను.

నేను అతనితో ఇలా అంటాను “నేను నా పాఠశాల విద్య 1982 లోపూర్తిచేసుకున్నాను. సూర్యుడు స్థిరంగా ఉంటాడని మాకు నేర్పబడింది. అది పరిభ్రమణం చేస్తుంది కానీ భ్రమణం చేయదు అని నేర్పబడింది”. అప్పుడతను నాతో “ఖుర్ఆన్ కూడా ఇదే తెలియజేస్తుందా?” అని అడిగాడు. దానికి నేను కాదు, ఇది మా పాఠశాలలో నేర్పారు. ఇది నిజమా? అని అడుగగా అతను కాదు అంటాడు. ఎందుకనగా, నేడు సైన్సు అభివృద్ధి చెందినది. సూర్యుడు పరిభ్రమణం చేయడంతో పాటు భ్రమణం కూడా చేస్తుంది అని ఈ మధ్యనే తెలిసింది. అది స్థిరంగా ఉండదు. అది తన అక్షం చుట్టూ భ్రమణం చేస్తుంది. మన వద్ద పరికరం ఉంటే దానిని నిరూపించవచ్చు. సూర్యుడు ఒక భ్రమణం చేయుటకు 25

రోజులు పడుతుంది. ఈ విషయానికి సంబంధించిన ఖుర్ఆన్ వాక్యమును పరిశీలించండి.

"రాత్రినీ, పగలునూ సృష్టించిన వాడూ, సూర్య చంద్రులను పుట్టించినవాడూ అల్లాహ్యే. అవన్నీ తమ తమ కక్షలలో భ్రమణం, పరిభ్రమణం చేస్తున్నాయి." (అల్ అంబియా 21:33)

సైన్స్ ఈ మధ్యనే కనుగొన్న ఈ విషయాన్ని ఖుర్ఆన్ లో అంతకు పూర్వమే ఎవరు తెలియజేశారు? అతను నిశబ్దంగా ఉండి చాలా సేపటి తరువాత జవాబుగా "అరబ్బులు ఖగోళ శాస్త్రంలో చాలా అభివృద్ధి సాధించారు కావున కొందరు మీ ప్రవక్తకు చెప్పి ఉండి ఉంటారు మరియు ఆయన తన పుస్తకంలో ప్రస్తావించి ఉండి ఉంటాడు" అని అంటాడు.

అరబ్బులు ఖగోళశాస్త్రం అధ్యయనంలో చాలా అభివృద్ధి సాధించారని నేను కూడా అంగీకరిస్తాను కానీ, అతనికి నేను ఒక విషయం గుర్తు చేయాలనుకుంటున్నాను అదేమనగా అరబ్బులు ఖగోళ శాస్త్ర అధ్యయనంలో అభివృద్ధి సాధించడానికి వందల సంవత్సరాల పూర్వమే ఖుర్ఆన్ అవతరించింది. కావున వారు ఖుర్ఆన్ ద్వారా ఖగోళాన్ని అధ్యయనం చేశారు కానీ విపర్యయం నిజం కాదు. ఈ విధంగా ఖుర్ఆన్ ఎన్నో శాస్త్రీయ సత్యాలను తెలియజేస్తుంది.

ఖుర్ఆన్, భూగోళ శాస్త్రం మరియు నీటి చక్రములను గూర్చి కూడా తెలియజేస్తుంది.

“మీరు గమనించరా!- అల్లాహ్, ఆకాశం నుంచి వర్షాన్ని కురిపించాడు. తర్వాత దానిని ఊటలు, చలమలు, నదుల రూపాలలో భూమిలో ప్రవేశింప జేశాడు. తర్వాత ఈ నీటి ద్వారా ఆయన రకరకాల పంటలు పండిస్తున్నాడు.” (అజ్ జుమర్-39:21)

ఖుర్ఆన్, నీటి చక్రం గూర్చి చాలా వివరంగా తెలియజేస్తుంది. మహా సముద్రాలలోని నీరు ఆవిరిగా మారి పైకి వెళ్ళి మేఘాలుగా ఏర్పడుతుందని, మేఘాలు ఘనీభవిస్తాయని మరియు ఉరుములు, మెరుపులు కలుగుటకు మేఘాలే కారణమని ఖుర్ఆన్ యొక్క చాలా వాక్యాల ద్వారా తెలుస్తుంది. వివరాలకు ఖుర్ఆన్ యొక్క ఈ క్రింది వాక్యాలను పరిశీలించండి. అల్ మునినూన్ 23:18; అర్రూమ్ 30:24,48; అన్ నూర్ 24:43.

నీటి చక్రం గూర్చి ఖుర్ఆన్ చాలాచోట్ల వివరిస్తుంది

నీటి చక్రం గూర్చి ఖుర్ఆన్ చాలా విపులంగా, వివరంగా అనేకచోట్ల తెలియజేస్తుంది. ఈ “నీటి చక్రం”ను “బెర్నార్డ్ పాలసీ” అనే ఆయన క్రీస్తు శకం 1580లో కనుగొన్నాడు. కానీ అంతకు పూర్వమే అనగా నేటికి 1400 సంవత్సరాల క్రితమే దీని గూర్చి ఖుర్ఆన్ లో ఎవరు తెలియజేసి ఉంటారు?

భూగర్భ శాస్త్రానికి సంబంధించి నాస్తికుడు ఇలా అంటాడు ఈ శాస్త్రంలో 'పొర' అనే ఒక విషయం కలదు. మనం నివసిస్తున్న ఈ భూమి యొక్క పైపొర చాలా పలుచగా ఉంది. ఈ పొరల వలన భూమి ఊగకుండా పర్వత శ్రేణులు నిరోధిస్తున్నాయి. అది భూమికి స్థిరత్వాన్ని కలిగిస్తుంది. నేను అతనితో ఖుర్ఆన్, ఆ విషయాన్ని తెలియజేస్తుంది అని చెప్తాను. ఖుర్ఆన్ లో ఇలా ఉంది.

మేము భూమిని పాన్పుగా చేశాము. అందులో పర్వతాలను మేకులుగా పాతాము.(అల్ అంబియా 78 : 6-7).

ఖుర్ఆన్ చెప్పేదేమనగా! పర్వతాలు భూమిలో పాతిన మేకుల కొయ్యలలాగా ఉన్నాయి. దీనినే శాస్త్రవేత్తలు మూల కొయ్యలు లేదా మూలమైన మేకులుగా వర్ణించారు. అంటే పర్వతాలు మూల మే కులుగా ఉన్నాయి మరియు దీని గూర్చి ఖుర్ఆన్ సూరహ్ అంబియాలో మరింత వివరంగా తెలియజేస్తుంది.

మేము భూమిపై పర్వతాలను పటిష్టంగా నిలబెట్టాము, అది వాటితో దొర్లి పోకుండా ఉండాలని. (అల్ అంబియా 21 : 31).

అంటే భూమి ఊగకుండా పర్వతాలు నిరోధిస్తున్నాయి. నాస్తికుడు ఇలా అంటాడు "ఉప్పు నీరు మరియు మంచినీరు కలిసి ఉన్నప్పటికీ అవి ఒకదానిలో మరొకటి కలసి పోవు, అవి అలాగే వేరు వేరుగానే ఉంటాయి". నేను అతనితో ఈ విషయాన్ని ఖుర్ఆన్ ఎప్పుడో తెలియజేసిందని అంటాను.

“రెండు సముద్రాలను కలిపి ఉంచినవాడు ఆయనే. ఒకటేమో రుచికరమైనది, రెండోది చేదైనది,ఉప్పైనదీను. ఆ రెండింటి మధ్య ఒక తెర అడ్డంగా ఉన్నది. అది వాటిని కలిసి పోకుండాఆపి ఉంచే అవరోధం”. (అల్-ఫుర్ఖాన్ 25 : 53).

ఇదే విషయం మరొక చోట ఇలా తెలుపబడింది. **“రెండు సముద్రాలు ఒకదానితో ఒకటి కలసి పోయేటందుకు ఆయన వాటిని వదిలి పెట్టాడు. అయినా వాటి మధ్య ఒక తెర అడ్డంగా ఉన్నది. అవి దానిని అతిక్రమించవు”. (అర్ రహ్మాన్ 55 : 19-20)**

నేడు సైన్సు చెప్పేదేమిటంటే ఉప్పు నీరు మరియు మంచి నీరు ఒకదానిలో మరొకటి కలువవు. వాటి మధ్య ఒక అడ్డుగోడ ఉంటుంది. దానికి అతను “కొంతమంది అరబ్బులు నీటి అడుగు భాగానికి వెళ్ళినప్పుడు ఆ అడ్డుతెరను చూసి ఉండవచ్చు, దానినే అతను ఖుర్ఆన్ లో తెలియజేశాడు” అని అంటాడు. కానీ ఆ నాస్తికులు ఒక విషయాన్ని గుర్తించడంలో విఫలమయ్యారు అదేమనగా అడ్డుతెర కంటికి కనిపించనిది. ఇక్కడ ఖుర్ఆన్ “బర్జఖ్” అనే పదం వాడింది. దాని అర్థం కంటికి కనిపించని అడ్డుగోడ. ఈ దృగ్విషయానికి ఆధారం ఆఫ్రికా యొక్క దక్షిణ కొన భాగంలోని కేప్ టౌన్. అలాగే ఈజిప్టులోని నైలు నది, మెడిటెర్రనీన్ సముద్రంలో కలిసే చోట కూడా దీనిని చూడవచ్చు. ఇంకా ఈ దృగ్విషయానికి మంచి ఉదాహరణ నాలుగు వేల మైళ్ల దూరం ప్రయాణం చేసే గల్ఫ్ ప్రవాహం. అక్కడ రెండు రకాల నీరు ఉంటుంది. కానీ అవి ఒకదానితో ఒకటి కలవవు.

దివ్యఖుర్ఆన్ లో ఇలా ఉంది **“మేము, ప్రాణం ఉన్న ప్రతి దానినీ నీళ్లతో సృష్టించాము, వారు (సృష్టించే మా ఈ శక్తిని) అంగీకరించరా?” (అల్ అంబియా 21 : 30).**

ఒక్కసారి ఊహించండి, అరేబియా ఎడారులలో, ఎక్కడైతే నీటి కొరత ఎక్కువగా ఉంటుందో అటువంటి ప్రదేశంలో ప్రతి ప్రాణి నీటిచే సృష్టించబడిందని ఎవరు ఆలోచించగలరు? ఒకవేళ వారు ఊహించినట్లయితే, ఒక్క నీరు తప్ప ప్రతి దానినీ ఊహించి ఉండేవారు. నేడు సైన్స్ తెలియజేసేది ఏమనగా, ఒక కణంలో ప్రధాన భాగమైన జీవద్రవ్యం అంటే cytoplasm లో 80% నీరు ఉంటుంది. ఈ లెక్కన జీవం ఉన్న ప్రతి ప్రాణిలో 50 నుంచి 90 శాతం వరకు నీరే ఉంటుందని తెలుస్తుంది. ఈ విషయాన్ని 1400 సంవత్సరాల క్రితమే దివ్యఖుర్ఆన్ లో ఎవరు తెలియజేసి ఉంటారు? దానికి ఆ నాస్తికుడు జవాబు ఇవ్వక నిశ్శబ్దంగా ఉంటాడు.

గణిత శాస్త్రములో ‘సంభావ్యత’ అనే సిద్ధాంతం కలదు. ఆ సిద్ధాంతం ప్రకారం, ఒకటి తప్పు రెండవది ఒప్పుగా ఉన్న రెండు అంశాలలో ఒకవేళ నీవు ఒక అంశాన్ని గుడ్డిగా ఊహించినట్లయితే నీవు సత్యమైన జవాబు పొందుటకు ఉన్న అవకాశాల సంఖ్య రెండింటిలో ఒకటి మాత్రమే. అంటే 50%. ఉదాహరణకు ఒక రూపాయి నాణెంను ఎగరవేసినప్పుడు నేను ఊహించినది సత్యం అయ్యే అవకాశాల సంఖ్య రెండింటిలో ఒకటి మాత్రమే. అంటే 50 శాతం. ఒకవేళ ఆ నాణెంను రెండవసారి కూడా ఎగర వేసినట్లయితే, నేను రెండవసారి ఊహించింది కూడా నిజమయ్యే అవకాశాల సంఖ్య రెండింటిలో ఒకటి. అంటే 50 శాతం. కానీ పై రెండు సందర్భాలలోనూ నేను ఊహించినది నిజం అయ్యే అవకాశాల సంఖ్య ½ X ½ అనగా 1/4 లేదా 25%. ఒకవేళ ఆరు ముఖాలు గల పాచికను విసరి నట్లయితే, అప్పుడు నేను

ఊహించింది నిజమయ్యే అవకాశాల సంఖ్య ఆరింటిలో ఒకటి మాత్రమే. అంటే 1/6. కానీ పై మూడు సందర్భాలలోనూ నేను ఊహించింది నిజమయ్యే అవకాశాల సంఖ్య ½ X ½ X 1/6 అంటే 1/24.

మనం ఈ సిద్ధాంతంను 'ఖుర్ఆన్'కు వర్తింపజేద్దాము. కేవలం వాదనను, చర్చను కొనసాగించడానికే, 'ఖుర్ఆన్'లో తెలియజేయబడినది ఎవరో ఊహించింది అనుకుందాము. భూమి గోళాకారంగా ఉంది అని తెలియజేసే ఖుర్ఆన్ వాక్యానికి ఈ సంభావ్యతా సిద్ధాంతంను అనువర్తింపజేద్దాం. భూమి యొక్క ఆకారం గూర్చి ఒక వ్యక్తి ఎన్ని రకాల ఆకారాలను ఊహించగలడు? అది సమతలంగా ఉంది అని కొందరంటారు. మరి కొందరు త్రిభుజాకారమని, మరికొందరు చతురస్రాకారమని, మరికొందరు పంచభుజి అని, మరికొందరు షడ్భుజి అని, మరికొందరు సప్త భుజి అని, మరికొందరు అష్టభుజి అని, మరియు కొందరు గోళాకారమని అంటారు.

ఈ విధంగా భూమి యొక్క ఆకారం గూర్చి 30 వేర్వేరు ఆకారాలు ఊహించగలిగితే అందులో ఎవరైనా గుడ్డిగా ఊహించినది నిజమయ్యే అవకాశాల సంఖ్య 30 లో ఒకటి అనగా 1/30. చంద్రుని కాంతి అది స్వయంగా వెలువరించినదైనా కావచ్చు లేక పరావర్తన కాంతి అయినా కావచ్చు. ఎవరైనాఈ విషయంలో గుడ్డిగా ఊహించినట్లయితే, అది నిజమయ్యే అవకాశాల సంఖ్య రెండింటిలో ఒకటి అనగా 1/2 . కానీ భూమి

గోళాకారంగా ఉంది అని మరియు చంద్రుని కాంతి పరావర్తన కాంతి అని ఊహించిన రెండు సందర్భాలలోనూ జవాబు నిజమయ్యే అవకాశాల సంఖ్య 1/30 X 1/2 అనగా 1/60.

అరేబియా ఎడారిలో, ప్రాణం ఉన్న ప్రతిదీ దేనితో సృష్టించబడిందని ఒక వ్యక్తి ఆలోచించగలడు? ప్రతిదీ ఇసుకతో లేక చెక్కతో లేక అల్యూమినియం లేక ఇనుము లేక కాపర్ లేక నూనె లేక నీరు లేక హైడ్రోజన్ లేక ఆక్సిజన్ తో సృష్టించబడి ఉండవచ్చునేమో అని ఎడారిలోని వ్యక్తి ఆలోచించవచ్చు. ఈ విధంగా పది వేల రకాల ఊహలు చేయగలడు మరియు వాటిలో ఎవరైనా చివరిగా ఊహించేది నీటినే.

ప్రతి ప్రాణి నీటిచే సృష్టించబడిందని ఖుర్ఆన్ తెలియజేస్తుంది

ఖుర్ఆన్ లో ఇలా ఉంది. **“ప్రతి ప్రాణి నీటిచే సృష్టించబడింది”. (అల్ అంబియా 21 : 30).** ఇంకా,

“సంచరించే సమస్త ప్రాణులనూ అల్లాహ్ నీటితో సృజించాడు”. (అన్ నూర్ 24 : 45).

మరొకచోట **“నీటితో మానవుణ్ణి సృష్టించిన వాడు ఆయనే”. (అల్ ఫుర్ఖాన్ 25 : 54)** అని తెలియజేస్తుంది. ఒకవేళ ఎవరైనా గుడ్డిగా ఊహించినట్లయితే, అతని ఊహ నిజమయ్యే అవకాశాల సంఖ్య 10,000 లలో ఒకటి. అనగా 1/10,000. పై మూడు విషయాలలో అంటే ‘భూమి, గోళాకారంగా ఉంది’, ‘చంద్రుని కాంతి

పరావర్తన కాంతి' మరియు 'ప్రతి ప్రాణి నీటిచే సృష్టించబడింది' అనే మూడింటిని ఎవరైనా ఊహించారు అనుకున్నట్లయితే వారి ఊహ నిజమయ్యే అవకాశాల సంఖ్య 1/30 X 1/2 X 1/10,000. అనగా 1 by 6 లక్షలు. దాని విలువ 0.0000017.

1000 కంటే ఎక్కువ ఖుర్ఆన్ వాక్యాలు సైన్సు గూర్చి తెలియజేస్తున్నాయి

ఆనాడు తెలియని ఎన్నో వందలాది సత్యాలను ఖుర్ఆన్ తెలియజేసింది. వాటికి సంభావ్యతా సిద్ధాంతంను వర్తింపజేసి పరీక్షించుకోవాలని విజ్ఞులైన శ్రోతలకు తెలియజేస్తున్నాను. ఒకవేళ ఎవరైనా ఊహించి ఉండినట్లయితే, వారు ఊహించిన ప్రతిదీ సత్యమయ్యే అవకాశాల సంఖ్య దాదాపు సున్నాకు దగ్గరగా ఉంటుంది. మరియు సంభావ్యతా సిద్ధాంతంలో దాని విలువ సున్నా. కొందరు ఇలా ప్రశ్నిస్తారు. "జాకీర్! మీరు ఖుర్ఆన్ ను నిరూపించడానికి విజ్ఞాన శాస్త్రంను ఉపయోగిస్తున్నారా"? అటువంటి వారికి నేను గుర్తు చేయునది ఏమనగా! ఖుర్ఆన్ సైన్సు గ్రంథం కాదు, అది సూచనల గ్రంథం. ఖుర్ఆన్ లో 6000 సూచనలు కలవు. 6000 కంటే ఎక్కువ ఆయతులు కలవు. వాటిలో 1000 కంటే ఎక్కువ ఆయతులు విజ్ఞానశాస్త్ర జ్ఞానంతో నిండి ఉన్నాయి.

నేను ఖుర్ఆన్ ను సత్యమని నిరూపించుటకు సైన్సును ఉపయోగించుట లేదు. ఎందుకనగా దేనినైనా సత్యమని

నిరూపించుటకు ప్రామాణిక కొలత (కొలబద్ధ) కావాలి మరియు అది చివరిదై ఉండాలి. మనకు అంటే ముస్లిములకు చిట్ట చివరి ప్రామాణికం[కొలబద్ధ] దివ్య ఖుర్ఆన్. అది ఫుర్ ఖాన్ అంటే సత్యం మరియు అసత్యాలను విడమర్చి తెలియజేసే గ్రంథం. కాని ఒక నాస్తికుడు, మరియు దేవుడిని విశ్వసించని విద్యావంతుడికి సైన్సే అతని చివరి ప్రామాణిక [కొలబద్ధ] కొలత. కావున నేను, ఖుర్ఆన్ తెలియజేసిన దానిని నిరూపించుటకు అతని కొలబద్ధను ఉపయోగిస్తున్నాను.

చాలా సందర్భాలలో సైన్సు U- ఆకారపు మలుపు తిరుగుతుంది.

చాలా సందర్భాలలో సైన్సు U- ఆకారపు మలుపు తిరుగుతుందని మనందరికీ తెలుసు. అందుకే నేను ఆధారాలతో నిరూపించబడిన శాస్త్రీయ సత్యాలను గురించి మాత్రమే ప్రస్తావించాను,కానీ ఊహలపై ఆధారపడిన సిద్ధాంతాల గురించి ప్రస్తావించలేదు.నేను అతని కొలబద్ధను ఉపయోగించి,దేనినైతే సైన్సు నిన్న అనగా 100 సం!! క్రితం తెలియజేసిందో దానిని ఖుర్ఆన్ అంతకు ముందుగానే చెప్పిందని తెలియజేస్తాను. చివరిగా మేము ఒక అంగీకారానికి వస్తాము అదేమనగా సైన్సు కంటే ఖుర్ఆన్ చాలా ఉన్నతమైనది, శ్రేష్టమైనది అని. దివ్య ఖుర్ఆన్ అనేక శాస్త్రీయ సత్యాలను గురించి తెలియజేస్తుంది. ఖుర్ఆన్ లో ఇలా తెలియజేయబడింది **“వృక్ష జాతి జతలు జతలుగా సృష్టించబడింది”. [తాహా 20 : 53]**

దీనిని సైన్సు ఈ మధ్యనే కనుగొన్నది.మరొక చోట ఇలా ఉంది. **“పండ్లు జతలుగా సృష్టించబడ్డాయి”. [అర్రాద్ 13 :3].**

జియాలజీ విభాగంలో ఖుర్ఆన్ ఇలా తెలియజేస్తుంది **“జంతువులు మరియు పక్షులు మీలాగే సంఘ జీవనం కొనసాగిస్తాయి” [అల్ ఆన్ ఆమ్ 6:38].** ఈ విషయంను సైన్సు ఈ మధ్యనే కనుగొనింది. ఖుర్ఆన్, అధ్యాయం నెం 16 లో 68 వ వాక్యంలో ఇలా తెలియజేస్తుంది **“నీ ప్రభువు ఆడ తేనెటీగకు వహీ ద్వారా ఇలా తెలిపాడు, కొండలలో,చెట్లమీద,తడికలపైన తుట్టెలను నిర్మించమని”.**

తేనెను సేకరించేది మగ తేనెటీగ కాదని సైన్సు ఈ మధ్యనే కనుగొన్నది. ఇవి తమ రెక్కలను ఆడిస్తూ కొత్త తోటలకు దారిని చూపిస్తాయి. ఈ విషయం ఖుర్ఆన్ లో తెలియజేయబడింది. దీనిని సైన్సు ఈ మధ్యనే కనుగొన్నది. ఖుర్ఆన్ సూరహ్ అన్ కబూత్ సూరహ్ నెం 29, ఆయత్ నెం 41 లో ఇలా తెలియజేస్తుంది “ **అన్ని ఇళ్ల కంటే అతి బలహీనమైన ఇల్లు సాలెపురుగు ఇళ్లే అవుతుంది”.** ఇక్కడ ఖుర్ఆన్ వాటి యొక్క భౌతిక స్థితితో పాటు సంబంధ భాంధవ్యాలను గురించి కూడా తెలియజేస్తుంది. ఎలాగంటే సాలెపురుగులలో తరచుగా ఆడ పురుగులు,మగ పురుగులను చంపివేస్తాయి. ఖుర్ఆన్ సూరహ్ నమ్ల్ ,అధ్యాయం నెం 27, ఆయత్ నెం 17,18 ల లో “ **చీమలు ఒక దానితో మరొకటి సంభాషిస్తాయి”** అని తెలియజేస్తుంది. ఇది ఒక అందమైన కథల పుస్తకం అని మీరు భావించవచ్చు. ఏమిటీ! చీమలు ఒకదానితో మరొకటి మాట్లాడతాయా? కానీ నేటి సైన్సు తెలియజేస్తున్నదేమనగా! మానవుని జీవన విధానంకు చాలా దగ్గరగా వున్న, పోల్చదగిన జీవిత విధానం గల జంతువు లేక కీటకం చీమ జాతిది. అవి కూడా మృతులను ఖననం చేస్తాయి.వాటికి కూడా చాలా ఉన్నతమైన సమాచార వ్యవస్థ కలదు.వాటికి కూడా క్రయ విక్రయాల స్థలం కలదు.

వైద్య శాస్త్రం ,పిడాభివృద్ధి శాస్త్రం మరియు జంతు దేహ సంబంధ శాస్త్రాల గూర్చి కూడా ఖుర్ఆన్ చర్చిస్తుంది.

దివ్య ఖుర్ఆన్ వైద్య శాస్త్రం గూర్చి చర్చిస్తుంది.అది సూరహ్ నహల్ , అధ్యాయం నెం 16, ఆయత్ నెం 68 మరియు 69 లో "**తేనెటీగ కడుపులో నుండి రంగు రంగుల పానకం ఒకటి వెలువడుతుంది. అందులో ప్రజల కోసం వ్యాధి నివారణ శక్తి ఉన్నది**" అని అంటోంది.దీనిని మనం ఈ మధ్యనే కనుగొన్నాము.నేటి తేనెలో వ్యాధి నివారణా శక్తి ఉన్నదని నేటి సైన్సు తెలియజేస్తుంది.రష్యన్ సైనికులు తమ గాయాలపై మందుగా దీనిని పూశారు అనడంలో సందేహం లేదు. అది చాలా త్వరగా గాయాలను మాన్పించింది. తేనెను చాలా రకాల చర్మ వ్యాధులకు చికిత్సగా ఉపయోగించారు.

ఖుర్ఆన్, జంతు దేహ సంబంధ శాస్త్రం గూర్చి కూడా ఖుర్ఆన్ చర్చిస్తుంది. ఖుర్ఆన్ సూరహ్ నహల్ అధ్యాయం నెం 16 , ఆయత్ నెం 66 లో మరియు సూరహ్ మూమినూన్, అధ్యాయం నెం 23, ఆయత్ నెం 21 లలో రక్త ప్రసరణ మరియు పాల ఉత్పత్తి గూర్చి వర్ణిస్తుంది. రక్త ప్రసరణ గూర్చి ఖుర్ఆన్ తెలియజేసిన 600 సం!! ల తర్వాత ఇబ్నె నఫీస్ అనే అతను రక్తం ప్రసరిస్తుందని కనుగొన్నాడు. మరియు ఖురాన్ అవతరించిన నాటికి 1000 సం!! ల తర్వాత గాని విలియం హార్వే గారు రక్త ప్రసరణను పాశ్చాత్య ప్రపంచంలో బహుళ ప్రచారం చేశాడు.

ఖుర్ఆన్ పిండాభివృద్ధి శాస్త్రం గూర్చి కూడా తెలియజేస్తుంది. ఖుర్ఆన్ మొట్ట మొదటగా సూరహ్ అలఖ్ లేక సూరహ్ ఇఖ్రా యొక్క క్రింది వాక్యాలతో అవతరించింది "**పఠించు సర్వాన్ని సృష్టించిన నీ ప్రభువు పేరుతో. ఆయన మానవుణ్ణి జలగలాగా పేరుకుపోయిన లేక ఊగుతున్న నెత్తుటి ముద్దతో సృష్టించాడు".** ఈ వాక్యం మరియు ఖుర్ఆన్ లో Embryology కి సంబంధించిన ఇతర వాక్యాలను కొందరు అరబ్బులు ఆనాడు పిండాభివృద్ధి శాస్త్రంలో ప్రఖ్యాతి గాంచిన ప్రొఫెసర్ కీత్ మోర్ వద్దకు తీసుకువెళ్లారు. ఆయన కెనడా లోని టొరంటోలో నివసించేవారు. పిండాభివృద్ధి శాస్త్రం గూర్చి ఖుర్ఆన్ తెలియజేయునది నిజమేనా? అని ఆయనను అడగడం జరిగింది. **"ఒకవేళ మీకు సందేహం ఉన్నట్లయితే జ్ఞానం కలవారిని అడగండి"** అనే ఖుర్ఆన్ వాక్యానుసారం కొందరు అరబ్బులు ఆ విధంగా చేశారు. ప్రొఫెసర్ కీత్ మోర్ గారు ఇలా అన్నారు "ఖుర్ఆన్ లో తెలుపబడిన విషయాలలో అధిక భాగం ఈ మధ్యనే కనుగొన్న పిండాభివృద్ధి శాస్త్రంతో 100% ఏకీభవిస్తున్నాయి. కానీ కొన్ని విషయాల గూర్చి నేను ఏమీ చెప్పలేను. ఎందుకనగా స్వయంగా నాకు వాటి గూర్చి తెలియదు". అలాంటి వాటిలోనిదే ఈ వాక్యం "**మేము మానవుణ్ణి జలగలాగ పేరుకుపోయి ఊగుతున్న నెత్తుటి ముద్దతో సృష్టించాము".**

అతను ఒక జనిగ చిత్రాన్ని తెచ్చాడు మరియు తన లాబొరేటరీలోకి వెళ్ళి చాలా శక్తివంతమైన ఒక సూక్ష్మదర్శిని సహాయంతో పిండం యొక్క తొలి దశలను పరిశీలించాడు. మరియు అది ఖచ్చితంగా జలగను పోలి ఉంది. అప్పుడు అతను ఇలా అన్నాడు "ఖుర్ఆన్ తెలియజేసేదంతా పూర్తిగా సత్యం"

మరియు అతను ఖుర్ఆన్ నుంచి పొందిన కొత్త సమాచారంను అతని పుస్తకం "**THE DEVELOPING HUMAN**" లో సమకూర్చాడు. ఈ పుస్తకం ఆ సంవత్సరంలో ఒక వ్యక్తిచే వ్రాయబడిన గొప్ప వైద్య సంబంధమయిన పుస్తకంగా ప్రఖ్యాతి గావించింది. మరియు అతను ఇలా అన్నాడు "పిండాభివృద్ధి శాస్త్రం గూర్చి ఖుర్ఆన్ తెలియజేస్తున్న దానినంతటినీ సైన్సు ఈ మధ్యనే కనుగొనింది. అది వైద్య శాస్త్రం యొక్క ఒక ప్రత్యేక విభాగంగా రూపొందింది.దీనిని ఏ మానవ మాత్రుడూ వ్రాయలేదు,ఇది దైవం అవతరింపజేసినదే అయి ఉండాలి".

ఖుర్ఆన్, సూరహ్ అత్ తారిఖ్ అధ్యాయం నెం 86, ఆయతులు 5 నుండి 7 లో ఇలా తెలియజేస్తుంది "**మానవుడు తాను ఎలాంటి వస్తువుతో పుట్టించబడ్డాడో కొంచెం ఆలోచించాలి. వెన్నెముకకు, ప్రక్కటెముకలకు మధ్య నుండి దూకుడుగా వెలువడే ఒక ద్రవ పదార్ధంతో అతడు పుట్టించబడ్డాడు**". మరియు నేటి సైన్సు చెప్పేదేమిటంటే ప్రత్యుత్పత్తి అవయవాలైన వృషణాలు మరియు అండాశయాలు, పిండాభివృద్ధి దశలో ప్రస్తుతం మూత్రపిండాలున్న స్థానం నుండి అభివృద్ధి చెందుతాయి. అనగా వెన్నెముక మరియు 11 లేదా 12వ ప్రక్కటెముక మధ్య నుండి. అలాగే దివ్య ఖుర్ఆన్ 53 : 45 – 46, 75 : 37 – 39 అధ్యాయాలలో "**లింగ నిర్ధారణ జరిగేది పురుషుని వీర్యం వలన**" అని తెలియజేస్తుంది. ఈ విషయంను సైన్సు ఈ మధ్యనే కనుగొనింది. మరియు పిండం దట్టమైన మూడు పొరలతో కప్పబడి ఉంటుందని చాలా వివరంగా ఖుర్ఆన్ తెలియజేస్తున్న దానిని నేటి సైన్సు ధృవీకరిస్తుంది.

దివ్య ఖుర్‌ఆన్ సూరహ్ ము’మినూన్ సూరహ్ నెం 23 ఆయత్ నెం 12 నుండి 14 లలో మరియు సూరహ్ హజ్ సూర నెం 22, ఆయత్ నెం 5 లలో ఇలా తెలియజేస్తుంది “**మానవుడు మొదట వీర్య బిందువుతో , తర్వాత జలగలాగా వ్రేలాడే నెత్తుటి గడ్డ, తర్వాత నమలబడిన వస్తువును పోలి ఉండే మాంసపు కండ [ముజ్ఘహ్], తర్వాత ఆ మాంసపు కండ ఎముకలుగా [ఇజామన్] మార్చబడి , ఆ ఎముకలకు మాంసం [లహమ్] తొడగబడి సృష్టించబడ్డాడు”.** పిడాభివృద్ధి దశలను గూర్చి ఖుర్‌ఆన్ చాలా వివరంగా వర్ణిస్తుంది. అలాగే దివ్య ఖుర్‌ఆన్ లోని 32:9; 76:2 లలో ఇలా తెలియజేయబండింది **“ఆయనే అల్లాహ్ మీకు వినే శక్తినీ, చూసే శక్తినీ ప్రసాదించేవాడు”.** నేటి సైన్సు చెప్పేదేమిటంటే మొదట వినే శక్తి వస్తుంది. ఈ వినికిడి శక్తి గర్భ[పిండ] దశలో 5వ నెల వరకే పూర్తిగా అభివృద్ధి చెందుతుంది మరియు కళ్ళు గర్భం యొక్క 7వ నెలలో తెరవబడతాయి.

తీర్పుదినం నాడు, అల్లాహ్ మానవుని ఎముకలను ఎలా జతపరచగలడు? అనే ప్రశ్నకు జవాబు ఖుర్‌ఆన్ లో సూరే ఖియామహ్ సూరహ్ నెం 75, ఆయత్ నెం 3 నుండి 4 లలో అల్లాహ్ ఇలా అంటున్నాడు “**మేము మానవుని ఎముకులను జతచేయలేమని అతడు అనుకుంటున్నాడా? ఎందుకు జత చేయలేము? మేము అతని వ్రేళ్ళ కొనలను సైతం సముచితమైన రీతిలో రూపొందించగల సమర్ధులం”.** అల్లాహ్, మానవుడి వ్రేళ్ళ కొనలను సైతం సముచితరీతిలో రూపొందించగలడని ఖుర్‌ఆన్ అంటోంది. దాని అర్ధం ఏమిటి?

1400 సం:ల క్రితమే వేలి ముద్రల గూర్చి ఖురాన్ తెలియజేసింది.

ప్రజలను గుర్తించుటకు నేడు మనం వాడే వేలి ముద్రల పద్ధతిని మొట్ట మొదటగా క్రీ.శ.1880లో సర్ ఫ్రాన్సిస్ గాల్ట్ కనుగొన్నాడు. ఒక మిలియన్ ప్రజలలోనైనా సరే ఏ ఇద్దరి వేలి ముద్రలూ సమానంగా ఉండవు. ఈ వేలి ముద్రల గూర్చి ఖుర్ఆన్ 1400 సం!!ల క్రితమే వివరించింది. ఇలా ఎన్నో ఉదాహరణలున్నాయి. ఒకవేళ మీరు మరిన్ని వివరాలు తెలుసుకోవాలంటే బయట మార్కెట్లో అమ్మకానికి నా CD, Quran and Modern science conflict or Concilation ను చూడగలరని మనవి.

నేను మీకు మరొక శాస్త్రీయ సత్యం గూర్చి తెలియజేయాలనుకుంటున్నాను. థైలాండ్ దేశంలో థగడా షాన్ అనే ప్రొఫెసర్ ఉండేవారు. అతను బాధా గ్రాహకాలు(pain receptors) పై చాలా లోతుగా పరిశోధన జరిపాడు. బాధ యొక్క అనుభూతిని కలిగించేది మెదడే అని పూర్వం సైన్సు భావించేది.కానీ ఈ మధ్య కాలంలో మనకు తెలియవచ్చిందేమనగా బాధా గ్రాహకాలు చర్మంలో ఉంటాయని మరియు అవే మనకు నొప్పి అనుభూతిని కలిగిస్తాయని తెలిసింది. సూరహ్ నిసా లో 54వ వాక్యంలో ఖుర్ఆన్ ఇలా తెలియజేస్తుంది "**మా ఆయతులను నిరాకరించినవారిని మేము నిశ్చయంగా అగ్నిలో పడవేస్తాము. ఇంకా వారి శరీర చర్మం కాలి కరిగి పోయినప్పుడల్లా, దాని స్థానం లో మేము మరొక చర్మాన్ని సృష్టిస్తాము, వారు శిక్షను బాగా రుచి చూడాలని".** ఇక్కడ

ఖుర్ఆన్ పరోక్షంగా తెలియజేసేదేమిటంటే చర్మంలో ఏదో ఉంది ,అదే బాధ యుక్క అనుభూతిని కలిగిస్తుంది. అంటే బాధా గ్రాహకం గూర్చి తెలియజేస్తుంది.

ఈ విషయంను మొదట ప్రొఫెసర్ థగడా షాన్ గారు నమ్మలేకపోయారు. కాని నిర్ధారించుకున్న తర్వాత, ఈ గ్రంథం బాధా గ్రాహకాల గూర్చి 1400 సం!! ల క్రితమే తెలియజేసిందని గుర్తించారు. మరియు కైరోలో నిర్వహించబడిన మెడికల్ కాన్ఫరెన్స్ లో "**లా ఇలాహ ఇల్లల్లాహు, ముహమ్మదుర్రసూలుల్లాహ్**" అంటే 'అల్లాహ్ తప్ప ఆరాధ్య దేవుడెవ్వడూ లేడు మరియు ముహమ్మదు (స) ఆయనచే పంపబడిన సందేశహరుడు' అనే వచనంను పఠించి ఇస్లాం స్వీకరించి ముస్లింగా మారారు.

ఈ శాస్త్రీయ సత్యాలన్నింటినీ దివ్య ఖుర్ఆన్ లో ఎవరు తెలియజేశారు? అని మీరు నాస్తికుడిని అడగండి. అతను ఇంతకు పూర్వం మీకిచ్చిన జవాబే ఇప్పుడు కూడా ఇవ్వగలడు. అదేమనగా ఒక కొత్త వస్తువు యొక్క మెకానిజం చెప్పగల మొదటి వ్యక్తి దాని సృష్టికర్త లేక దానిని కనుగొన్నవాడు లేక నిర్మాత లేక ఉత్పత్తిదారుడు. ఇదేవిధంగా, ఈ శాస్త్రీయ సత్యాలన్నింటినీ దివ్య ఖుర్ఆన్ లో తెలియజేసినవాడే, ఈ విశ్వానికి సృష్టికర్త, నిర్మాత, ఉత్పత్తిదారుడు. ఆయననే మనం ఆంగ్లంలో గాడ్ అని మరియు అరబిలో అల్లాహ్ అని పిలుస్తాం.

ఫ్రాన్సిస్ బేకన్ గారు చెప్పింది అక్షరాలా నిజం. అదేమనగా సైన్సు యొక్క పరిమిత జ్ఞానం నిన్ను నాస్తికుడిగా మారుస్తుంది కానీ అదే సైన్సు యొక్క లోతైన జ్ఞానం నిన్ను (ఆస్తికుడిగా) మహాశక్తిమంతుడైన దేవుడిని విశ్వసించేలా చేస్తుంది.

నేటి శాస్త్రవేత్తలు దైవ నమూనాల జాబితా నుండి తొలగించబడినవారు మరియు వారే స్వయంగా దైవాలు కాదు అనడంలో ఆశ్చర్యం లేదు.

నేను నా యొక్క ప్రసంగంను ప్రారంభంలో నేను పఠించిన ఖుర్ఆన్ యొక్క వాక్యానువాదంతో ముగించదలచాను, అది "**మేము త్వరలోనే వారికి మా సూచనలను వారి చుట్టూ ఉన్న ప్రపంచంలోనూ చూపిస్తాము, వారిలోనూ చూపిస్తాము. చివరకు ఈ ఖుర్ఆన్ నిస్సందేహంగా సత్యమైనదని వారికి విశదమైపోతుంది". (హామీమ్ అస్ సజ్దహ్ 41 : 53).**

సందేహాలు –సమాధానాలు

1. నా పేరు సార్ల రామచందర్. నా ప్రశ్నేమనగా, ముస్లింలు దేవుడిని 'అల్లాహ్' అనే ఎందుకు పిలుస్తారు?

జవాబు:- ముస్లింలు, దేవుడిని అల్లాహ్ అనే పిలుస్తారు ఎందుకు? అని సోదరుడు ప్రశ్నించాడు. నేను నా ప్రసంగంలో అల్లాహ్ కు నిర్వచనంగా దివ్య ఖుర్ఆన్ లోని 112వ సూరహ్ అయిన అల్ ఇఖ్లాస్ ను చెప్పాను అది " **ఇలా చెప్పెయ్యి! ఆయన అల్లాహ్, అద్వితీయుడు. అల్లాహ్ నిరపేక్షాపరుడు, ఎవరి ఆధారమూ, ఎవరి అవసరమూ లేనివాడు. అందరూ ఆయనపై ఆధారపడేవారే. ఆయనకు సంతానం ఎవరూ లేరు.ఆయన కూడా ఎవరి సంతానమూ కాదు. ఆయనకు సరిసమానులు ఎవరూ లేరు".**

అలాగే దివ్య ఖుర్ఆన్ ఇలా అంటోంది "'**అల్లాహ్ అని అయినా పిలవండి. లేదా రహ్మాన్ అని అయినా సరే. ఏ పేరుతో అయినా పిలవండి. ఆయనకు గల పేర్లు అన్నీ చక్కనివే" (బనీ ఇస్రాయీల్ 17 : 110).** ఇలాంటి సందేశాన్నే

7:180; 59:24 మరియు 20:8 అధ్యాయాలలో ఇలా తెలియజేయబడింది **"అల్లాహ్ కు ఉత్తమమైన పేర్లు ఉన్నాయి".** కాని ఆ పేరు ద్వారా ఒక ఆకారంను ఊహించగలిగేదిగా ఉండకూడదు. అది ఉత్తమమైన పేరయి ఉండాలి.

ఇక ముస్లింలు, దేవుడిని ఆంగ్లపదమైన గాడ్ లేక తెలుగు పదమైన దేవుడు కంటే కూడా అల్లాహ్ అని పిలవడానికే

ఇష్టపడతారు. ఎందుకనగా అరబీ పదమైన 'అల్లాహ్' పరిశుద్ధమైన పదం. ఆంగ్లపదమైన గాడ్ మరియు తెలుగు పదాలైన దేవుడు లను దుర్వినియోగపరిచే అవకాశం ఉంది. ఈ రెండు పదాలకు తెలుగు మరియు ఆంగ్ల భాషలలో బహువచన, స్త్రీ లింగ పదాలు కలవు, కానీ అరబీ పదమైన 'అల్లాహ్'కు బహువచన, లింగ సంబంధ పదాలు లేవు. 'అల్లాహ్' అనే పదం ఏ లింగానికీ చెందదు. అలాగే ఆంగ్ల పదమైన God ను Godfather, Godmother అని నానా విధాలుగా ఉపయోగిస్తారు, కానీ అరబీ పదమైన 'అల్లాహ్'ను దేవుడికి తప్ప మరే విధంగానూ ఉపయోగించరు. కావున 'అల్లాహ్' అనే పదం పరిశుద్ధమైన ఏకైక పదం. మీరు ఆయనను ఏ పేరుతోనైనా పిలువవచ్చు కానీ అది చక్కనిదై ఉండాలి. మీ ప్రశ్నకు జవాబు లభించిందని ఆశిస్తున్నాను.

2. అస్సలాము అలైకుమ్. నా పేరు ఖాసిం దావీర్. నా ప్రశ్నేమనగా 'దివ్య ఖుర్ఆన్ లోని 4వ అధ్యాయంలోని 11,12 వాక్యాల ప్రకారం పంచిన వారసత్వ భాగాలన్నింటి మొత్తం 1 కంటే ఎక్కువ, కావున ఖుర్ఆన్ రచయితకు గణితం తెలియదు' అని అరుణ్ శౌరీ ఆరోపిస్తున్నాడు. దీనిని వివరించగలరు.

జవాబు:- సోదరుడు అడిగిన ప్రశ్నేమనగా! దివ్య ఖుర్ఆన్ లోని 4వ అధ్యాయంలోని 11,12 వాక్యాల ప్రకారం పంచిన వారసత్వ భాగాలన్నింటి మొత్తం 1 కంటే ఎక్కువ, కావున ఖుర్ఆన్ రచయితకు గణితం తెలియదు' అని అరుణ్ శౌరీ ఆరోపిస్తున్నాడని.

నేను నా ప్రసంగంలో తెలియజేసినట్లు, ఖుర్ఆన్ లో తప్పులను చూపేవారు వందలాది మంది ఉన్నారు, కానీ మీరు వాటిని విశ్లేషిస్తే, అవన్నీ అసత్యాలేననీ మరియు వాటిలో ఏ ఒక్కటీ నిజం కాదని తెలుస్తుంది. వారసత్వ పంపిణీ గూర్చి ఖుర్ఆన్ లో 2:180; 2:240; 4:9; 4:19; 5:105 లలో తెలియజేయబడింది. అయితే వారసత్వ భాగాల గూర్చి వివరణాత్మకంగా సూరహ్ నిసా అధ్యాయం నెం 4లోని 11, 12 మరియు 176 వాక్యాలలో తెలియజేస్తుంది.

ఇక అరుణ్ శౌరీ ఉదాహరణగా చెప్పిన సూరహ్ నిసా యొక్క 11, 12 వాక్యాల అనువాదం ఇలా ఉంది "**మీ సంతానం విషయంలో అల్లాహ్ మీకు ఇలా ఆదేశిస్తున్నాడు : ఒక పురుషుని భాగం ఇద్దరు స్త్రీల భాగాలకు సమానం. ఒకవేళ (మృతునికి వారసులుగా) ఇద్దరికంటే ఎక్కువమంది ఆడ పిల్లలు ఉంటే, వారికి మొత్తం ఆస్తిలో మూడింట రెండు భాగాలు ఇవ్వాలి. ఒకే ఆడపిల్ల వారసురాలైతే, ఆస్తిలో అర్ధ భాగం ఆమెకు చెందుతుంది. మృతుడు సంతానం కలవాడైతే, అతని తల్లిదండ్రులలో ఒక్కొక్కరికి మొత్తం ఆస్తిలో ఆరోభాగం లభించాలి. ఒకవేళ అతడు సంతానం లేనివాడై అతని తల్లిదండ్రులు మాత్రమే అతనికి వారసులైతే, అప్పుడు తల్లికి మూడో భాగం ఇవ్వాలి. మృతుడికి సోదరీసోదరులు కూడా ఉంటే, అప్పుడు తల్లికి ఆరోభాగం లభిస్తుంది. మృతుడు రాసిన వీలునామా అమలు జరిపి అతనిపై ఉన్న అప్పులు తీర్చిన తరువాతనే ఈ భాగాల పంపకం జరగాలి**". ఇక 12వ వాక్యంలో ఇలా ఉంది: . **మీ భార్యలకు సంతానం లేనిపక్షంలో, వారు విడిచిపోయిన ఆస్తిలో మీకు అర్ధభాగం లభిస్తుంది. కాని వారికి సంతానం**

ఉంటే అప్పుడు వారు విడిచివెళ్ళిన ఆస్తిలో మీకు నాలుగోభాగం లభిస్తుంది. ఇది వారు వ్రాసిపోయిన వీలునామా అమలు జరిపిన తరువాత, వారు చేసిపోయిన అప్పులు తీర్చిన తరువాత జరగాలి. మీకు సంతానం లేనిపక్షంలో మీరు విడిచిపోయే ఆస్తిలోని నాలుగో భాగానికి వారు (మీ భార్యలు) హక్కుదారులౌతారు. కాని మీరు సంతానవంతులైతే అప్పుడు వారికి ఎనిమిదో భాగం లభిస్తుంది. ఇది మీరు వ్రాసిన వీలునామాను అమలుజరిపిన తరువాత, మీరు చేసిన అప్పులు తీర్చిన తరువాత జరగాలి.
ఇది కొంచెం తికమక పెట్టేలా ఉంది కావున మీరు తారుమారు కావొద్దు. సంక్షిప్తంగా 11వ వాక్యంలో మొదట సంతాన భాగం తర్వాత తల్లిదండ్రుల భాగాల గూర్చి తెలియజేయబడింది మరియు 12వ వాక్యంలో భార్యా భర్తల భాగాల గూర్చి తెలియజేయబడింది.

ఇస్లాం వారసత్వ పంపిణీ గురించి చాలా వివరంగా తెలియజేస్తుంది. ఖుర్ఆన్ కేవలం ముఖ్యమైన అంశాలనే తెలియజేసింది.ఇంకా మరిన్ని వివరాల కోసం హదీసు సహాయం తీసుకోవలసిన అవసరం ఉంది.ఒక వ్యక్తి తన పూర్తి జీవిత కాలాన్ని వారసత్వ పంపిణీ పై పరిశోధన చేస్తూ గడపవచ్చును.కానీ అరుణ్ శౌరీ కేవలం రెండు వాక్యాల ద్వారానే దీనిని అర్ధం చేసుకోవాలనుకుంటున్నాడు. ఇది ఎలా ఉందంటే! అంకగణితంలో ముఖ్య సూత్రమైన **BODMAS** తెలియని వ్యక్తి, ఒక అంకగణిత సమీకరణంను సాధించాలనుకోవడంలా ఉంది. **BODMAS** సూత్రం ప్రకారం ఒక సమీకరణంలో ఏ సంజ్ఞ ఎక్కడ వచ్చిననూ మొదటగా బ్రాకెట్లను తొలగించాలి (BO), తర్వాత భాగహారం చేయాలి (D-Division), తర్వాత గుణకారం(M-

multiplication), తర్వాత కూడిక(A-Addition) చివరిగా తీసివేత(S-subtraction) చేయాలి. ఒకవేళ **BODMAS** సూత్రం తెలియక మొదట తీసివేత, తర్వాత కూడిక, తర్వాత గుణకారం, తర్వాత భాగహారం చేసి బ్రాకెట్లను తొలగిస్తే ఖచ్చితంగా మనకు తప్పుడు సమాధానం లభిస్తుంది.ఇదే విధంగా, స్వయంగా అరుణ్ శౌరీకే గణితం తెలియదు ఎందుకనగా ఇస్లామీయ ధర్మశాస్త్రం ప్రకారం వారసత్వ పంపిణీలో మొదటి భాగం తల్లిదండ్రులు మరియు భార్య లేక భర్తకు లభిస్తుంది.మిగిలినది సంతానంకు పంచబడుతుంది. ఈ నియమంను పాటిస్తే వారసత్వ భాగాల మొత్తం 1 కంటే ఎక్కువ రాదు. మీ ప్రశ్నకు జవాబు లభించిందని ఆశిస్తున్నాను.

3. నా పేరు ఫౌజియా సయ్యద్. నేను BMC లో ఇన్స్పెక్టర్గా పని చేయుచున్నాను.నేను మొదట క్రిష్టియన్ ని తర్వాత 1980 లో ఇస్లాం స్వీకరించాను. మహాప్రవక్త ముహమ్మద్(స) గారు ఖుర్ఆన్ ను బైబిల్ నుండి కాపీ చేయలేదని, ప్రస్తుతం క్రైస్తవులుగా ఉన్న నా తల్లిదండ్రులకు నేను ఎలా నచ్చజెప్పాలి?

జవాబు:- సోదరి చెప్పిందేమనగా! కొంత కాలం క్రితం క్రైస్తవురాలిగా ఉన్న ఆమె ఇప్పుడు ఇస్లాం స్వీకరించింది.నేను ఆమెను ఒకసారి కాదు, మూడుసార్లు అభినందించాలనుకుంటున్నాను.ఒక నాస్తికుణ్ణి, నేను ఒకసారి అభినందిస్తాను, కానీ ఈమెను మూడుసార్లు అభినందిస్తాను. ఎందుకనగా! ఈమె 'లా ఇలాహ' అని చెప్పిన తర్వాత 'ఇల్లల్లాహ్' మరియు 'ముహమ్మదుర్రసూలుల్లాహ్' అని అంగీకరించింది.

అంటే ఆరాధనకు అర్హుడెవ్వడూ లేడు ఒక్క అల్లాహ్ తప్ప మరియు ముహమ్మద్(స), అల్లాహ్ యొక్క సందేశహరుడు.

సోదరి అడిగిన ప్రశ్నేమనగా! మహాప్రవక్త(స) గారు దివ్య ఖుర్ఆన్ ను బైబిల్ నుండి కాపీ లేక గ్రంథ చౌర్యము చేయలేదని, ఆమె, తన బంధువులను ఒప్పించుట ఎలా అని? నేను మీకు చెప్పినట్లు, మహాప్రవక్త ముహమ్మద్(స) గారు నిరక్షరాసి అనే ఒక్క చారిత్రక సత్యం చాలు దీనిని అసత్యం అని నిరూపించడానికి. దివ్య ఖుర్ఆన్ ఇలా అంటోంది **"వారు(ముస్లింలు) చదువనూ, వ్రాయనూరాని ప్రవక్త(స)ను అనుసరిస్తారు". (అల్ ఆరాఫ్ 7:157).** ఇదే విషయం బైబిలులో యెషయా గ్రంథంలో 29వ అధ్యాయంలోని 12వ వాక్యంలో ఇలా తెలుపబడింది "**ఒక నిరక్షరాస్యుడైన ప్రవక్తకు గ్రంథం ఇవ్వబడుతుంది".** మహాప్రవక్త ముహమ్మద్(స) గారు దివ్య ఖుర్ఆన్ ను బైబిలు నుండి కాపీ చేశారు (దైవం క్షమించుగాక) అని ఏ తూర్పు దేశస్తులు అయితే ఆరోపిస్తున్నారో వారు ఒక విషయంను గుర్తించడంలో విఫలమైనారు. అదేమనగా! ప్రవక్త గారి కాలంలో అరబీ భాషలో బైబిలు అనువాదం లేదు. బైబిలు యొక్క పాత నిబంధనా గ్రంథంను మొట్ట మొదటిసారిగా అరబీ భాషలోకి R.sadias Gaon అనే ఆయన క్రీ.శ.900సం!!లో అనువదించారు. అంటే ప్రవక్త గారి మరణానంతరం 200సం!!లకు. బైబిలు యొక్క కొత్త నిబంధనా గ్రంథం యొక్క అనువాదం అరబీలో క్రీ.శ.1616సం!!లో Erpenius వారిచే ముద్రించబడింది. అనగా ప్రవక్త(స) గారి మరణానంతరం 1000సం!!లకు అన్నమాట.

బైబిలు మరియు ఖుర్ఆన్ లలో పోలిక గల విషయాలు కొన్ని ఉన్నాయని నేను కూడా అంగీకరిస్తాను.కానీ దానర్థం

తరువాతి గ్రంథం, మొదటి గ్రంథంనుండి కాపీ చేయబడిందని కాదు. దానర్థం ఆ రెండింటికీ మూలం ఒక్కటే అయి ఉండి ఉండవచ్చు. అల్లాహ్ అవతరింపజేసిన గ్రంథాలన్నింటిలో దైవ ఏకత్వం గూర్చి ఒకేవిధమైన సందేశం ఉంది. నేను మీకు తెలియజేసినట్లుగా, గతంలో అవతరించిన గ్రంథాలన్నీ పరిమిత కాలానికి చెందినవి మరియు ప్రస్తుతం అవి తమ నిజ రూపంలో లేవు. ఎందుకనగా వాటిని మార్చి వేయడం జరిగింది.వాటిలో మానవుడు చేసిన ఎన్నో కల్పితాలు కలవు.అయినప్పటికీ కొన్ని విషయాలు సదృశ్యంగా ఉన్నాయి. ఈ కొన్ని విషయాలలో పోలిక ఉన్నందుకే ప్రవక్త ముహమ్మద్(స) గారు బైబిలు నుండి కాపీ చేశారనడం సహేతుకం అనిపించుకోదు. అలాకానిచో ఈసా(అస) గారు కొత్త నిబంధనను,పాత నిబంధన నుండి కాపీ చేశారని (దైవం క్షమించుగాక) కూడా అర్థం వస్తుంది. వాస్తవం ఏమిటంటే గ్రంథాలన్నింటికీ మూలం ఒక్కటే.

ఉదాహరణకు,పరీక్షలో ఎవరైనా కాపీ చేస్తే, అతను తన జవాబు పత్రంలో తన ప్రక్కవాడి నుండి తాను కాపీ చేశానని వ్రాయడు. అల్లాహ్ మరియు ముహమ్మద్(స) గారు తెలిపేదేమిటంటే 'ఈసా,మూసా(అస)మరియు ఇతర ప్రవక్తలందరూ దైవంచే పంపబడిన ప్రవక్తలు'. ఈ విధంగా వారిని గౌరవించారు.ఒకవేళ ఆయన కాపీ చేసినట్లయితే, ఈసా మరియు మూసా(అస)లు దైవ ప్రవక్తలే అని చెప్పి ఉండకపోయేవారు. దీని ద్వారా తెలిసేదేమిటంటే ఆయన(స) గారు గ్రంథచౌర్యం చేయలేదు. కేవలం చారిత్రక సత్యాల ద్వారానే బైబిలు మరియు ఖుర్ఆన్ లలో ఏది సరైనదో నిర్ణయించడం సాధారణ వ్యక్తికి కష్టమైన పని.

కావున ఈ రెండింటిని మనకున్న విజ్ఞాన శాస్త్ర జ్ఞాన పరిధిలో పరీక్షిద్దాం. వీటిపై ఒక సారి దృష్టి సారిస్తే ఖుర్ఆన్ మరియు బైబిలులలో తెలుపబడిని చాలా గాధలు మరియు విషయాలు ఒకేతీరుగా ఉన్నట్లు మీరు గమనిస్తారు. కానీ,మీరు వాటిని విశ్లేసిస్తే, సుద్దకు, జున్నుకు మధ్య ఉన్నంత తేడాను గమనించగలరు. ఉదాహరణకు; **"బైబిలులోని ఆదికాండంలో అధ్యాయం నెం-1 ప్రకారం ఈ భూమీ, ఆకాశాలు 6 రోజులలో సృష్టించబడ్డాయి".** ఇక్కడ రోజు అంటే 24 గంటల కాలం. ఖుర్ఆన్ కూడా భూమీ ఆకాశాల సృష్టి గూర్చి 7:54 ; 10:3 లలో ఇలా తెలుపుతుంది "**భూమ్యాకాశాలు 6 అయ్యాంలలో సృష్టించబడ్డాయి"** ఇక్కడ అరబీ పదమైన అయ్యామ్,యౌమ్ కు బహువచనం. యౌమ్ అంటే రోజు లేక యుగం.కావున ఖుర్ఆన్ ప్రకారం భూమ్యాకాశాలు 6 యుగాలలో సృష్టించబడ్డాయి. ఈ వర్ణన పట్ల శాస్త్రవేత్తలకు ఎటువంటి ఆక్షేపణ లేదు. కానీ, ఈ ప్రపంచం 24 గంటలు గల ఆరు రోజులలో సృష్టించబడింది అనడం అశాస్త్రీయం.

బైబిల్ లోని ఆదికాండంలోని అధ్యాయం నెం 1 లోని 3,5 వాక్యాల ప్రకారం మొదటి రోజు రాత్రి, పగలు సృష్టించబడినాయి మరియు అదే అధ్యాయంలోని 14 నుండి 19 వాక్యాల ప్రకారం నాల్గవ రోజున సూర్యుడు సృష్టించబడ్డాడు. కాని నేటి సైన్సు ప్రకారం, విశ్వంలో నక్షత్రాల నుండే కాంతి లభిస్తుంది కావున రాత్రి ,పగలు **అనేవి సూర్యుని కంటే 3 రోజుల ముందే సృష్టించబడినాయి**

అనేది సైన్సుకు విరుద్ధమైనది మరియు అతర్కం. ఖుర్ఆన్ కూడా సూర్యుడు మరియు వెలుగు సృష్టి గూర్చి తెలియజేస్తుంది. కాని అటువంటి అశాస్త్రీయమైన వరుస క్రమంను ఇవ్వదు. మహాప్రవక్త ముహమ్మదు [స]గారు ఈ విషయాలను బైబిల్ నుండి కాపీ చేసి వరుస క్రమంలోని తప్పులను సరి చేశారని మీరనుకుంటున్నారా? అలా అయితే ,1400సం!!ల క్రితం ఈ విషయాలు ఎవరికీ తెలియవనే విషయం గమనించాలి.

బైబిల్ లోని ఆదికాండంలోని అధ్యాయం 1లోని 9 నుండి 13 వాక్యాల ప్రకారం భూమి 3 వ రోజు సృష్టించబడింది మరియు 14 నుండి 19 వాక్యాల ప్రకారం సూర్యచంద్రులు నాల్గవ రోజున సృష్టించబడ్డాయి. కాని నేటి సైన్సు చెప్పేదేమిటంటే భూమి మరియు చంద్రుడు రెండూ మూల నక్షత్రమైన సూర్యునిలోని భాగాలే. కావున సూర్యుని కంటే ముందుగా భూమి సృష్టించబడడం అసాధ్యం మరియు అశాస్త్రీయం. అదే అధ్యాయంలోని 11 నుండి 13 వాక్యాల ప్రకారం కూరగాయల చెట్లు,ఫలాలిచ్చే వృక్షాలు,విత్తనాలు మొదలగునవి చెట్లు 3వ రోజు సృష్టించబడినాయి మరియు 14 నుండి 19 వాక్యాల ప్రకారం **"సూర్యుడు 4వ రోజున సృష్టించబడ్డాడు. కాని సూర్యుడు అంటే వేడి లేకుండానే చెట్లు మరియు మెక్కలు ఎలా ఉనికిలోకి వచ్చాయి" ?**

బైబిలు లోని ఆదికాండం అధ్యాయం నెం 1 లోని 16వ వాక్యానుసారం సూర్యుడు మరియు చంద్రుడు రెండూ స్వయం ప్రకాశకాలు. కాని దివ్య ఖుర్ఆన్ లోని 25 వ అధ్యాయమైన అల్ ఫుర్ఖాన్ లోని 61 వ వాక్యానుసారం చంద్రుడు స్వయం ప్రకాశం కాదు. ప్రవక్త ముహమ్మద్(స) గారు కాపీ చేసినట్లయితే, ఈ

శాస్త్రీయ సత్యాలన్నింటినీ ఆయన ఎలా సరిచేయగలిగారు? ఇది అసాధ్యం.

ఒకవేళ మీరు చాలా నిశితంగా విశ్లేషిస్తే, ఖుర్ఆన్ మరియు బైబిల్లలో తెలుపబడిన గాధల మధ్య తేడా, సుద్ధ మరియు జున్నుకు మధ్య ఉన్నంత తేడాను గమనించగలరు. భూమిపై మొట్ట మొదటిసారిగా సృష్టించబడిన మానవుడు ఆదమ్(అ.స.) అని బైబిలు తెలియజేస్తుంది మరియు సుమారు 5800 సం!!ల పూర్వం అని తెలియజేస్తుంది.కాని నేటి సైన్సు ఆర్కియాలాజికల్ మరియు ఆన్థ్రోపాలాజికల్ ఆధారాల ప్రకారం తెలియజేసేదేమిటంటే భూమిపై మానవుడు కొన్ని వందల వేల సం!!ల నుండి మనుగడ సాగిస్తున్నాడు అని. ఖుర్ఆన్ కూడా మొదటి మానవుడు ఆదమ్(అ.స.) అనే తెలియజేస్తుంది. కాని అలాంటి అశాస్త్రీయ తారీఖులను ఇవ్వదు.

బైబిలులో ఆదికాండంలోని 6,7,8 అధ్యాయాలలో నూహ్(అ.స.) గారి గాధ తెలియజేస్తూ ఆ ప్రవక్త గారి కాలంలో ఈ ప్రపంచమంతా నీటి ప్రవాహంలో మునిగి పోయింది తద్వారా ఈ భూమండలంపై ఉన్న ప్రాణులన్నీ మరణించాయి. కేవలం నూహ్(అ.స.) గారి పడవలో ఉన్న ప్రాణులే మిగిలినాయి అని బైబిల్ తెలియజేస్తుంది. కాని నేటి సైన్సు ప్రకారం అలాంటి ఉపద్రవమేదీ ఇంతవరకు రాలేదు. అలాగే ఖుర్ఆన్ కూడా నూహ్(అ.స) ప్రవక్త గారి కాలంలో వచ్చిన నీటి ఉపద్రవం గూర్చి తెలియజేస్తుంది, కాని అది ఒక ప్రాంతం వరకే వచ్చినట్లు తెలియజేస్తుంది. ఈ వివరణ పట్ల శాస్త్రవేత్తలకు ఎటువంటి ఆక్షేపణ లేదు. చివరగా ఇక మీరే నిర్ణయించండి, ఖుర్ఆన్,బైబిలు నుండి కాపీ చేయబడిందా లేక దైవ గ్రంథమా అని.

4. దేవుడు ఈ భూమండలం పైకి ఎందరో ప్రవక్తలను మరియు ఎన్నో గ్రంథాలను పంపాడని ఖుర్ఆన్ తెలియజేస్తుంది. కావున వేదాలు దైవ గ్రంథాలని మరియు రాముడు, కృష్ణుడు దైవ ప్రవక్తలని మీరు విశ్వసిస్తారా?

జవాబు:- సోదరుడు ప్రశ్నించడానికి ముందుగా,హిందువులందరూ భగవాన్ రజనీష్ ను దేవుడిగా విశ్వంసించరు అని గమనించండి అన్నాడు. సోదరా! నా ఈ ప్రసంగం వీడియో రికార్డ్ చేయబడుచుంది. మీరొక క్యాసెట్ తీసుకోవచ్చు. కొందరు ప్రజలు భగవాన్ రజనీష్ ను దేవుడిగా భావిస్తారు అని మాత్రమే నేను చెప్పాను. కావున మీకూ నాకూ మధ్య ఒక అపార్ధం ఉంది. హిందువులందరూ ఆయనని విశ్వసిస్తారని నేను ఏనాడూ చెప్పలేదు. హిందూ సోదరులు ఏమి విశ్వసిస్తారో నాకు తెలుసు. నేను వారి గ్రంథాలు కూడా అధ్యయనం చేశాను. సోదరా! మీరడిగిన ప్రశ్న చాలా మంచి ప్రశ్న. మీరన్నట్లు గతంలో వచ్చిన గ్రంథాలు మరియు ప్రవక్తల గూర్చి ఖుర్ఆన్ లో చాలా చోట్ల తెలియజేయబడింది. సూరహ్ ఫాతిర్ అధ్యాయం నెం 35 లోని 24 వ వాక్యం ప్రకారం **“హెచ్చరిక చేసే వాడెవ్వడూ రాని జాతి ఏదీ లేదు”.** మరియు సూరహ్ రాద్ అధ్యాయం నెం 13 లోని 7 వ వాక్యం ప్రకారం “**ప్రతి జాతి కొరకూ ఒక మార్గదర్శకుడు పంపబడ్డాడు**”.

ఖుర్ఆన్ లో కేవలం 25మంది ప్రవక్తల పేర్లే తెలుపబడినాయి.ఉదా!ఆదం,ఇబ్రాహిం,మూసా,ఇస్మాయిల్ ,జీసస్ మరియు ముహమ్మద్ [వా.అం శా .క]. కాని హదీసు ప్రకారం ఈ భూమాండలం పై 1,24,000 కంటే ఎక్కువ మంది ప్రవక్తలు

పంపబడినారు. వారిలో కేవలం 25 మంది ప్రవక్తల పేర్లే మనకు తెలుసు. కావున మీరడిగిన వారు బహుశా ప్రవక్తలు కావచ్చు లేక కాకపోవచ్చు.మేము ఈ రెండింటిలో ఈ ఏ విషయమూ ఖచ్చితంగా చెప్పలేము.

ఇక వేదాలు దైవ గ్రంథాలేనా అనే విషయానికి వస్తే, మొదటగా మనం, ఖుర్ఆన్ మరియు వేదాలలో ఏమైనా సమవిషయాలు ఉన్నాయా అని గమనిద్దాం. ఖుర్ఆన్ మరియు వేదాలు దేవుని ఏకత్వం గూర్చి తెలియజేస్తున్నాయి. వేదాలను పరిశీలించినట్లయితే యజుర్వేదంలోని అధ్యాయం నెం 3 లోని 32వ వాక్యం(మంత్రం) ప్రకారం "**దేవుడికి ప్రతిరూపం లేదు**". అదే యజుర్వేదం లోని అధ్యాయం నెం 32 లోని 3వ వాక్యం "**ఆయన(దేవుడు) జన్మించినవాడు కాదు**" అని అంటోంది. యజుర్వేదంలోని అధ్యాయం నెం 40 లోని 8వ వాక్యం ప్రకారం "**దేవునికి ప్రతిరూపం లేదు మరియు ఆయన శరీర రహితుడు**". అలాగే యజుర్వేదం 40వ అధ్యాయం లోని 9 వ వాక్యం " **ఎవరైతే ప్రాకృతిక వస్తువులను(గాలి,నీరు,అగ్ని మొ!!) పూజిస్తారో వారు చీకటిలో(నరకంలో) ప్రవేశిస్తారు, ఎవరైతే సంభూతి(మానవునిచే తయారయ్యే వస్తువులు,బొమ్మలు)ని పూజిస్తారో వారు మరింత అంధకారంలో ప్రవేశిస్తారు**" అని తెలియజేస్తుంది. మరియు ఋగ్వేదంలోని 8వ గ్రంథంలోని అధ్యాయం నెం 1లోని 1 వ వాక్యం "**స్తోత్రాలన్నీ కేవలం ఆయన ఒక్కడికే**" అని అంటోంది. అదే ఋగ్వేదం, 6వ గ్రంధం లోని 45వ అధ్యాయంలోని 16 వ వాక్యం "**దేవుడొక్కడే మీరు ఆయననే ఆరాధించండి**" అని తెలియజేస్తుంది.

వేదాలలో తెలుపబడిన ఇటువంటి వాక్యాలను విశ్వసించటానికి మాకెటువంటి అభ్యంతరమూ లేదు. ఇవి కూడా దేవుని వాక్యాలే అయి ఉండవచ్చు. మరియు ఖుర్ఆన్, సత్యాసత్యాలను వేరు చేసే గీటురాయి. ఎందుకనగా ఇది దైవం అవతరింపజేసిన చివరి గ్రంథం.

ఏ విధంగానైతే బైబిలులో అశాస్త్రీయ విషయాలున్నాయో అలాగే వేదాలలో కూడా నాకు తెలిసిన చాలా అశాస్త్రీయ మరియు మానవ రచిత విషయాలు కలవు. వీటిని మేము దైవ వాక్యాలుగా అంగీకరించలేము. వాటిని నేను ఇక్కడ చర్చించదలచుకోలేదు. కావున కల్పితాలకు పూర్వం ఉన్న వేదాలు దేవుని వాక్యాలే అయి ఉండవచ్చు అని అంగీకరించటంలో మాకెలాంటి అభ్యంతరమూ లేదు. ఇంజీలునే తీసుకోండి! ఖుర్ఆన్ ప్రకారం ఈసా(అ .స.) గార్కి పంపబడిన వహీనే ఇంజీల్ అంటారు.కావున ఇంజీలు దైవ గ్రంథమే అని ఖచ్చితంగా చెప్పగలం. ఇక ప్రవక్తల విషయానికి వస్తే , ఖుర్ఆన్ ప్రకారం చాలా మంది ప్రవక్తలు వచ్చారు. మరి ఈ రాముడు , శ్రీ కృష్ణుడు ఎవరు? దైవ ప్రవక్తలా? బహుశా! వీరు కూడా దైవ ప్రవక్తలే అయి ఉండవచ్చు అని మాత్రమే మేము చెప్పగలం. ఈ విషయంను మేము ఖచ్చితంగా కూడా చెప్పలేము. ఒక విషయం దయచేసి గమనించండి అదేమనగా! ఒకవేళ రాముడు, శ్రీ కృష్ణుడులు కూడా దైవ ప్రవక్తలైననూ మరియు వేదాలు దైవ గ్రంథాలే అయినప్పటికీ, అవి ఒక పరిమిత కాలం కొరకు ఉద్దేశించబడినవి. అవి కేవలం ఆ నాటి ప్రజల కోసమే అవతరించబడినాయి కాని చిర కాల ప్రజల కోసం కాదు. దైవం చిట్టచివరిగా అవతరింపజేసిన గ్రంథం దివ్య ఖుర్ఆన్ మరియు

అంతిమ దైవ ప్రవక్త ముహమ్మద్(స). కావున మనం ఖుర్ఆన్ మరియు ప్రవక్త గారినే అనుసరించాలి. మీ ప్రశ్నకు జవాబు లభించిందని ఆశిస్తున్నాను.

5. నా పేరు మెహనాజ్ సయ్యద్ మరియు నేను ఒక విద్యార్థిని. నా ప్రశ్న ఏమనగా అల్లాహ్ ను ఎవరు సృష్టించారు?

జవాబు: సోదరి అడిగిన ప్రశ్న "**అల్లాహ్ ను ఎవరు సృష్టించారు?**"

సర్వసాధారణంగా ఇటువంటి ప్రశ్నలను నాస్తికులు మరియు తార్కికవాదులు అడుగుతారు.ఈ ప్రశ్న నాకోక సందర్భాన్ని గుర్తు చేస్తుంది. అదేమనగా! నా యొక్క ఒక చాలా దగ్గరి మిత్రుడు బాంబే లోని తార్కికవాదులు మరియు నాస్తికవాదులతో దేవుని అస్థిత్వం గూర్చి చర్చించిన సందర్భం. ఆ చర్చలో అతను ఇలా చెప్పనారంభిచాడు,ఇది ఒక గుడ్డ. దీనిని ఎవరు తయారు చేశారు?ఇది ఎక్కడ నుండి వచ్చింది? వారు: నేతవాడు తయారు చేశాడని అన్నారు. సరే మంచిది .అంటే దీనికి ఒక సృష్టికర్త ఉన్నాడు.ఇది ఒక పుస్తకం. ఇది ఎలా తయారయింది?పెన్ను ఎక్కడి నుండి వచ్చింది? ఈ విధంగా అతను వారితో ప్రతి వస్తువుకూ ఒక సృష్టికర్త ఉన్నాడని నిరూపించే ప్రయత్నం చేశాడు. కారు కర్మాగారం లో తయారుచేయబడుతుంది. మరి,కర్మాగారంను ఎవరు సృష్టించారు? బహుశా! ఇంజనీర్ అయివుండవచ్చు. మరి;ఇంజనీర్ ను ఎవరు సృష్టించారు? ఈ విధంగా అతను ప్రతి వస్తువుకు ఒక సృష్టికర్త ఉన్నాడని నిరూపించే ప్రయత్నం చేశాడు.సూర్యుణ్ణి,చంద్రుడిని ఎవరు సృష్టించారు? ఇలా ఉదాహరణలు ఇస్తూ ప్రతి వస్తువుకూ ఒక

సృష్టికర్త ఉన్నాడనే విషయాన్ని మీరు అంగీకరిస్తారా? అని అడిగాడు. ఆ తార్కికవాదులు కొంచెం సేపు ఆలోచించి ఇలా అన్నారు: ప్రతి వస్తువుకూ ఒక సృష్టికర్త ఉన్నాడనే విషయాన్ని మేము అంగీకరిస్తాము కాని ఒక షరతు అదేమనగా నీవు నీ మాటను మార్చవద్దు. అనగా మాటపై నిలబడాలి.

నాస్తికులు మరియు తార్కిక వాదులతో దేవుని అస్థిత్వంను ఒప్పించడంలో విజయం సాధించాడని తలచి నా మిత్రుడు సంతోషపడ్డాడు. ప్రతి వస్తువుకూ సృష్టికర్త ఉన్నాడు కావున మొట్ట మొదటి సృష్టికర్తకు మీరు పేరు సూచించాలి అని వారితో అన్నాడు. జవాబులో వారికి సహకరిస్తూ, ప్రతి వస్తువును సృష్టించిన ఆ మొట్ట మొదటి సృష్టికర్తనే దేవుడు అంటారు అని వారికి తెలియజేశాడు. దానికి ఆ నాస్తికులు ఇలా అన్నారు- మేము దేవుని అస్థిత్వంను ఒప్పుకుంటాము కాని మాదొక షరతు అదేమనగా ప్రతి వస్తువుకూ సృష్టికర్త ఉంటే మరి,దేవుడిని ఎవరు సృష్టించారో తెలియజేయండి? ఆ ప్రశ్నతో నా మిత్రునికి జీవితంలో కోలుకోలేనంత దెబ్బ తగిలినట్లయింది.అతను జవాబివ్వలేక పోయాడు. అతని మాట మూగబోయింది. అతనికి రాత్రంతా నిద్ర పట్టలేదు.

మరుసటి రోజు,నా మిత్రుడు నా వద్దకు వచ్చి జరిగిన సంఘటనంతా వివరించాడు.దాని నుండి నేనొక విషయం గమనించాను అదేమనగా దేవుని అస్థిత్వంను నిరూపించుటకు మిత్రుడు ఉపయోగించిన పద్ధతి, మన సమాజంలో మేధావులు ఉపయోగించే పద్ధతే అని. ఈ మేధావులు స్వీయ విశ్లేషణ అనే తర్కంను మరిచారు. ఒకవేళ మీరు నా ప్రసంగాలను గమనించినట్లయితే, నా ఏ ప్రసంగంలోనూ ప్రతి దానికీ సృష్టికర్త ఉన్నాడని నేను ఎన్నడూ చెప్పలేదు. ఒకవేళ నేను అలా చెప్పి

ఉన్నట్లయితే, నేను కూడా ఇరుక్కు పోయి ఉండేవాణ్ణి. వాస్తవానికి నాస్తికులను తార్కికంగా ప్రశ్నించిన మొదటి వ్యక్తిని నేనే. మరియు వారు జవాబుగా – ఒక వస్తువు యొక్క మెకానిజంను మొట్ట మొదటసారిగా చెప్పగలిగినవాడు దాని నిర్మాత లేక సృష్టికర్త అని అన్నారు. ఈ మాట నేననలేదు, వారన్నారు. ఒకవేళ ఎవరైనా నన్ను అదే ప్రశ్న అడిగినట్లయితే- సోదరా! జాకీర్, ఒక కొత్త వస్తువు యొక్క పనిచేయు విధానమును ఎవరు చెప్పగలరు? అప్పుడు నేనిలా జవాబిస్తాను-సృష్టించబడిన లేక ప్రారంభం ఉన్న ప్రతీ వస్తువు యొక్క మెకానిజం(పనిచేయువిధానం) మొట్ట మొదటిసారిగా చెప్పగలిగే వ్యక్తి దాని సృష్టికర్త అగును. నేను నా లాజిక్ ను ఉపయోగిస్తున్నాను. నేను మరొకసారి పట్టుబడదలచుకోలేదు. ఈ విధంగా చర్చను కొనసాగిస్తూ దివ్య ఖుర్ఆన్ దేవుని వాక్యమని నిరూపించవచ్చు.

చివరగా జవాబేమనగా, సైన్సు ప్రకారం సూర్యుడు, చంద్రుడు మరియు మన విశ్వానికి ప్రారంభం ఉంది. మరి వీటి మెకానిజం మొదటగా ఎవరికి తెలుసు? ఆయనే సృష్టికర్త- మహాశక్తివంతుడైన దైవం.

నీవు నన్ను అడిగిన ప్రశ్న: అల్లాహ్ ను ఎవరు సృష్టించారు? ఈ ప్రశ్న, నా మరొక మిత్రుడు నన్నడిగిన ప్రశ్న లాగానే ఉంది. అతను ఇలా అన్నాడు: “నా సోదరుడు ఉదయ్ ను ఆసుపత్రిలో చేర్చారు. అతను ప్రసవించి ఒక బిడ్డకు జన్మనిచ్చాడు, ఆ బిడ్డ మగనా లేక ఆడనా”? మీరు చెప్పగలరా? ఒక డాక్టరుగా నాకు తెలిసిందేమనగా ఒక పురుషుడు ప్రసవించి బిడ్డకు జన్మ ఇవ్వలేడు. ప్రసవించి బిడ్డకు జన్మ ఇవ్వడమనేది పురుష లక్షణం కాదు. ఇదొక అర్థం లేని ప్రశ్న. ఇదేవిధంగా,

‘అల్లాహ్’ యొక్క నిర్వచనం ప్రకారం, అతనికి పుట్టుక లేదు, ప్రారంభం లేదు. కావున అల్లాహ్ ను ఎవరు సృష్టించారు అని నీవు నన్ను అడిగిన ప్రశ్న ఒక అర్థం లేని ప్రశ్న. సోదరీ నీ ప్రశ్నకు జవాబు లభించిందని ఆశిస్తున్నాను.

6. నా పేరు Md. అష్రఫ్.నేను ఒక విద్యార్థిని. నా ప్రశ్నేమనగా, ‘అరబ్బులను నైతికంగా సంస్కరించుటకు మహాప్రవక్త(స) గారే స్వయంగా ఖుర్ఆన్ రచించి, అది వారిచే ఎక్కువగా ఆదరించబడుటకుగాను దానిని అల్లాహ్ కు ఆపాదిస్తున్నారని చాలా మంది తూర్పు దేశస్థులు ఆరోపిస్తున్నారు’?

జవాబు:- సోదరుడు అడిగిన ప్రశ్న: అరబ్బులను సంస్కరించటానికి దివ్య ఖుర్ఆన్ దైవగ్రంథం అని మహాప్రవక్త (స) గారు అబద్ధం చెప్పారని (అల్లాహ్ క్షమించుగాక) కొంతమంది తూర్పు దేశస్థులు ఆరోపిస్తున్నారు. నేను కూడా ఒక విషయంను అంగీకరిస్తాను అదేమనగా ఖుర్ఆన్ యొక్క సందేశం మరియు ప్రవక్త(స) గారి బోధనలు కేవలం అరబ్బులను మాత్రమే సంస్కరించుటకు కాదు, సర్వమానవాళి సంస్కరణ వారి ఉద్దేశం. వారి ఈ ఆరోపణను విశ్లేషిద్దాం.

ఒకవేళ ప్రవక్త(స) గారి లక్ష్యం కేవలం అరబ్బులను సంస్కరించుటయే అయినట్లయితే, ఒక నైతిక సమాజంను నిర్మించుటకు ఒక వ్యక్తి అనైతిక పద్ధతిని ఎందుకు ఉపయోగిస్తాడు? ఉదాహరణకు, మీరు ఒక నైతిక సమాజంను నిర్మించదలచి, స్వయంగా ఒక అసత్యంతో ఆ పనిని మొదలెడితే ఎలా ఉంటుందో ఊహించండి? ఈ విధంగా కేవలం అసత్యవాదులు మరియు డబ్బు కోసం చేసేవారు మాత్రమే

చేయగలరు. సమాజ సంస్కరణ వారి లక్ష్యం అని వారంటారు కాని అంతర్గతంగా వారికి కావలసింది డబ్బు. మహాప్రవక్త(స) గారు డబ్బు కొరకే ఈ పని చేశారనే అసత్యవాదనను అసత్యం అని ఇదివరకే నిరూపించినాను. కావున తుది ఫలితం ప్రవక్త(స) గారు చెప్పేది సత్యం. దివ్య ఖుర్ఆన్ లో సూరహ్ అల్ అన్ ఆమ్ అధ్యాయం నెం 6, ఆయత్ నెం 93 లో ఇలా ఉంది "**అబద్ధపు అపనిందను సృష్టించి అల్లాహ్ పై మోపే వాడికంటే, తనపై ఏ వహీ అవతరించకపోయినప్పటికీ ''నాపై వహీ అవతరించింది'' అని చెప్పేవాడి కంటే లేదా అల్లాహ్ అవతరింపచేసినటువంటి విషయాలనే ''నేను కూడా అవతరింపచేసి చూపిస్తాను'' అని పలికేవాడికంటే మించిన దుర్మార్గుడు ఎవడు?"**

ఒకవేళ మహాప్రవక్త(స) గారు నిజంగానే అసత్యం చెప్పినట్లయితే, అసత్యం పలికేవాడు దుర్మార్గుడు అన్న విషయంను తానేనాడూ తన గ్రంథంలో ప్రస్తావించి ఉండకపోయేవాడు. ఆయన గారి జీవితంలో ఏదో ఒక దశలో ఈ విషయం బయటపడేది మరియు ఆయన తనను తానే దుర్మార్గుడిగా పిలుచుకుని ఉండేవాడు.ఇంకా సూరహ్ అల్ హాక్కహ్ అధ్యాయం నెం 69 లోని ఆయత్ నెం 44-47 లో ఇలా తెలియజేయబడింది "**ఒకవేళ ఇతను (దైవప్రవక్త) స్వయంగా కల్పించి ఏదైనా విషయాన్ని మాకు ఆపాదించి ఉంటే, మేము ఇతని కుడి చెయ్యిని పట్టుకునేవారము, ఇతని మెడ నరాన్ని కోసి వేసేవారము. అప్పుడు మీలో ఎవ్వరూ (మమ్మల్ని) ఈ పని చేయకుండా ఆపగలిగే వారు కారు."** గమనించండి కనీసం ప్రవక్త గారికి కూడా మినహాయింపు లేదు. ఒకవేళ ఏ ప్రవక్త అయినా అబద్ధం చెప్పి ఉన్నట్లయితే, ఆయన

మహాప్రవక్త ముహమ్మద్(స) గారైనా సరే, అల్లాహ్ క్షమించుగాక! ఆయన అలా ఎన్నడూ చేయరు, ఒకవేళ ఏ ప్రవక్తైనా అసత్యం పలికితే ఖుర్ఆన్ ఇలా అంటోంది "**మేము అతని మెడనరాన్ని కోసి వేసేవారము".** ఒకవేళ ప్రవక్త ముహమ్మద్(స) గారు అబద్ధం చెప్పి ఉన్నట్లయితే ఆయన గారి జీవితంలో ఏదో ఒక నాడు బహిర్గతమై ఉండేది మరియు ఆయన ఆనాటి ప్రజలను తనకు మరణశిక్ష విధించమని కోరి ఉండేవాడు.

ఇదేరకమైన శిక్ష 42:24; 16:105లలో కూడా తెలియజేయబడింది. ఇవేకాక, ప్రవక్త(స) గారు తనను తాను సవరించుకున్న సంఘటనలు కూడా ఖుర్ఆన్ లో కలవు. దైవం క్షమించుగాక, ఒకవేళ ప్రవక్త(స) గారు నైతిక సంస్కరణ కోసమే ఖుర్ఆన్ ను రచించినట్లయితే, అల్లాహ్ కు అయిష్టమైన, ప్రవక్తగారు ఆచరించిన విషయాలను గ్రంథంలో ప్రస్తావించి ఉండకపోయేవాడు.

ఉదాహరణకు, సూరహ్ అబస అధ్యాయం నెం 80లోని ఈ వాక్యంను పరిశీలించండి "**విసుగుకొని ముఖం తిప్పుకున్నాడు, ఆ అంధుడు తన వద్దకు వచ్చాడని, నీకేమి తెలుసు, బహుశా అతను దారికి రావచ్చు లేదా హితోపదేశం గురించి ఆలోచించవచ్చు, హితోపదేశం అతనికి లాభదాయకం కూడా కావచ్చు".** ఈ సూరహ్ అవతరించిన సందర్భమేమనగా మహాప్రవక్త ముహమ్మద్(స) గారు మక్కా అవిశ్వాసులకు చెందిన పెద్ద పెద్ద సర్దారుల ముందు ఇస్లాం ధర్మ సందేశంను వివరించే పనిలో నిమగ్నులై ఉన్నారు. ఇంతలోనే అబ్దుల్లాహ్ ఇబ్నె ఉమ్మె మఖ్తూమ్ అనే అంధ వ్యక్తి వచ్చి కొన్ని ప్రశ్నలు అడగదలిచి అనుమతి అడిగారు. ఈ సందర్భంలో ఆయన వచ్చి ఇలా జోక్యం చేసుకోవటం మహాప్రవక్త(స) కు

నచ్చలేదు. ఒకవేళ ఆయన ప్రవక్త(స) కాక ఒక సత్పురుషుడో లేక సాధారణ వ్యక్తియో అయినట్లయితే ఏ ఒక్కరూ ఆక్షేపణ తెలుపకపోయేవారు.కాని ఆయన ప్రవక్త అయినందున ఆయన ప్రవర్తన అందరికీ ఆదర్శప్రాయం. ఆయన స్వభావం ఎంత ఉన్నతమయినదంటే ఆయన హృదయం ఎల్లప్పుడూ పేదవారి కొరకు మరియు అవసరార్ధుల కొరకు తపిస్తూ ఉండేది. అటువంటి వ్యక్తి కొరకు దైవం తరపునుండి సందేశం అవతరించింది. ఆ అంధ వ్యక్తిని కలిసిన ప్రతిసారీ ప్రవక్త(స) గారు అతనికి కృతజ్ఞతలు తెలుపుతూ ఇలా అనేవారు ' నీ వల్ల అల్లాహ్, నన్ను గుర్తుంచుకున్నాడు'.

ఇలాంటివే మరికొన్ని సంఘటనలను దివ్య ఖుర్ఆన్ లో 66:1; 16:126; 8:84 లలో చూడవచ్చు. ఒకవేళ ప్రవక్త(స) గారు నైతిక సంస్కరణ కోసమే ఖుర్ఆన్ ను రచించినట్లయితే ఆయన గారు ఈ విషయాలను ఖుర్ఆన్ లో ప్రస్తావించకపోయేవారు. మీ ప్రశ్నకు జవాబు లభించిందని ఆశిస్తున్నాను.

7.అస్సలాము అలైకుమ్ . సోదరా! నేను ఒక మెడికల్ విధ్యార్థిని. మీరు మీ ప్రసంగంలో చాలా సైంటిఫిక్ సత్యాలను గూర్చి చెప్పారు, అయితే ఖుర్ఆన్ లో గణితశాస్త్ర సంబంధ విషయాలేమైనా ఉన్నాయా?

జవాబు:- సోదరి అడిగిన ప్రశ్నేమనగా! నేను నా ప్రసంగంలో చాలా సైంటిఫిక్ విషయాలను తెలియజేశాను. అయితే గణితశాస్త్రం గూర్చి ఖుర్ఆన్ ఏం తెలియజేస్తుంది అని.

అవును గణితశాస్త్రం గూర్చి ఖుర్ఆన్ చాలా విషయాలు తెలియజేస్తుంది. వాటిలో ఒకటి అరిస్టాటిల్ గారి " The

excluded middle" నియమం. ఈ నియమంపైనే పూర్తి గణితశాస్త్రం ఆధారపడి ఉంది. ఈ నియమం ఏమనగా "ప్రతి ప్రవచనం సత్యం లేక అసత్యం అవుతుంది". చాలా కాలం వరకు అందరూ ఈ నియమంనే అనుసరించారు. ఇప్పటికీ వంద సం!!ల పూర్వం ఒక వ్యక్తి ఇలా ప్రశ్నించాడు "ప్రతి ప్రవచనం సత్యం లేక అసత్యం మాత్రమే అయినప్పుడు, ఈ నియమం కూడా ఒక ప్రవచనం కావున ఇది కూడా అసత్యం కావచ్చు". ఒకవేళ ఈ నియమమే అసత్యం అయితే పూర్తి గణితశాస్త్రం క్షీణిస్తుంది. కావున గణిత శాస్త్రవేత్తలందరూ సమావేశమై ఒక కొత్త అనుగుణ్యమైన పద్ధతిని ప్రవేశపెట్టారు. ఈ సిద్ధాంతం ప్రకారం 'పదాలను' వాక్యంలో రెండు రకాలుగా ఉపయోగించవచ్చు. అవి 1. అర్థం పరంగా 2. ప్రస్తావన పరంగా. వాక్యంలో ఒక పదంను ఉపయోగించినపుడు నీవు ఆ వాక్యం భావం గూర్చి మాట్లాతున్నావు కాని ఆ పదం ప్రస్తావన గూర్చి కాదు. కాని ఒకవేళ నీవు వాక్యంలో పదంను ప్రస్తావించినట్లయితే నీవు ఆ పదం గూర్చి చెప్పుతున్నట్లు అర్థం కాని ఆ వాక్య అర్థం గూర్చి కాదు.

ఉదాహరణకు, 'అక్బర్ చిన్నవాడు' అనే వాక్యంను గమనించండి. అర్థం ప్రకారం ఈ వాక్యం సరైనదే. అతనొక చిన్న బాలుడు. అభ్యంతరం లేదు. కాని అరబీ భాష తెలిసిన వ్యక్తి ఆక్షేపణ తెలుపుతాడు. అరబీలో అక్బర్ అంటే గొప్పవాడు అని అర్థం కావున అక్బర్ చిన్నవాడు కాదు. ఇక్కడ అతను "అక్బర్" అనే పదంను ప్రస్తావిస్తున్నాడు కాని ఆ పదంను ఉపయోగించుటలేదు. మరొక ఉదాహరణను గమనించండి. '3' ప్రతిసారీ '4'కు ముందు వచ్చును అనే వాక్యం పట్ల ఎవ్వరికీ ఎటువంటి ఆక్షేపణ లేదు. కాని, నిత్య సందేహకుడు ఇలా అంటాడు '3' అనేది '4' తర్వాత వస్తుంది. ఎలా అనగా ఆంగ్ల

డిక్షనరీలో 'T' అనే అక్షరం 'F' తర్వాత వస్తుంది. " '3' ఎల్లప్పుడూ '4' కు ముందు వస్తుంది" అనే సందర్భంలో నేను అర్ధం గూర్చి చర్చిస్తున్నాను కాని, ప్రస్తావన గూర్చి కాదు. అలాగే నిఘంటువుల రచయిత పదాల ప్రస్తావన గురించి చర్చిస్తున్నాడు కాని, అర్ధం గూర్చి కాదు.

కావున, వాక్యంలో ఒక పదంను రెండు విధాలుగా ఉపయోగించవచ్చు. అవి అర్ధ పరంగా లేదా ప్రస్తావన పరంగా. నా ప్రసంగంలో నేను దివ్య ఖుర్ఆన్ లోని అధ్యాయం నెం 4 సూరహ్ నిసాలోని ఆయతు నెం 82ను పఠించాను దాని అర్ధం **"ఈ ప్రజలు ఖుర్ఆన్ ను గురించి ఆలోచన చెయ్యరా? ఇది అల్లాహ్ తరఫు నుండి కాక వేరొకరి తరఫునుండి వచ్చి ఉన్నట్లయితే ఇందులో ఎన్నో పరస్పర విరుద్ధాలైన విషయాలు ఉండేవి."** అర్ధం ప్రకారం ఈ వాక్యం నిస్సందేహంగా సరియైనది.ఎవ్వరూ ఒక్క విరుద్ధ విషయాన్ని కూడా చూపలేకపోయారు. కావున ఖుర్ఆన్ దైవ గ్రంథంగా నిరూపించబడింది. కాని నిత్య సందేహకుడు తానొక విరుద్ధ విషయంను కనుగొన్నానని అంటాడు. "ఎక్కడ? నేను ప్రశ్నించాను." జవాబుగా అతనిలా అంటాడు " సూరహ్ నిసా అ.నెం.4 లో ఆయత్ నెం 82లో 'విరుద్ధం' అనే పదం కలదు.'ఇఖ్ తిలాఫ్'(విరుద్ధం) అనే పదం కలదు కావున ఖుర్ఆన్ అసత్యం అని రుజువైనది" అని అంటాడు. అప్పుడు నేను, అతనితో ఖుర్ఆన్ యొక్క ఆ వాక్యంను పూర్తిగా చదవమని చెప్పాను. అదేమనగా "**"ఈ ప్రజలు ఖురానును గురించి ఆలోచన చెయ్యరా? ఇది అల్లాహ్ తరఫు నుండి కాక వేరొకరి తరఫునుండి వచ్చి ఉన్నట్లయితే ఇందులో ఎన్నో పరస్పర విరుద్ధాలైన విషయాలు ఉండేవి."** ఖుర్ఆన్ లో ఇఖ్ తిలాఫ్(విరుద్ధత) అనే పదం కేవలం ఒకే ఒక్కసారి వచ్చింది. 'ఇఖ్

తిలాఫున్ కసీరహ్' – అంటే చాలా విరుద్ధ విషయాలు ఉండేవి అని ఖుర్ఆన్ అంటోంది. కావున పదాల ప్రస్తావన పరంగా కూడా ఖుర్ఆన్ సురక్షితంగా ఉంది.

నేను మీకు మరొక ఉదాహరణ ఇవ్వదలుచుకున్నాను. దివ్య ఖుర్ఆన్ లో సూరహ్ ఆలి ఇమ్రాన్ అ.నెం.3, ఆయత్ నెం.59లో ఇలా ఉంది " **అల్లాహ్ దృష్టిలో ఈసా పుట్టుక ఆదమ్ పుట్టుక వంటిదే. అల్లాహ్ ఆదమును మట్టితో చేసి ''అయిపో'' అని ఆజ్ఞాపించాడు, అతను అయ్యాడు."** అర్ధం పరంగా ఈ వాక్యంలో ఎటువంటి అభ్యంతరమూ లేదు. ఎందుకనగా ఆదమ్ మరియు యేసు ఇద్దరు ప్రవక్తలూ మట్టితోనే సృష్టించబడ్డారు. అర్ధ పరంగా ఈ వాక్యం చాలా స్పష్టంగా ఉంది. ఇక ఆ ప్రవక్తల పేర్ల ప్రస్తావన పరంగా పరిశీలించినట్లయితే, మొత్తం ఖుర్ఆన్ లో యేసు వారి పేరు 25సార్లు వచ్చింది మరియు ఆదమ్ వారి పేరు కూడా 25 సార్లే వచ్చింది. కావున ఈ వాక్యం అర్ధ పరంగా మరియు ప్రస్తావన పరంగా కూడా సత్యమే.ఈ వాక్యంలో మరొక అద్భుతం ఏమనగా ఖుర్ఆన్ యొక్క మొదటి అధ్యాయం నుండి ఈ వాక్యం వరకు కూడా ఆ ఇద్దరి ప్రవక్తల పేర్లు సమానంగా 7 సార్లు ప్రస్తావనకు రావడం జరిగింది.

ఇలాంటి ఉదాహరణలు ఖుర్ఆన్ లో చాలా ఉన్నాయి.సూరహ్ ఆరాఫ్ అ.నెం.7, ఆయత్ నెం 176లో "**మా ఆయతులను తిరస్కరించే వారి దృష్టాంతం కుక్క లాంటిది."** అనే వాక్యంను గమనించినట్లయితే 'మా ఆయతులను తిరస్కరించే వారు' అనే వాక్యం ఖుర్ఆన్ లో 5 సార్లు వచ్చింది మరియు కుక్క అనే పదం అరబీలో 'కల్బ్' కూడా ఖుర్ఆన్ లో 5

సార్లు వచ్చింది. కావున ఈ వాక్యం అర్ధం మరియు ప్రస్తావన పరంగా సత్యం.

సూరహ్ ఫాతిర్ అ.నెం.35, ఆయత్ నెం 20 లో ఇలా ఉంది "**చీకటీ, వెలుగూ, ఒకటి కావు."** ఈ వాక్యంలో 'చీకటి' ని అరబీలో 'జూల్మత్' అని, వెలుగును అరబీలో 'నూర్' అని అనడం జరిగింది. ఈ అరబీ పదం 'జుల్మత్' ఖుర్ఆన్ లో 23సార్లు వచ్చింది. అలాగే నూర్ అనే పదం కూడా ఖుర్ఆన్ లో 24సార్లు వచ్చింది. 23 మరియు 24 సమానం కావు. కావున ఈ ఖుర్ఆన్ వాక్యం అర్ధం పరంగా మాత్రమే కాకుండా ప్రస్తావన పరంగా కూడా సరియైనదే అని తెలుస్తుంది.

ఈ విధంగా ఖుర్ఆన్ ఏవైనా రెండు విషయాలను సమానం లేక ఒకేవిధమైనవి అని అంటే అవి అర్ధం మరియు ప్రస్తావన పరంగా కూడా సమానం అని, ఒకవేళ ఖుర్ఆన్ వాటిని సమానం కాదు అని అంటే అవి అర్ధం మరియు ప్రస్తావన పరంగా కూడా సమానం కావడం లేదని పై వాక్యాలను పరిశీలించడం ద్వారా మనకు తెలుస్తుంది. ఇలా ఎన్నో గణిత విషయాలు ఖుర్ఆన్ లో కలవు. మీ ప్రశ్నకు జవాబు లభించిందని ఆశిస్తున్నాను.

8. అస్సలాము అలైకుమ్. నా పేరు కాశ్మీర నజ్మా. నేను కొత్తగా ఇస్లాం స్వీకరించాను. నేను C.A. విద్యార్ధిని. మీరు మీ ప్రసంగంలో ఖుర్ఆన్ లో ఎటువంటి విరుద్ధత లేదు అన్నారు. కాని ఒక వాక్యంలో ఇలా ఉంది 'అల్లాహ్ వారి హృదయాలకు ముద్ర వేశాడు కావున వారు అర్ధం చేసుకోలేరు' అని. కాని మనకందరికీ తెలిసిన

విషయమేమనగా మానవ శరీరంలో ఆలోచించేది మెదడు, హృదయం కాదు. దీనిని వివరించగలరు.

జవాబు:- సోదరి చాలా మంచి ప్రశ్న అడిగింది. ఆమె ఇస్లాం స్వీకరించినందుకు నేను ఆమెను అభినందిస్తున్నాను. సత్యాన్ని నిరాకరించే వారి హృదయాలకు అల్లాహ్ ముద్ర వేశాడు అని ఖుర్ఆన్ లో ఉంది అని ఆమె తెలియజేసిన వాక్యం ఉందని నేను కూడా అంగీకరిస్తున్నాను.

నేడు శాస్త్రీయంగా అభివృద్ధి చెందిన కాలంలో మానవ శరీరంలో ఆలోచించే భాగం మెదడు అని , హృదయం కాదు అని మనకందరికీ తెలుసు. పూర్వకాలంలో ప్రజలు హృదయం ఆలోచిస్తుందని భావించేవారు. మరి ఇది ఖుర్ఆన్ లోని తప్పు కాదా? అని సోదరి ప్రశ్నించింది.

నా ప్రసంగ ప్రారంభంలో నేను ఖుర్ఆన్ లోని 4 వాక్యాలను పఠించాను.అవి 20వ అధ్యాయంలోని 25 నుంచి 28 వరకు, వాటి అర్థం ‘‘**ప్రభూ! నా హృదయాన్ని తెరువు. నా కార్యాన్ని నా కొరకు సులభతరం చెయ్యి. ప్రజలు నా మాటలు అర్థం చేసుకోగలగటానికి, నా నాలుక ముడిని విప్పు.**” ఈ వాక్యాలలో హృదయంకు అరబీలో వచ్చిన పదం ‘**సదర్**’. అరబీలో సదర్ అనే పదానికి రెండు అర్థాలు కలవు. అవి ఒకటి హృదయం మరియు బుద్ధి. కావున ఖుర్ఆన్ లో వారి హృదయాలకు ముద్ర అంటే వారి బుద్ధికి ముద్ర వేశాడు అని అర్థం. అలాగే పై వాక్యంలో హృదయాన్ని తెరువు అంటే బుద్ధిని తెరువు,విశాలం చేయి అని అర్థం. మీ ప్రశ్నకు సమాధానం లభించిందని ఆశిస్తున్నాను.

9.అస్సలాము అలైకుమ్. నా పేరు ఖాలిద్. ఖుర్ఆన్ లో ఇబ్లీసు,ఒక దైవ దూత అని, మరొక చోట జిన్ను అని ఉంది. మరి ఇది ఖుర్ఆన్ లో ఉన్న విరుద్ధత కాదా?

జవాబు:- సోదరుడు అడిగిన ప్రశ్నేమనగా, ఖుర్ఆన్ లో అనేక చోట్ల ఇబ్లీసును దైవదూతగా తెలియజేస్తూ, మరొక చోట ఇబ్లీసును జిన్నుగా చెప్పడం జరిగింది. కావున ఇది విరుద్ధత కాదా? ఖుర్ఆన్ లో అనేక చోట్ల ఆదమ్(అ.స) మరియు ఇబ్లీసులకు సంబంధించిన గాధను తెలియజేయడం జరిగింది. 2, 7, 15, 17, 18 మరియు 20 అధ్యాయాలలో ఈ గాధ వివరంగా తెలియజేయడం జరిగింది. ఖుర్ఆన్ లో 18వ అధ్యాయం, 50 వ వాక్యంలో ఇలా ఉంది **"ఆదమ్‌కు సజ్దా చేయమని మేము దైవదూతలతో అన్నప్పుడు వారు అతనికి సజ్దా చేశారు, కాని ఇబ్లీస్ చేయలేదు. అతడు జిన్నాతులలోనివాడు".**

ఈ ప్రశ్నకు సమాధానం తెలుసుకోవడానికి ఈ క్రింది విషయం తెలిసి ఉండాలి. అదేమనగా ఖుర్ఆన్ అవతరించిన భాష అరబీ. ఆ భాషలో 'తగ్లీబ్' అనే గ్రామర్ పద్ధతి కలదు. ఆ పద్ధతి ప్రకారం ఒక సమూహంలోని అధిక సంఖ్యాఖులను సంబోధిస్తే, ఆ ఆజ్ఞ దానంతట అదే అల్ప సంఖ్యాఖులకు కూడా వర్తిస్తుంది. ఉదాహరణకు 99 మంది అబ్బాయిలు, 1 అమ్మాయి ఉన్న ఒక సమూహంలో అబ్బాయిలను నిలబడమని అరబీలో చెబితే, ఆ అమ్మాయి కూడా నిలబడుతుంది కానీ ఆంగ్లంలో అలా కాదు. ఇది అరబీ భాష గ్రామర్ పద్ధతి.

ఆదమ్‌కు సజ్దా చేయమని మేము దైవదూతలతో అన్నప్పుడు వారు అతనికి సజ్దా చేశారు,

కాని ఇబ్లీస్ చేయలేదు. అతడు జిన్నాతులలోనివాడు. ఈ ఆజ్ఞను అల్లాహ్ ఇస్తున్నప్పుడు అక్కడ అధిక సంఖ్యాఖులు దైవదూతలు మరియు జిన్నులు అల్ప సంఖ్యాఖులు. కావున ఆ ఆజ్ఞ దైవదూతలకే ఇవ్వబడిననూ అది జిన్నులకు కూడా వర్తిస్తుంది. ఖుర్ఆన్ వాక్యం 18:50 ప్రకారం ఇబ్లీసు, జిన్నులలోనివాడు అని తెలుస్తుంది. ఇక మరొక ఆధారం ఏమనగా దైవదూతలకు ఎంపిక స్వేచ్ఛ లేదు, కాని జిన్ను వర్గానికి ఎంపిక స్వేచ్ఛ ఉంది కావున అతడు సజ్దాహ్ చేయలేదు. మీ ప్రశ్నకు జవాబు లభించిందని ఆశిస్తున్నాను.

10.అస్సలాము అలైకుమ్. దైవం ప్రకృతికి అతీతమైనవాడు అని మన అందరి నమ్మకం. దైవం ప్రతి పని చేయగలిగినప్పుడు, మానవ రూపం ధరించలేడా? అని నా యొక్క ముస్లిమేతర సోదరుడు ప్రశ్నించాడు. దీనిని వివరించగలరు.

జవాబు: సోదరి అడిగిన ప్రశ్నేమనగా! దేవుడు ప్రకృతికి అతీతమైనవాడు అని మన అందరి నమ్మకం. దైవం ప్రతి పని చేయగలిగినప్పుడు, మానవ రూపం ధరించలేడా?

దైవాన్ని విశ్వసించే వారిలో చాలా మంది దేవుడు ప్రకృతికి అతీతమైనవాడు అని భావిస్తూ ఉంటారు. ఇక్కడ ఉన్నవారిలో చాలా మంది కూడా ఇలానే భావిస్తూ ఉంటారు. దేవుడు ప్రకృతికి అతీతమైనవాడు కాదు అని భావించేవారు ఎవరైనా ఇక్కడ ఉన్నారా? ప్రకృతికి అతీతమైనవాడు అంటే ప్రకృతి మరియు దేవుడు ఉన్నారు అని అర్ధం. ఒకవేళ దివ్య ఖుర్ఆన్ ప్రకారం దేవుడు ప్రకృతికి అతీతమైనవాడు కాదు అని తెలిసినట్లయితే నిజానికి దేవుడు ప్రకృతికి అతీతమైనవాడు కాదు అని అర్ధం.

ఖుర్ఆన్ లో ఉన్న దైవ భావన ప్రకారం ప్రకృతిని దేవుడు సృష్టించాడు మరియు ప్రకృతి దేవుని ఆధీనంలో ఉంటుంది. దైవం ప్రకృతిని సృష్టించాడు. దేవుడు మానవునిలో సహజ స్వభావాన్ని(ఫిత్రా) సృష్టించాడు.

దివ్య ఖుర్ఆన్ లో అల్లాహ్కు ఇవ్వబడిన గుణవాచకాలలో ఒక గుణవాచకం 'ఫాతిర్.' ఇది ఖుర్ఆన్ లోని 35వ అధ్యాయం పేరు కూడా. ఫాతిర్ అనే పదం ఫిత్రా అనే పదం నుండి వచ్చింది. ఫిత్రా అంటే సహజ స్వభావం. కావున ఫాతిర్ అంటే సృష్టికర్త, సృష్టికి మూలకారకుడు, సృష్టికి మూలమైన మూల పదార్థాన్ని సృష్టించినవాడు, రూపొందించేవాడు అని మరియు విభజించేవాడు అని కూడా అర్థాలు ఉన్నాయి. సూర్య చంద్రుల పనితీరును పరిశీలించమని దివ్య ఖుర్ఆన్ లో ప్రజలకు తెలియజేయడం జరిగింది. అవి ఎన్నడూ కూడా వాటి సహజ నియమాలను మార్చవు. అవన్నీ సహజమైనవి.

అదేవిధంగా, అల్లాహ్ కూడా సహజమైనవాడు. దివ్య ఖుర్ఆన్ లోని 33వ అధ్యాయం ,62వ వాక్యంలో ఇలా తెలియజేయబడింది "**మీరు అల్లాహ్ సంప్రదాయంలో ఏ మార్పునూ కానలేరు.** ఇదే రకమైన విషయం 30వ అధ్యాయం 30వ వాక్యంలో ఇలా ఉంది "**అల్లాహ్ మానవులను ఏ స్వభావం ఆధారంగా సృష్టించాడో దానిపై స్థిరంగా ఉండండి. అల్లాహ్ సృజించిన స్వరూప స్వభావాలు మార్చటానికి శక్యం కానివి, ఇదే సవ్యమైన, తిన్నని ధర్మమార్గం, కాని చాలామందికి తెలియదు.**

నేటి ఆధునిక వైజ్ఞానిక శాస్త్రం మరియు క్వాంటమ్ సిద్ధాంతం ప్రకారం, పర్యవేక్షకుడు లేకుండా ఏ వస్తువూ లేదు.

పర్యవేక్షకుడు లేని విశ్వం నిరర్ధకమైనది. ఇక శాస్త్రవేత్తలకు వచ్చిన సందేహమేమనగా ఆ మొదటి పర్యవేక్షకుడు ఎవరు? అల్లాహ్ యొక్క గుణవాచకాలలో మరొకటి 'అర్-రషీద్' అంటే సాక్షి, పరిశీలకుడు,పర్యవేక్షకుడు. ఖుర్ఆన్ ప్రకారం ఆ మొదటి పర్యవేక్షకుడు అల్లాహ్ నే కావున అల్లాహ్,ప్రకృతికి అతీతమైనవాడు కాడు, దేవుడు సహజమైనవాడు.

ఇక మీ ప్రశ్నలోని రెండవ భాగం ' దేవుడు ప్రతి పని చేయగలడు'. సాధరణంగా నేను ఈ ప్రశ్నను దేవుణ్ణి విశ్వసించే ఆస్తికులకు వేస్తుంటాను, వారు అల్లాహ్ గురించి మంచిగా అవగాహన చేసుకోగలందుకు. నేను వారినడిగే రెండవ ప్రశ్న 'దేవుడు దేనినైనా లేదా ప్రతి దానిని సృష్టించగలడా? వారిలో చాలా మంది 'అవును' అని జవాబిస్తారు. ఇక నేను వారిని అడిగే మూడవ ప్రశ్న ఏమనగా దేవుడు నాశనం చేయలేని వస్తువును సృష్టించగలడా? అని. ఈ మూడు ప్రశ్నలతో వారు చిక్కుల్లో పడిపోతారు. ఒకవేళ వారి జవాబు 'అవును, అయితే దానర్ధం దేవుడు తాను నాశనం చేయలేని వస్తువును సృష్టించాడు అని, ఇది వారి మొదటి వాక్యానికి విరుద్ధం అదేమనగా దేవుడు ప్రతి పని చేయగలడు. ఒకవేళ వారి జవాబు 'కాదు' అయినట్లయితే దానర్ధం దేవుడు తాను నాశనం చేయలేని వస్తువును సృష్టించలేడు అని, ఇది రెండవ వాక్యమైన దేవుడు ప్రతిదీ సృష్టించగలడు అనే దానికి విరుద్ధం. ఇక్కడ వారు తమ తర్కాన్ని ఉపయోగించచక చిక్కుల్లో పడుతున్నారు. ఇదేవిధంగా దేవుడు ఏకకాలంలో పొట్టి-పొడుగు కాగలిగిన మనిషిని సృష్టించలేడు. అవును తాను తలచుకుంటే పొట్టి వాడిని పొడుగు వానిగా, పొడుగు వానిని పొట్టివానిగా మార్చగలడు, మధ్యస్థంగా ఉండే వాడిని కూడా సృష్టించగలడు కాని ఒకేసారి పొట్టి-పొడుగు కాగలిగే మనిషిని సృష్టించలేడు.

ఇదేవిధంగా దేవుడు ఏకకాలంలో లావుపాటి మరియు బక్కగా ఉండగల మనిషిని సృష్టించలేడు. దేవుడు చేయలేని పనులు ఇంకా చాలానే ఉన్నాయి. ఆయన అబద్ధం ఆడలేడు, అన్యాయం చేయలేడు, మరచిపోలేడు మరియు క్రూరంగా ఉండలేడు. పై పనులు చేయగానే ఆయన దేవుడు కావడానికి అనర్హుడు అయిపోతాడు. దేవుడు నన్ను తన సామ్రాజ్యంలో నుంచి బయటకు విసరి వేయలేడు. ఈ ప్రపంచం, విశ్వం మొత్తం తనదే. ఆయన నన్ను చంపగలడు, నాశనం చేయగలడు. కానీ తన సామ్రాజ్యం నుంచి బయటకి విసరి వేయలేడు. ఈ సర్వం ఆయనదే అయినప్పుడు ఆయన నన్ను ఎక్కడికి విసరి వేయగలడు.

దేవుడు ప్రతి పని చేయగలడు అని దివ్య ఖుర్ఆన్ లో ఎక్కడా లేదు. వాస్తవానికి ఖుర్ఆన్ లో 2:106,108; 3:29; 16:77; 35:01 అధ్యాయాలలో “ఇన్నల్లాహ అలా కుల్లి షై ఇన్ ఖదీర్” అనగా “**నిశ్చయంగా అల్లాహ్ కు అన్నింటి మీద సర్వాధికారాలు ఉన్నాయి**” అని ఉంది. అదేవిధంగా ఖుర్ఆన్ లో 85: 15-16 వాక్యాలలో **అల్లాహ్ తాను తలచిన దాన్ని చేయగలవాడు** అని ఉంది. కావున అల్లాహ్ కేవలం దైవత్వపు పనులు మాత్రమే చేస్తాడు. ఆయన దైవత్వానికి విరుద్ధమైన పనులు చేయడు.

ఇక మీ ప్రశ్నలో ప్రధాన అంశం ‘దేవుడు మానవ రూపం ఎందుకు ధరించలేడు’ను పరిశీలిద్దాము. ఈ రకమైన తత్వాన్ని ఆన్థ్రోపోమాఫిజమ్ అని అంటారు.దేవుడు మానవ రూపం ధరిస్తాడు అనడానికి వీరు ఒక లాజిక్ ఉపయోగిస్తారు అదేమనగా దేవుడు మానవ రూపం ధరించడం ద్వారా మానవులకు ఎదురయ్యే కష్ట నష్టాల అనుభూతిని తెలుసుకొని తదనుగుణంగా మానవులకు

మార్గదర్శం చేస్తాడు అని. కానీ మనం జాగ్రత్తగా పరిశీలిస్తే వారి ఈ తర్కం పరీక్షకు నిలబడలేదు.

ఉదాహరణకు ఒకవేళ నేనే గనక ఒక TV లేక టేప్ రికార్డర్ ను కనుగొన్నట్లయితే, దానికి ఏది మంచిదో లేక ఏది చెడ్డదో తెలియ జేయడానికి నేనే టేప్ రీకార్డర్గా లేక TV గా మారవలసిన అవసరం లేదు. కేవలం అది పనిచేయు విధానం మరియు దానికి సంబందించి మంచి చెడులు తెలియజేసే సూచనల పుస్తకం ఇస్తే సరిపోతుంది. అదేవిధంగా మానవులకు మార్గదర్శం చేయడానికి మరియు వారికి సంబందించిన మంచి చెడులు తెలియజేయడానికి మానవులలో నుంచే ఒక వ్యక్తిని ఎన్నుకొని ఆయన ద్వారా మార్గదర్శక పుస్తకం అందజేస్తే సరిపోతుంది. అంతేగానీ స్వయంగా దేవుడే మానవ రూపం ధరించాల్సిన అవసరం లేదు. ఆ మార్గదర్శక పుస్తకమే దివ్య ఖుర్ఆన్. ఇక మేరు నన్నడగవచ్చు 'దేవుడు మానవునిగా మారలేడా అని'. అవును మారగలడు. కానీ మానవునిగా మారిన మరుక్షణమే ఆయన దేవునిగా ఉండడానికి అనర్హుడు అవుతాడు. ఎందుకనగా దేవుడు శాశ్వతమైనవాడు. మానవుడు అనిత్యుడు.ఏ ఒక్కరూ కూడా ఏకకాలంలో శాశ్వత మరియు ఆశాశ్వత రూపాలను కలిగి ఉండలేరు. మానవులకు కొన్ని పరిమితులు, గుణగణాలు,లోపాలు ఉన్నాయి.ఉదాహరణకు తినుట,త్రాగుట మరియు నిద్రించుట. అందుకే ఖుర్ఆన్ లో అల్లాహ్ ఇలా అంటున్నాడు **"ఇలా అను : ''భూమ్యాకాశాల సృష్టికర్త, ఉపాధి ప్రదాతేగాని ఉపాధి గ్రహీత కానివాడు అయిన అల్లాహ్ను కాదని నేను మరెవరినయినా నా సంరక్షకుడుగా చేసుకోవాలా?''"** (దివ్య ఖురాన్ 6:14). మానవులకు ఆహారం తినవలసిన అవసరం ఉంది. దేవునికి కూడా ఆహారం అవసరమా? దివ్య ఖుర్ఆన్ లో 2:255 లో ఇలా ఉంది

“ఆయన నిదురపోడు, ఆయనకు కునుకూ రాదు”.దేవునికి నిద్ర పోవాల్సిన అవసరం లేదు.మానవునికి తినుట,త్రాగుట,నిద్రించుట మరియు విశ్రాంతి అవసరం. కావున దేవుడు భూమి పైకి వచ్చి ఒకే కాలంలో శాశ్వత,ఆశాశ్వత రూపాలలో ఎలా ఉండగలడు? ఇది తర్క విరుద్ధం.

కావున దేవుడు సహజమైనవాడు. దేవునికి ప్రతిదాని పై అధికారం కలదు. తాను తలచిన దానిని చేయగలిగే వాడు. మీ ప్రశ్నకు సమాధానం లభించిందని ఆశిస్తున్నాను.

11. నా పేరు ఆస్టిన్ ఫిలిప్స్ . నేను ఒక క్రైస్తవుడిని. నా ప్రశ్న ఏమనగా ఇస్లాం, యేసుక్రీస్తు దేవుడు కాదు మరియు ఆయన శిలువపై చనిపోలేదు అని బోధిస్తుంది. అలాగే ఆయన తండ్రి లేకుండానే కన్యక అయిన మరియం గారి గర్భాన జన్మించారని మరియు సజీవంగానే ఆకాశం పైకి ఎత్తుకో బడ్డారు అని అని ఇస్లాం బోధిస్తుంది. కానీ ముహమ్మద్ ప్రవక్త గారిది సహజమైన పుట్టుక అలాగే ఆయన మరణం కూడా సహజమైనదే. అటువంటప్పుడు యేసువారు ముహమ్మద్ ప్రవక్త వారి కంటే గొప్ప అని ఎందుకు భావించరు? మరియు బైబిల్ లో ఉన్నయేసు వారి బోధనలను ఎందుకు ప్రచారం చేయరు?.

జవాబు: సోదరుడు చాలా మంచి ప్రశ్న అడిగాడు సాధారణంగా ఇటువంటి ప్రశ్నలను క్రైస్తవ మిషనరీలు అడుగుతూ ఉంటారు. సోదరుడు ఆ సంస్థకు చెందిన వాడు అవునో కాదో నాకైతే తెలియదు. సోదరుడు అడిగిన ప్రశ్న ఏమనగా ఖుర్ఆన్ యేసు క్రీస్తు వారి గురించి ప్రస్తావిస్తూ ఉంది . ఖుర్ఆన్ ప్రకారం

యేసుక్రీస్తు వారు సజీవంగా పైకి లేపోకోబడినారు. కానీ ముహమ్మదు ప్రవక్త గారు అలా కాదు. అదేవిధంగా గా యేసుక్రీస్తు వారు కన్యక అయిన మరియం గారి గర్భాన జన్మించారు. కానీ ముహమ్మద్ ప్రవక్త గారికి తల్లి, తండ్రి ఇద్దరూ ఉన్నారు. అదేవిధంగా ఖుర్ఆన్ లో ఏసుక్రీస్తు ప్రస్తావన 25 సార్లు వచ్చింది కానీ ముహమ్మద్ గారి ప్రస్తావన కేవలం 5 సార్లు మాత్రమే వచ్చింది. మరి ఎవరు గొప్ప? ఇలాంటి ప్రశ్నలు ముస్లిములను అడిగినప్పుడు వారిలో చాలామంది గాభరా పడుతుంటారు.

సోదరా! యేసు వారిని తప్పకుండా విశ్వసించాలి అని చెప్పే క్రైస్తవేతర ఏకైక ధర్మం ఇస్లాం మాత్రమే. ఏ ముస్లిం అయినా యేసు క్రీస్తును విశ్వసించక పోతే అతడు ముస్లింగా ఉండలేడు. ఇంకా యేసు వారు అల్లాహ్ మహిమ వలన తండ్రి లేకుండా పుట్టారని ప్రతి ముస్లిం విశ్వసిస్తాడు. ఈ విషయాన్ని చాలా మంది ఆధునిక క్రైస్తవులు విశ్వసించరు. ఇంకా యేసు వారు మరణించినవారిని దేవుని అనుమతితో బ్రతికించారని, పుట్టు గ్రుడ్డి వ్యక్తికి దేవుని అనుమతితో చూపును తెప్పించారని ప్రతి ముస్లిం విశ్వసిస్తాడు. కానీ ఆయన దేవుడు కాదని, దేవుని జనితైక కుమారుడు అంతకన్నా కాదని ప్రతి ముస్లిం నమ్ముతాడు. ఆయన దేవుని ప్రవక్త అని విశ్వసిస్తారు.

ఇక మీ ప్రశ్నను పరిశీలించినట్లయితే, కేవలం తండ్రి లేని కారణంగానే యేసు వారు దేవుడు అయినట్లయితే దీనికి సమాధానంగా ఖుర్ఆన్ ఇలా అంటుంది **“అల్లాహ్ దృష్టిలో ఈసా పుట్టుక ఆదమ్ పుట్టుక వంటిదే. అల్లాహ్ ఆదమును మట్టితో చేసి ‘‘అయిపో’’ అని ఆజ్ఞాపించాడు, అతను అయ్యాడు.” (**దివ్య ఖుర్ఆన్ 3:59).

యేసు వారికి తల్లి అయినా ఉంది, కానీ ఆదమ్ వారికి తల్లి, తండ్రి ఇద్దరూ లేరు కావున ఆదమ్ వారు పెద్ద దేవుడు కావాలి. అలాగే బైబిలులో మెల్కిసెదే అనే రాజుకు ఆది, అంతము లేవు, చావు, పుట్టుకలు లేవు. ఆ విధంగా చూస్తే ఆయన ఆదమ్ కంటే కూడా పెద్ద దేవుడు కావాలి. మరి ఈ విషయాన్ని క్రైస్తవ సోదరులు అంగీకరిస్తారా? అలాగే ఖుర్ఆన్ లో యేసు వారి ప్రస్తావన 25 సార్లు వచ్చింది, ముహమ్మద్ వారి ప్రస్తావన 5 సార్లు మాత్రమే వచ్చింది ఎందుకనగా ఖుర్ఆన్ ముహమ్మద్ ప్రవక్త గారిపై అవతరించింది కావున ఆయన ప్రస్తావన వచ్చినప్పుడల్లా పేరుతో ప్రస్తావించవలసిన అవసరం లేదు. సర్వనామంతో అనగా "ఓ ప్రవక్తా!, ఆయన , నీవు" అని చాలా సార్లు వచ్చింది గమనించండి. ఇక ఖుర్ఆన్ కాలంలో యేసు వారు అక్కడ లేని కారణంగా ఆయన ప్రస్తావన వచ్చినప్పుడు ఆయన పేరు తీసుకోవడం తప్పనిసరి. దీనర్థం యేసు వారు ముహమ్మద్ ప్రవక్త గారి కంటే గొప్ప అని కాదు. అలా అయితే మోషే ప్రవక్త గారి పేరు ఖుర్ఆన్ లో 132 సార్లు వచ్చింది. దీనర్థం మోషే వారు యేసు వారి కంటే గొప్ప అనా? కాదు. ఆ సమయంలో వారు అక్కడ లేరు కావున వారి గురించి చెప్పాల్సి వచ్చినప్పుడు వారి పేరు తీసుకోవాలి . మీ ప్రశ్నకు సమాధానం లభించిందని ఆశిస్తున్నాను.